RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

20 డిసెంబర్ 2024 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:172

# ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌పై కేటీఆర్ పై ఏసీబీ కేసు నమోదు

## ఏ1గా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఏ2గా ఐఏఎస్ ఆఫీసర్ అరవింద్ కుమార్





హైదరాబాద్ డిసెంబర్ 19ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏ1గా, ఐఏఎస్ ఆఫీసర్ అరవింద్ కుమార్‌ను ఏ2గా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఓ ప్రయివేటు కంపెనీ సీఈవో బీఎల్ఎన్ రెడ్డిని కూడా నిందితుల జాబితాలో చేర్చారు ఏసీబీ అధికారులు.కేటీఆర్‌పై విచారణ జరిపేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇటీవల అనుమతించిన సంగతి తెలిసిందే. గవర్నర్ అనుమతితో తదుపరి చర్యలకు కాంగ్రెస్ సర్కార్ ఉపక్రమించింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని కేటీఆర్‌పై అభియోగం మోపారు. కేటీఆర్‌పై 4 సెక్షన్లు.. 13(1)o, 13(2)పీసీ యాక్ట్, 409, 120ి కింద కేసు నమోదు చేసింది ఏసీబీ.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఫార్ములా ? ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టాలని కేటీఆర్ కాసేపటి క్రితం అసెంబ్లీ లాబీలో డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. కానీ రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అసెంబ్లీలో చర్చకు పెట్టే దమ్ము లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెడితే ఎవరు ఏంటో ప్రజలే నిర్ణయించుకుంటారు. రేవంత్ రెడ్డి లీకులిచ్చి రాజకీయ దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. ఫార్ములా ఈ రేస్, ఇతర స్కాములంటూ అసత్యాలను ప్రచారం చేసే కన్నా సభలో చర్చ పెడితే నిజాలు తెలుస్తాయి కదా..? చర్చ నాలుగు గోడల మధ్య కాదు దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టమని డిమాండ్ చేస్తున్నాం. లీకు వీరుడు సీఎం ఇచ్చే లీకులే తప్ప నిజాలు అధికారికంగా చెప్పే దమ్ములేదు అని కేటీఆర్ అన్నారు.ఈ ఫార్ములా రేస్‌లో విషయమే లేనప్పుడు ముందే నేను కోర్టులకు వెళ్లి ముందస్తు బెయిల్ అడగాల్సిన అవసరం లేదు. న్యాయంగా వ్యవహరించే, ప్రభుత్వ ఆరోపణలు పరిశీలిస్తే ఏ జడ్జి అయినా వేంటనే కేసు కొట్టేస్తారనే నమక్కముంది. అధికారికంగా చెప్పే దమ్ములేక కేబినెట్‌లో నాలుగు గంటల చర్చ అంటూ వార్తలు రాపిస్తున్నారు. కేబినెట్ అంటే గాసిప్ బ్యాచ్ లెక్క తయారైంది. నిజాలు చెప్పే దమ్ము లేఖ సీఎస్‌తో నోటీసులు, అనుమతులు అంటూ లీకులిస్తున్నారు అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఉన్నవి లేనట్టు.. లేనివి ఉన్నట్టు చెప్పడంలో హరీశ్ రావు దిట్ట

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం



హైదరాబాద్ డిసెంబర్ 19;ఉన్నవి లేనట్టు.. లేనివి ఉన్నట్టు చెప్పడంలో హరీశ్ రావు దిట్ట అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అప్పులపై హరీష్ రావు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సంవత్సరం కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష కోట్ల అప్పు చేశారని హరీష్ రావు ఆరోపిస్తున్నారని.. కానీ, తమ సర్కార్.. ఎఫ్ఆర్ఎంబీకి లోబడి ఈ ఏడాదిలో రూ.52వేల కోట్ల అప్పు మాత్రమే తెచ్చామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సర్కార్ రూ.3 లక్షల కోట్లే అప్పు చేసిందని.. కానీ, కాంగ్రెస్ రూ.7లక్షల కోట్లు అప్పు చేసిందని తప్పుడు ప్రచారం చేశారని హరీశ్ ఆరోపించారు.దీనిపై డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గత సర్కార్ చేసిన అప్పులతో పాటు పెండింగ్ బిల్లులు కూడా ఉన్నాయని, ఈ రెండు కలిసి మొత్తం రూ.7 లక్షల 10 వేల కోట్ల అప్పు ఉందని చెప్పారు. పదేళ్ల అప్పులు తప్ప.. బిఆర్ఎస్ చేసిందేమి లేదని ఆయన విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.20 వేల 600 కోట్లు రైతు రుణమాఫీ చెల్లించామని చెప్పారు. బిఆర్ఎస్ నాలుగేళ్లు చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందని విమర్శించారు. ఇప్పటికే రూ.24 వేల కోట్లకు పైగా మేము అప్పులు తీర్చామని, మార్చి నుంచి ఇప్పటి వరకు మొదటి తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్నారు. అలాగే, రైతులకు ఉచితంగా నాణ్యమైన విద్యుత్‌ను ఇస్తున్నామని, మహిళల కోసం మహాలక్ష్మి పథకం అమలు చేశామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టుకుంటూ వెళ్తున్నామని డిప్యూటీ సీఎం భట్టీ చెప్పారు.

# ఫార్ములా రేస్ పై చర్చ పెట్టండి

హైదరాబాద్, డిసెంబర్ 19,ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార అరోపణలు చేస్తున్నది. ఇదే విషయం మీద ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు సీఎం కార్యాలయం నుండి మీడియాకు ఇస్తున్నారు. అయితే ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా తెలంగాణ శాసన సభ లో 4 కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయి.తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకుంది. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకుంది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ది చేకూరింది అని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 2024లో మరో దఫా రేస్ జరగవలసి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని ఏకపక్షంగా రద్దు చేసింది. అప్పటి నుండి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఫార్ములా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహాలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది. నిజానికి ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగింది. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయి అని ఇదివరకే నేను వివరంగా చెప్పడం జరిగింది. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉంది. కనుక మీరు శాసనసభలో ఈ అంశంపై చర్చ పెట్టాలని నేను డిమాండ్ చేస్తున్నాను. అన్ని విషయాలు సవివరంగా రాష్ట్ర ప్రజలకు శాసన సభ వేదికగా చెబుదాం. శాసన సభ సెషన్ జరుగుతున్నది కనుక మీకు అనుకూలమైన రోజే ఈ చర్చను పెట్టండి.మరోసారి చెబుతున్నాను. ఫార్ములా-ఈ అంశంలో ఎలాంటి అవకతవకలు కానీ, అవినీతి కానీ జరగలేదు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే ఈ రేస్ను కేవలం మీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారు. దీనిపైన శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయి. ' అని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత కేటీఆర్ రాసిన లేఖలో ప్రస్తావించారు.

# అమిత్ షా వ్యాఖ్యాలపై బీఆర్ఎస్ ఎందుకు మౌనం

## మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ అంబేద్కర్ ని అవమాన పరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను వెంటనే భర్తరఫ్ చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేసారు. గురువారం అయన అసెంబ్లీ మీడియాతో పాయింట్ దగ్గర మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అమిత్ షా మీద ఎస్సి ఎస్టీ కేసులు నమోదు చేయాలి . జాయింట్ పార్లమెంట్ కమిటీ మీద బీఆర్ఎస్ పార్టీ స్టాండ్ ఎంటి. రాజ్యసభ లో ఉన్న మీ ఎంపి లకు ఏం నిర్దేశ్యం చేశారో తెలంగాణ ప్రజలకు చెప్పాలి. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గారిని బీజేపీ అవమాన పరిస్తే బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉంటుందో చెప్పాలని అన్నారు.

దానిపైన ప్రతిపక్ష పార్టీగా సభలో తీర్మానం ప్రవేశపెట్టి అమిత్ షా ను భర్తరఫ్ చేయాలి అరెస్టు చేసి జైల్లో పెట్టాలి అనే మాట ఎందుకు చెప్పడం లేదు . డా,, బాబా సాహెబ్ అంబేద్కర్ మీద మాట్లాడిన అమిత్ షా పై తెలంగాణ వ్యాప్తంగా దళిత సంఘాలు పోలీస్ స్టేషన్ లలో పిర్యాదు చేస్తాయి. అంబేద్కర్ గారిని అవమాన పరిచే విధంగా. దేవుడిని మొక్కితే ముక్తి దొరుకుతుంది అనే విధంగా జాతిని అవమానపరిచ్చినట్టే. బీజేపీ స్టాండ్ అంబేద్కర్ పై ఏముందో కిషన్ రెడ్డి బండి సంజయ్ మనస్మృత వాదులు చెప్పాలి. బీఆర్ఎస్ పార్టీ అమిత్ షా వ్యాఖ్యల పై స్పందించాలి. ముఖ్యమంత్రి చెప్పినట్టు ఆధాని పై మీ స్టాండ్ చెప్పాలి. ఢీల్లీ లో దోస్తీ గల్లీలో కుస్తీ . బీజేపీ ఆదాని కి మధ్య ఉన్న స్నేహం పై జేపీసీ వేయాలని చెప్పాం. బీఆర్ఎస్ స్టాండ్ ఎంటి. సభ లో అమిత్ షా అంబేద్కర్ మీద ఆరోపణలు చేస్తే బీఆర్ఎచస్ ఎందుకు మాట్లాడడం లేదు. బీజేపీ కి స్వాతంత్ర్య నిర్మాణం లో పాత్ర లేదు .. ఇంగ్లీష్ వాళ్ళకి తావేదారులుగా పని చేసిన పార్టీ. మీకు స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర కూడా లేదు. రాజ్యాంగ నిర్మాణంలో వారి పాత్ర లేదు. బి ఆర్ అంబేద్కర్ దేశ రాజ్యాంగాన్ని రాయడంలో ఆయన జ్ఞాన సంపద తో ఆయనకు అవకాశం వచ్చింది. డా,, బి ఆర్ అంబేద్కర్ మాట ప్యాషన్ అయిందని అనడం తప్పు కాదా. బీజేపీ మీ స్టాండ్ చెప్పాలని అన్నారు.

# రాహుల్ గాంధీపై ఎన్డీఏ.. బీజేపీపై కాంగ్రెస్ ఎంపీల ఫిర్యాదు

వార్తా 2 లో

# వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు"



రేపు, ఎల్లుండి జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు సూచించారు. మహిళా రైతులు కూర్చోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈరోజు ఉదయం వ్యవసాయ కార్యదర్శి, ఘ్రాజ వీ . రఘునందన్ రావు ×ూూ , కమిషనర్ దీ . గోపి ×ూూ లతో కలిసి మంత్రి రాజేంద్రనగర్ లోని ౖాజీూఖ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆడిటోరియంను పరిశీలించారు. ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఇతర ఉన్నతాధికారులు జరుగుతున్న ఏర్పాట్లను మంత్రికి వివారించారు. కార్యక్రమాల నిర్వహణలో సమయపాలన పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులకి ఉపయోగపడేలా, ఆవరణలో అనువైన ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ కులపతి గౌరవ జిష్ణు దేవ్ వర్మ, గౌరవ ముఖ్య మంత్రి ూ . రేవంత్ రెడ్డి, పర్యటన, ప్రసంగ కార్యక్రమాల్లో సమయపాలన పాటించాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

# విమానాశ్రయంలో తెలంగాణ పర్యాటక సమాచార కేంద్రం ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ సరికొత్త ఆవిష్కరణలు శ్రీకారం చుడుతుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తెలంగాణ తెలంగాణ పర్యాటక సమాచార కేంద్రాన్ని మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పర్యాటక శాఖ చేపడుతున్న సంస్కరణలో భాగంగా పర్యాటకులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన వారసత్వ ప్రదేశాలు, సుసంపన్నమైన సాంస్కృతిక వైవిధ్యం, అబ్బురపరిచే ప్రకృతి దృశ్యాలను సందర్శించేందుకు వచ్చే దేశీయ, విదేశీయ సందర్శకుల కోసం రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలు, హరిత హొటల్స్, టూర్ ప్యాకేజీలు, రిజర్వేషన్, వెళ్లే మార్గాలు (రూట్ మ్యాప్) వంటి సమాచారాన్ని అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమాచార కేంద్రంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 10 గంటల వరకు సందర్శకులకు సేవలు అందుబాటులో ఉంటాయి.ఇప్పటికే పర్యాటక సంస్థ బషీర్‌బాగ్, బేగంపేట టూరిజం ప్లాజా, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ యాత్రినివాస్, శిల్పారామంతో పాటు ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో సమాచార, రిజర్వేషన్ కేంద్రాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మెనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణిక్కర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

20 డిసెంబర్ 2024 శుక్రవారం

# వలస కార్మికులకు ఏది భరోసా?

ఎక్కడ నుంచో వచ్చి పని చేస్తున్న తమకు హక్కూ, చట్టమూ వుందని తెలీక కాంట్రాక్టర్ ఇచ్చిన కూలి తీసుకోవడం తప్ప ఎదిరించడంలేదు. చేయమన్నంత కాలం పని చేయడమే తప్ప పని గంటల లెక్క వారికి తెలీదు. ఇచ్చినంత పుచ్చుకోవడమేగానీ ఇంత తక్కువ ఇచ్చారేమని అడిగే ధైర్యమూ వారికి లేదు. ఇంటికి వెళ్లకూడదంటే బాధతో పని చేయడమే తప్ప ఎందుకు పంపరని ప్రశ్నించడంలేదు. ఎక్కడ పనిచేయాలని చెబితే అక్కడ పనిచేయడమే తప్ప అది ప్రమాదకర ప్రదేశమని, ఏ చిన్న ప్రమాదం జరిగినా తాను చనిపోతానని ఏ కోశానా అనుకోడు. ఇదంతా తన కుటుంబాన్ని పోషించుకోవడానికి చేస్తున్న పనిగానే వలస కార్మికుడు భావిస్తున్నాడు. ఇదే పరిశ్రమాధిపతులకు, లేబర్ కాంట్రాక్టర్లకు ఒక వరంగా మారింది. వలస కార్మికులను మోసగించడానికి ఇదొక అస్త్రమైంది. విద్యార్హతలు కల్గిన వారికి ఎక్కువ జీతం ఇవ్వాల్సి వస్తుందని, తక్కువ జీతానికి పనిచేస్తున్న వలస కార్మికులను ప్రమాదకర ప్రదేశాల్లో పెట్టుకొని పనిచేయించడంతో ప్రతీ ప్రమాదంలోనూ వీరు చనిపోవడమో, తీవ్రంగా గాయపడ్డమో జరుగుతోంది. అచ్యుతాపురం సెజ్‌లోని అసెన్షియా, సీనర్జిన్ కంపెనీ, వివిధ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో చనిపోయిన, గాయపడినవారు ఎక్కువ మంది వలస కార్మికులే. యజమానులు ఏ పరిహారం చెల్లించకుండా, వైద్యం చేయించకుండానే వారిని సొంత ప్రాంతాలకు పంపిస్తున్న ఘటనలున్నాయి. సిఐటియు జోక్యం చేసుకున్న చోట బాధిత వలస కార్మిక కుటుంబాలకు కొంత న్యాయం జరుగుతున్నా, బయటకు తెలీని ప్రమాదాల్లో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. మృత దేహాలను, క్షతగాత్రులను రహస్యంగా సొంత ప్రాంతాలకు పంపిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (జెఎన్‌పిసి), అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా, ఇతర పరిశ్రమలు, హెటిరో, డెక్కన్ కెమికల్ పరిశ్రమలోనూ, ఎన్ఎఒబి నిర్మాణంలోనూ జరిగిన ప్రమాదాల్లో ప్రాథమిక వైద్యం చేయించకుండానే ఇళ్లకు పంపిన విషాదకరమైన పరిస్థితులున్నాయి.

అస్సాం, బీహార్, చత్తీస్‌గఢ్, జార?ండ్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది వలస కార్మికులు ఇక్కడ వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్నారు. వీరికి పని, వేతన భద్రత లేదు. కనీస సదుపాయాల్లేని జైలు కంటే ఘోరమైన చీకటి రేకుల షెడ్లలో బంధించినట్లు వలస కార్మికులను పెడుతున్నారు. మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు సౌకర్యం వీరికి వుండదు. రాత్రి డ్యూటీ చేసుకొని నిద్ర పోదామన్నా సరైన వసతి లేదు. పరిశ్రమల్లోనే కాదు, ప్రమాదకరమైన, కఠినమైన నిర్మాణ పనుల్లోనూ వలస కార్మికులు వున్నారు. ఎన్ఎఒబి నిర్మాణ పనుల్లో స్థానిక నిర్వాసిత, ప్రభావిత గ్రామాలకు చెందిన 371 మంది వుండగా, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు దాదాపు నాలుగు వేల మంది వున్నారు. ప్రతీ 20 మంది కార్మికులలో ఒకరు వలస కార్మికుడు అని అంచనా. దేశంలో వలస కార్మికుల ఆకలి కేకలు, మరణాల వార్తలు పదే పదే వస్తున్నాయని.. వారికి సాయం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్టాయని సుప్రీంకోర్టు పలుసార్లు ప్రశ్నించింది. కోవిడ్ సందర్భంలో తమ సొంత ప్రాంతాలకు వెళ్లడానికి వలస కార్మికులు పడ్డ కష్టాలపై సుప్రీంకోర్టు చలించిపోయింది. "స్వస్థలాలకు వెళ్లాలని ప్రయత్నిస్తున్న వలస కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు మాకు ఆందోళన కలిగిస్తున్నాయి. వారికి రిజిస్ట్రేషన్, రవాణా, ఆహారం, తాగునీరు అందించడంలో పలు లోపాలను మేం గుర్తించాం" అని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు వలస కార్మికుల బతుకుల్లో ఏ మార్పూ లేదు. ఏ సదుపాయాలూ వారు పొందడంలేదు. వలస కార్మికుల చట్టం 1979 ప్రకారం వారికున్న హక్కులేవీ అమలుచేయడంలేదు. వలస కార్మికులను పనిలో నియమించుకొనే కాంట్రాక్టర్లు లైసెన్సులు పొందాలన్న నిబంధన సరిగా పాటించడంలేదు. పాటించిన కొంతమంది కాంట్రాక్టర్లు వారికి నివాసిత ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించడంలేదు. వలస కార్మికుల నుంచి కమీషన్ పొందడంపై వున్న శ్రద్ధ, వారి బాగోగులపై వుండడంలేదు. కుటుంబాలకు విద్య, వైద్య సదుపాయం కల్పించాలన్న నిబంధన అమలుచేయడంలేదు. ప్రయాణ చార్జీలు ఇవ్వడం లేదు. సెలవులు సరిగా ఇవ్వరు. కనీస వేతనాలు చెల్లించరు. అత్యవసర పరిస్థితుల్లో ఇళ్లకు వెళ్లాలన్నా పంపించరు.

వలస కార్మికుల చట్టం 1979 కార్మికుల హక్కులను, ప్రయోజనాలను పరిరక్షించే అతి ముఖ్యమైన చట్టం. యజమానుల దోపిడి నుంచి రక్షించే చట్టం ఇది. వలస కార్మికుడిని పనిలో పెట్టుకొనేముందు ప్రతీ కాంట్రాక్టర్ తప్పనిసరిగా సంబంధిత అధికారి నుంచి లైసెన్స్ పొందాల్సి వుంది. వలస కార్మికులను గుర్తించి, వారి ప్రాంతాలను నోటిఫై చేసే బాధ్యతను కార్మికశాఖ తీసుకోవడంలేదు. ఏ వివరాలనూ గుర్తించడంలేదు. ఏ వర్కర్ ఎక్కడ నుంచి ఎప్పుడొచ్చాడో, ఏ పరిశ్రమలో ఎంతమంది వలస కార్మికులు ఏ పని చేస్తున్నారో సమాచారం సేకరించరు. వారికి కనీస సదుపాయాలు, వసతులు లభిస్తున్నాయో లేదోనన్న స్థానిక పరిశీలన అసలే లేదు. కనీస వేతనాల చట్టం 1948 నిబంధనల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మికులకు షెడ్యూల్ ఉద్యోగులతో సహా వేతనాలు సవరించాల్సి వుంది. వలస కార్మిక చట్టంలోని సెక్షన్ 13 ప్రకారం అంతర్రాష్ట్ర వలస కార్మికులకు కనీస వేతనాల చట్టం 1948 సెక్షన్ 41 ప్రకారం నిర్ణయించిన వేతనాల కంటే తక్కువ చెల్లించకూడదు. పని, నివాసిత ప్రాంతాల్లో వలస కార్మికులపై ఎటువంటి దౌర్జన్యాలకు పాల్పడకుండా తగిన రక్షణ చట్టాలున్నాయి. అయితే, సరళీకరణ నేపథ్యంలో పరాయీకరణ పెరిగింది. యాజమానులు తమ దోపిడీని మరింత విస్తృతం చేసుకోవడానికి వలస కార్మికులతో రాత్రి, పగలు అత్యధిక గంటలు పని చేయిస్తున్నారు.

అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మికుల చట్టాల అమలుపై శ్రద్ధ పెట్టడం లేదు. యాజమాన్యానికి అనుకూలమైన విధానాలు, చట్టాలను తీసుకొచ్చాయి. దీంతో అవి దేశంలో 4.14 కోట్లకు పైగా వున్న వలస కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకొనే అమానవీయ పద్ధతులను అనుసరిస్తున్నాయి. ప్రధానంగా సెజ్‌లలో కార్మిక సంఘాలు పెట్టుకొనే అవకాశం లేకపోవడంతో కాంట్రాక్టర్లు, యజమానులకు వలస కార్మికులను దోపిడీ చేయడం, మోసగించడం మరింత సులభమైంది. అయితే, కేరళలో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం వలస కార్మికులను అతిథి కార్మికులుగా గుర్తించి ప్రత్యేక చట్టాలు చేసింది. కనీస వేతనాలు అమలు చేస్తోంది. సంక్షేమ పథకాలు వర్తింపజేస్తోంది. ఈ తరహా రక్షణ మిగిలిన రాష్ట్రాల్లో చేయాల్సిన అవసరముంది. మన రాష్ట్రంలో వలస కార్మికులకు పని ప్రాంతంలో రక్షణకు ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. సొంత రాష్ట్ర ప్రజల వలె ఉచిత వైద్యం, ఉచిత రేషన్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వ పథకాలు అందజేయాలి. పిల్లలకు ఉచిత విద్య అందించాలి. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వలస కార్మికులను గుర్తించి ప్రభుత్వ వెబ్‌సైట్లో వారి వివరాలు నమోదు చేయాలి. వారికి స్థానికంగా ఏ సమస్య వచ్చినా పరిష్కరించే లైజనింగ్ అధికారిని నియమించాలి. స్థానిక ప్రాంతాల్లో ఉపాధి లేక కుటుంబ పోషణ కోసం వేర్వేరు ప్రాంతాల్లో పని చేసే వలస కార్మికులను మనుషులుగా గుర్తించాలి. అన్ని రక్షణలూ వారికి కల్పించాలి.

# జాతీయ స్థాయి అవార్డులు సాధించిన అధికారులను అభినందించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** జాతీయస్థాయిలో అవార్డులు సాధించిన జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో అభినందించారు. ప్రశంసా పత్రం, జ్ఞాపికలను కలెక్టర్ చేతుల మీదుగా వారికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో జిల్లా పేరును నిలబెట్టిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. జిల్లాకు రెండు విభాగాల్లో జాతీయ స్థాయి అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. మున్ముందు మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. అవార్డులు అధికారుల పనితీరుకు కొలమానమని తెలిపారు. కాగా నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గణపతి మహిళా స్వయం సహాయక బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రానికి, ఉపాధి హామీ పథకంలో భాగంగా అధిక పని దినాలు కల్పించినందుకు గాను పెంబి మండలం ఇటిక్యాల గ్రామ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు, ఉపాధి హామీ కూలీల అవార్డులు లభించాయి. ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఎం ఎం. విజయలక్ష్మి, కొండాపూర్ గ్రామ గణపతి స్వయం సహాయక మహిళా సంఘం సభ్యురాలు నవాత్ లక్ష్మి, నిర్మల్ మండల సమాఖ్య అధ్యక్షురాలు నేరెళ్ల ఉమ, వివోఏ దానిమెల సుజాత, అడ్డిగ బోసు, ఆర్.సంతోష్ కుమార్, పి. నర్సయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కేసుల నుండి తప్పించుకునేందుకు అత్మ హత్యా ప్రయత్నం -మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి

**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ డిసెంబర్ 19:** మందమర్రి పట్టణానికి చెందిన ఆవుల షారుక్, మెస్రం రాజు, బామాండ్ల శివ, సెగ్గం అజయ్ కుమార్ అనే యువకులు కేసులకు భయపడి గురువారం సూపర్ వాస్మల్ రసాయనం తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశారని వారిని పోలీసులు ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. శశిధర్ రెడ్డి తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్లో ఎస్.ఐ శివనీతి రాజశేఖర్ తో కలిసి మాట్లాడారు. ఈ నలుగురు యువకులు గత నెలలో సింగరేణి కే.కే - 1 గని వద్ద ఇనుప సామాను దొంగతనానికి యత్నించగా అడ్డుకోబోయిన సింగరేణి సెక్యూరిటీ పై దాడి చేసి అక్కడి నుండి పారిపోయారన్నారు. అట్టి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మొత్తం ఆరుగురు నేరస్తులను పట్టుకొని, పూర్వపు నేరచరిత్ర ఉన్న వారిని రిమాండ్ కి తరలించామన్నారు. మరో ముగ్గురు నేరస్తుల పరారీలో ఉన్నారని. గురువారం ఆత్మహత్య యత్నం చేసిన నలుగురు యువకులు మరికొన్ని పూర్వపు నేరాలలో ఉన్నట్లు విచారణలో తెలిసిందన్నారు. వీరు తదుపరి కేసుల నుండి తప్పించుకోవడానికి పోలీసుల మనో ధైర్యాన్ని దెబ్బతీయడానికి ఈ విధంగా ఆత్మహత్య ప్రయత్నం చేశారని తెలిపారు. అంతేగాని ఆ నలుగురు యువకులపై పోలీసులు ఎటువంటి వేధింపులకు పాల్పడలేదన్నారు. వీరిపై మందమర్రి, కాసిపేట, రామకృష్ణాపూర్, మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు ఉన్నాయన్నారు. ఆవుల షారుక్ పై నాలుగు కేసులు, మేశ్రం రాజుపై ఏడు కేసులు, బామండ్ల శివపై మూడు కేసులు, సెగ్గం అజయ్ కుమార్ పై మూడు కేసులు నమోదయ్యాయని తెలిపారు.



# రాహుల్ గాంధీపై ఎన్డీఏ.. బీజేపీపై కాంగ్రెస్ ఎంపీల ఫిర్యాదు




న్యూఢిల్లీ డిసెంబర్ 19 పార్లమెంట్ ఆవరణలో ఇవాళ జరిగిన ఘటన పట్ల ఎన్డీఏ ఎంపీలు.. పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనురాగ్ ఠాకూర్, బాన్సురి స్వరాజ్‌తో పాటు మరో ఎంపీ.. పోలీసు స్టేషన్‌కు వెళ్లి రాహుల్ గాంధీ కి వ్యతిరేకంగా ఫిర్యాదు నమోదు చేశారు. రాహుల్ గాంధీ భౌతిక దాడి జరిపారని, రెచ్చగొట్టినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఠాకూర్, స్వరాజ్‌తో పాటు టీడీపీ ఎంపీ కూడా వెళ్లారు. భౌతిక దాడి ఘటన నేపథ్యంలో రాహుల్ గాంధీపై ఫిర్యాదు ఇచ్చినట్లు అనురాగ్ ఠాకూర్ తెలిపారు. పార్లమెంట్ మకర ద్వారం వద్ద ఇండియా కూటమి, బీజేపీ ఎంపీలు ఇవాళ ఘర్షణకు దిగారు. పార్లమెంట్ లోపలికి వెళ్తున్న ఇండియా కూటమి నేతలకు అడ్డుగా బీజేపీ ఎంపీలు నిలబడ్డారు. ఆ సమయంలో తోపులాట జరిగింది. అయితే అక్కడ ఉన్న ఎంపీ ప్రతాప్ సారంగి గాయపడ్డారు. రాహుల్ గాంధీ నెట్టివేయడం వల్లే తాను కిందపడిపోయినట్లు సారంగి వెల్లడించారు. కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎంపీ ముకేశ్ రాజ్‌పుత్‌లు కూడా గాయపడ్డారు. సారంగి, రాజ్‌పుత్ ఆరోగ్యం గురించి ప్రధాని మోదీ ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. ఘటనపై దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాంగ్రెస్ ఎంపీలు కూడా బీజేపీపై ఫిర్యాదు చేశారు. పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు అందజేశారు.

# భూ భారతి ప్రకటనలపై బీఆర్ఎస్ పార్టీ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు

హైదరాబాద్ డిసెంబర్ 19రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి పేరుతో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకువస్తున్నది. ఈ నేపథ్యంలో భూ భారతి చట్టంపై వివిధ పత్రికల్లో ఫుల్ పేజీ ప్రకటనలు గుప్పించింది. దీనిపై బీఆర్ఎస్ (ఃఖీూ) పార్టీ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చింది. శాసనసభ హక్కులను రక్షించాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ శాసనసభా పక్షం కోరింది. డిసెంబర్ 19న (గురువారం) దినపత్రికల్లో చట్టానికి సంబంధించి ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చిందని, ఆమోదం పొందని బిల్లును చట్టంగా ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో భారీ ప్రకటనల ద్వారా ప్రజలను ప్రభుత్వం తప్పుదోవ పట్టించిందని పేర్కొంది. శాసనసభలో చర్చ దశలో ఉన్న బిల్లును చట్టంగా పేర్కొనడంతో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 245 ప్రకారం సభా హక్కులకు హాని జరిగిందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రెవెన్యూ చట్టం 'భూ భారతి'తో రెవెన్యూ రికార్డుల నిర్వహణలో అనేక మార్పులు జరగనున్నాయి. రాష్ట్రంలోని ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలో 'భూదార్' నంబర్‌ను కేటాయించనున్నారు. ఇకపై భూ క్రయవిక్రయాలు జరిపే సమయంలో ముందుగా ఆ భూమిని సర్వే చేయించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ధరణి పోర్టల్‌లో అందుబాటులో ఉన్న 'ఇన్‌స్టెంట్ మ్యుటేషన్'ను కొత్త చట్టంలోనూ కొనసాగించారు. క్రయవిక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మ్యుటేషన్ కూడా పూర్తవుతుంది. కానీ, వారసత్వంగా జరిగే భూముల బదిలీ (ఫౌతీ)లో కొత్త నిబంధన తీసుకొచ్చారు. తాసిల్దార్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ జరిగినా.. మ్యుటేషన్ చేసే అధికారాన్ని మాత్రం ఆర్డీవోకు అప్పగించారు. నిర్ణీత కాలంపాటు (30 రోజులు) మ్యుటేషన్ చేయకుండా నిలిపివేస్తారు. ఆలోగా ఆ భూమి పై ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ప్రక్రియ పూర్తి చేస్తారు. కోర్టు ద్వారా వచ్చే, ఓఆర్సీ, 38-ఈ తదితర మొత్తం 14 రకాల భూమి హకులపై మ్యుటేషన్ అధికారాలను ఆర్డీవోకు కట్టబెట్టారు. ఇప్పటివరకు ధరణి పోర్టల్‌లో మొత్తం 33 మాడ్యూళ్లు ఉండగా.. భూభారతిలో వాటిని 6కు తగ్గించనున్నారు. భూమి పట్టాలో కేవలం రైతు పేరు మాత్రమే ఉండగా.. ఇకపై అనుభవదారు కాలమ్ సహా మొత్తం 11 కాలమ్‌లు ఉంటాయి. పార్ట్-బీ కేసులు పరిష్కారమైనవారి వివరాలను భూ రికార్డుల్లో ఎక్కించి, పాస్ బుక్ ఇచ్చేలా మార్పులు చేశారు. తాసిల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు అధికారం ఇచ్చారు. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. గ్రామ కంఠం, ఆబాదీలకు హకుల రికార్డును రూపొందిస్తుంది. 2014 వరకు సబ్ రిజిస్ట్రార్ల వద్ద రికార్డుల్లో ఉన్న 'ప్రభుత్వ భూముల' వివరాలను ప్రస్తుతం ధరణిలో ఉన్న డాటాతో సరిపోల్చనున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది. ఆయా సర్వే నంబర్లలోని భూములన్నింటినీ ప్రభుత్వ భూములుగా పరిగణించి నిషేధిత జాబితాలో చేర్చుతామని తెలిపింది. దీంతో 2014కు ముందు పొరపాటున ప్రభుత్వ భూమిగా నమోదై.. 2014 తర్వాత వివాదం ముగిసి, పట్టాభూమిగా మారిన భూములన్నీ ఇప్పుడు మళ్లీ నిషేధిత జాబితాలోకి చేరనున్నాయి. కొత్త రెవెన్యూ చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలను 3 నెలల్లో

# బయోఫ్యూయెల్‌కు ప్రోత్సాహం ఏదీ?

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది.మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్న మైంది.పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళి మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహాలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ళీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందు బాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కవగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది.

## సాంప్రదాయ నృత్యకళాకారిణి

యామినీ కృష్ణమూర్తి. నాట్య కళతో పెనవేసుకున్న ఈ పేరు వినని భారతీయులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ మూడు సొంతం చేసుకున్న ప్రతిభా శాలి.

నాట్య కళా రీతు లైన భరత నాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో పరి పూర్ణత్వం సాధించిన ప్రముఖ నాట్య శాస్త్ర కోవిదు రాలు. దేశ విదేశాల్లో వేలాది నాట్య ప్రదర్శనలు ఇవ్వడమే కాక, విదేశాల్లో కూచిపూడి నాట్యానికి మిగుల ప్రచారం కల్పించిన ప్రతిభాశాలి. వివిధ రకాల నృత్యాలను కళా పూర్ణులైన గురువుల వద్ద ఎంత నేర్చుకున్నా, తనదంటూ ప్రత్యేక ఒరవడి, బాణీని ఏర్పరకుని ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ప్రదర్శించేది ఏ నాట్య రకమైనా, ఒకదాని కొకటి మేళవింపు కాకుండా, సాంప్రదాయ పద్ధతులను అతిక్ర మించకుండా, నృత్య రీతులను కలగాపులగం చేయకుండా ప్రదర్శించడం ఆమెకే సొంతం. అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి నర్తనానికి ఖ్యాతి రావడానికి చాలా కాలం ముందే ఈమె అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, బ్యాంకాక్, సింగపూర్, బర్మా ఇత్యాది ఎన్నోదేశాలు పర్యటించి ఆయా చోట్ల నృత్య ప్రదర్శనలిచ్చి, భారతీయ నాట్య గొప్ప తనాన్ని చాటి చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా, మదనపల్లిలో 1940 డిసెంబరు 20న జన్మించిన ఆమె కుటుంబంతో పాటు తమిళనాడు లోని చిదంబరంలో స్థిరపడింది. ఆమె పూర్తి పేరు యామినీ పూర్ణతిలకం. తన తండ్రి ప్రోత్సాహంతో తన 5వ ఏట చెన్నైలోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో భరత నాట్యము నేర్చుకోవడము ప్రారంభించింది.

భరత నాట్యంలో ఈమె గురువులు కాంచీపురం ఎల్లప్ప పిళ్ళై, చొక్కలింగం పిళ్లై, బాలసరస్వతి, తంజావూర్ కిట్టప్ప, దండాయుధ పాణి, మైలాపూర్ గౌరి అమ్మ మొదలైనవారు. ఈమె వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, చింతా కృష్ణమూర్తి, పసుమర్తి వేణుగోపాల కృష్ణశర్మ వంటి వారి వద్ద కూచిపూడి నేర్చింది. పంకజ చరణ్‌దాస్, కేలూచరణ్ మహాపాత్రల వద్ద ఒడిస్సీ నేర్చుకొన్నది. ఎం.డి.రామనాథన్ దగ్గర కర్ణాటక సంగీతం, కల్పక్కం స్వామినాథన్ దగ్గర వీణ నేర్చుకొంది. కర్ణాటక సంగీతం కూడా నేర్చుకుని పాటపాడ్నుతూ, భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ప్రావీణ్యం సంపాదించి, యామిని 1957లోతన 17వ యేట చెన్నైలో 1957వ సంవత్సరంలో తొలి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అప్పటి నుంచి వేలాదిగా ప్రదర్శనలిచ్చి దేశ, విదేశాల్లో పేరు పొందినది. 20సంవత్సరాల వయసు వచ్చే సమయానికి ఈమె ఒక ప్రతిభావంతురాలైన నర్తకిగా గుర్తింపు పొంది, తన మకామును ఢిల్లీకి మార్చింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆకాశవాణి కోసం రచించిన క్షీరసాగర మధన" నృత్య రూపకాన్ని కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రంలో, మొదటి సారి యామినీ కృష్ణమూర్తి "విశ్వమోహిని" పాత్రలో, ధన్వంతరి, మహావిష్ణువు పాత్రల్లో వేదాంతం సత్యనారాయణ శర్మ నటించి ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. భామాకలాపం"లో సత్యభామగా అవతరించే వైఖరి, "మండూక శబ్దం"లో కృష్ణదేవరాయల ప్రశస్తిని లీలగా చూపే అభినయం, భంగిమల్లోని రీవి, ఔచిత్యం, "సింహాసనస్థితే" శ్లోకంలో దేవిని కళ్ళకు కట్టిస్తూ పట్టే భంగిమలు, "కృష్ణశబ్దం"లో భావతీవ్రత, లాలిత్యం, వైవిధ్యం ఈమె ప్రతిభకు తార్కాణాలు. వేదాలకు కొన్ని పసందైన జతులతో ఈమె కూర్చిన నృత్యం ఈమె పాండిత్యానికి ఉదాహరణ. కూచిపూడి నృత్యానికి సంబంధించి డీవీడీలు విడుదల చేసింది. తన నృత్యప్రస్థానాన్ని "రేణుకా ఖాండేకర్" సహకారంతో "ఎ ప్యాషన్ ఆఫ్ డాన్స్" పేరుతో పుస్తకంగా రాసింది. "నృత్యమూర్తి" సీరియల్‌ను పదమూడు భాగాలుగా ఆమె రూపొందించి దూరదర్శన్‌లో ప్రసారం చేసింది. మన సంస్కృతీ వైభవానికి గోపురమై నర్తనశిల్పాల ఆధారంగా, స్థలపురాణాలు, చరిత్ర జోడించి వ్యాఘ్రపాద, పతంజలి సూక్తులు, కర్ణాటక సంగీతం రుచిచూపిస్తూ ఈ సీరియల్‌లో నృత్య సర్వస్వాన్ని ఇమిడ్చి చూపించింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా నియమించ బడింది.

న్యూఢిల్లీలోని ఇందిరా ప్రియదర్శిని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మ్యూజిక్ అండ్ డాన్స్ అనే సంస్థకు ఈమె డైరెక్టరుగా సేవలను అందించడం తో పాటు, ఢిల్లీలో నృత్య కౌస్తుభ కల్చరల్ సోసైటి యామిని స్కూల్ ఆఫ్ డాన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ అందించడంపై ప్రధానంగా దృష్టి సారించింది.

ఫిలింస్ డివిజన్ ఆఫ్ ఇండియా 1971లో ఏల్చూరి విజయరాఘవ రావు సంగీత దర్శకత్వంలో "యామినీ కృష్ణమూర్తి" పై 20 నిమిషాల ఒక డాక్యుమెంటరీ సినిమా తీసింది. క్షీరసాగర మథనం నృత్య నాటికను భారత మలి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ముందు ప్రదర్శించి ఆయన నుండి ,"భామావేణీ" బిరుదును అందుకున్నది.

అంతే కాక యామిని సేవలను గుర్తించిన ప్రభుత్వం 1968లో పద్మశ్రీ 2001లో పద్మ భూషణ్ 2016లో పద్మ విభూషణ్ పురస్కారాలను ప్రదానం చేసింది. 2014లో మహిళా దినోత్సవం సందర్భంగా శాంభవి స్కూల్ ఆఫ్ డాన్స్ సంస్థ యామినికి నాట్య శాస్త్ర పురస్కారాన్ని అందించింది. 2017లో విశాఖపట్నంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారు ఈమెకు స్వర్ణకమలం బహూకరించి "నాట్య విద్యాభారతి" అనే బిరుదును ఇచ్చి సత్కరించారు. వివాహం చేసుకోకుండా అవివాహితగానే వుండి నాట్యరంగానికి తన పూర్తి జీవితాన్ని అంకితం చేసిన కళా తపస్వి నిగా గుర్తింపు పొందినది.

## జగన్ కు దూరమౌతున్న కాపు వర్గం

విజయవాడ, డిసెంబర్ 19, ఏపీలో అతి బలమైన ఓటు బ్యాంకు ఉన్న కాపు సామాజిక వర్గం వైసీపీ అధినేత జగన్‌ను వదిలి పెడుతోందా..? ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ఈ చర్చ ఎక్కువగా జరుగుతోంది. ఆ మధ్య ఒకేసారి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజీనామా చేయడంతో ఈ చర్చ మరింత ఎక్కువైంది.2024 ఎన్నికల్లో వైసిపి ఓటమి చెందిన తర్వాత కాపు సామాజిక వర్గ నేతలు వరుసగా ఆ పార్టీకి దూరం అవుతున్నారు. ముందుగా కిలారు రోశయ్య, సామినేని ఉదయభాను లాంటి నేతలు పార్టీకి రాజీనామా చేస్తే ఆ తర్వాత జగన్‌కు అత్యంత నమ్మకమైన స్నేహితుడిగా ఉన్న ఆళ్లనాని కూడా పార్టీకి రాజీనామా చేశారు. ఇది వైసిపినే కాకుండా రాష్ట్ర రాజకీయాలను కూడా షాక్‌కు గురి చేసింది. నిజానికి తొలి విడతలోనే ఆళ్ల నానిని మంత్రిని చేశారు జగన్మోహన్ రెడ్డి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో మంత్రి పదవి కోల్పోయినప్పుడు నుంచి ఆయన ముభావంగానే ఉంటూ వచ్చారు. పార్టీ అధికారం కోల్పోగానే జగన్‌కు బై బై చెప్పేశారు. భీమవరంలో గ్రంధి శ్రీనివాస్‌ది కూడా అదే దారి. ఏకంగా 2019లో జనసేన అధినేత పవన్‌ను ఓడించి జయింట్ కిల్లర్‌గా పేరుపొందిన గ్రంధి శ్రీనివాస్‌కు కనీసం రెండో విడతలోనన్నా మంత్రి పదవి గ్యారెంటీ అని భావించారు. కానీ పలు సమీకరణల దృష్ట్యా జగన్ ఆయనపై దృష్టి పెట్టలేదు. దీనితో తనకు సరైన గుర్తింపు దక్కలేదని ఎప్పటినుంచో భావిస్తున్న గ్రంధి శ్రీనివాస్ ఎన్నికల తర్వాత పార్టీని వదిలేసారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అటు వైపు వెళ్ళిపోతారన్న విమర్శలు ఎదుర్కొనే అవంతి శ్రీనివాస్ కూడా వైసిపి నుంచి బయటికి వచ్చేసారు. జగన్ హయంలో ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతానికి వీరు మాత్రమే కాకుండా మరికొందరు కాపు నేతలు కూడా వైసీపీని వీడే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో జనసేన కాపులను, కాపులు జనసేన ను ఓన్ చేసుకుంటున్నారు. పవన్‌ను ఒక సీరియస్ పొలిటిషన్‌గా వారు గుర్తించడానికి కొంత టైం పట్టింది. ఎప్పటికైనా ఏపీలో కాపు సామాజిక వర్గం నుంచి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్న వ్యక్తిగా పవన్ని చూస్తున్నారు. దాని ఫలితమే 2024 ఎన్నికల్లో జనసేన సాధించిన 100% విజయం. ఇలాంటి పరిస్థితుల్లో వేరే పార్టీల్లో ఉండటం కన్నా జనసేనకు షిఫ్ట్ కావడమే మంచిదనే ఆలోచనలో కాపు సామాజిక వర్గానికి చెందిన నేతలు భావిస్తున్నారు. వీలైతే జనసేన లోనికో లేకుంటే కనీసం కూటమిలోని ఇతర పార్టీల్లోకో వెళ్లడం ప్రస్తుతానికి బెటరనే ఆలోచనలు వీళ్లు ఉన్నారు.విజయవాడ నుంచి ఉత్తరాంధ్ర వరకు కాపు సామాజిక వర్గం దాని అనుబంధ కులాల లీడర్లు ఎక్కువగా ఉన్నారు. ఓటర్లపరంగా కూడా వారి ప్రభావం ఈ ప్రాంతాల్లో ఉంటుంది. వైసీపీలో ఆ ప్రాంతాలకు సంబంధం లేని రెడ్డి లీడర్లు సలహాదారుల పేరుతో పెత్తనం సాగించడం చాలా మందికి నచ్చడం లేదు. జగన్‌కు తమకు మధ్య అడ్డుకట్టలా వాళ్లు మారిపోతున్నరని అసహనానికి లోనవుతున్నారు. దానికి తోడు జగన్ కూడా క్షేత్ర స్థాయి పరిస్థితులను లెక్క లోకి తీసుకోకుండా తోచినట్టు చేసుకుపోతున్నారనే ఆరోపణ ఉంది. ఇక తమ సామాజిక వర్గానికి చెందిన పవన్‌ను తమ తోనే తిట్టిస్తూ రావడం వల్ల ఓటు బ్యాంకు పూర్తిగా దెబ్బతింటుందని భావించిన కాపు లీడర్లు వైసీపీకి బై బై చెప్తున్నారు. మరి రానున్న రోజుల్లో ఇంకెంత మంది కాపు లీడర్లు బయటకు వస్తారో జగన్ వారికి ఎలా అడ్డుకట్ట వేస్తారో చూడాలి.

## దొంగతనం అంత ఈజీనా...

కాకినాడ, డిసెంబర్ 19, సులువుగా డబ్బులు ఎలా సంపాదించాలి అని వీడియోలు చూశాడో.. లేకపోతే దొంగతనం కేంద్రంసాగే మనీ హెయిస్ట్ లాంటి వెబ్ సిరీస్‌లు చూశాడో కానీ ఓ వ్యక్తి ఏకంగా ఓ కార్పొరేట్ గోల్డ్ షోరూంనే టార్గెట్ చేశాడు. కానీ ప్రాపర్ గా వర్కవుట్ చేయకపోవడం.. దోచుకున్న వరకే ప్లాన్ రెడీ చేసుకోవడం.. ఆ ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాలో తెలియకపోవడంతో దొరికిపోయాడు. అది కూడా మామూలు పోలీసులకు కాదు.. ట్రాఫిక్ పోలీసులకు. కాకినాడ మెయిన్ రోడ్‌లో తనిష్క్ బంగారు ఆభరణాల షోరూం ఉంది. మధ్యాహ్నం సమయంలో కస్టమర్లు ఎవరూ లేరు. ఆ సమయలో ఓ యువకుడు వచ్చాడు. తనకు లావుపాటి గోల్డ్ చైన్ కావాలని చూపించమని అడిగాడు. సేల్స్ గర్ల్ ఆరేడు మోడల్స్ చూపించింది. అన్నింటిని తన చేతుల్లోకి తీసుకున్న ఆ వ్యక్తి వెంటనే జేబులో నుంచి తుపాకీ తీసి.. కదిలితే కాల్చేస్తానని హెచ్చరించాడు.దాంతో వచ్చిన వాడు దొంగ అని తెలిసి ఆ సేల్స్ గర్ల్ వణికిపోయింది. తర్వాత అతను ఆ నగలు తీసుకుని పరారయ్యాడు. చేతిలోతుపాకీ కూడా ఉండటంతో సెక్యూరిటీ కూడా ఆపలేదు. ఆ దొంగ అలా రోడ్డు మీదకు పరుగులు పెట్టిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే సిటీ బయటకు అనుమానాస్పద వ్యక్తులు వెళ్లకుండా తనిఖీలు చేయమని ఆదేశాలిచ్చి షోరూంను పరిశీలించేందుకు వచ్చారు. అయితే కాసేపటికే ఫారెస్ట్ ఆఫీసు దగ్గర ఓ యువకుడ్ని పోలీసులు పట్టుకున్నారని అతని వద్ద చాలా బంగారు ఆభరణాలు ఉన్నాయని కంట్రోల్ రూమ్ కు ఫోన్ వచ్చింది. వెంటనే వెళ్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి తుపాకీ చూపించి గోల్డ్ కొట్టేసి బయటకు వచ్చాడు కానీ.. ఎటు పోవాలో అర్థం కాలేదు. ఫారెస్ట్ ఆఫీస్ సెంటర్ దగ్గర అనుమానాస్పదంగా ప్రవర్తిస్తూండటంతో ఏమైందని ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రశ్నించాడు. అప్పటికే దొంగతనం చేశానన్న ఆందోళనతో.. ?ందరూ తననే వెంటాడుతున్నారన్న భయంతో వణికిపోతున్న ఆ యువకుడు పారిపోయే ప్రయత్నం చేశాడు. తేడాగా ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు అతడిని పట్టుకున్నాడు. అతని జేబుల్లో వెదికితే బంగారం లభించింది. వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న గన్ స్వాధీనం చేసుకున్నారు. అది నిజమైన గన్ కాదని.. టాయ్ గన్ అని తేలింది. ఆ యువకుడ్ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అతను ప్రొఫెషనల్ దొంగ కాదని.. అలా అయితే.. పకడ్బందీగా దోపిడీ చేసి పారిపోయేందుకు కూడా ఏర్పాట్లు చేసుకుని ఉండేవాడని పోలీసులు భావిస్తున్నారు.

## అదుపుతప్పి యాష్ ట్యాంకర్ బోల్తా..



జూలూరుపాడు లోని సీతారామ కార్యాలయ సమీపంలో గురువారం తెల్లవారుజామున యాష్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో సూర్యాపేట జిల్లా మటన్ పల్లి మండలం బొజ్జ తండా గ్రామానికి చెందిన ఎస్ శివకు గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే మణుగూరులోని బీటీపీఎస్ లో ట్యాంకర్ లో యాష్ లోడ్ చేసుకుని దిగుమతి చేసేందుకు జాన్ పాడు వెళుతున్నాడు. ఈ క్రమంలో జూలూరుపాడులోని సీతారామ కార్యాలయ సమీపంలో ఎదురుగా వెళుతున్న కారును తప్పించబోయి ట్యాంకర్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న పొలంలో బోల్తా పడింది.

లారీ డ్రైవర్ శివ క్యాబిన్ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయాడు. దీంతో సంఘటనా స్థలానికి స్థానిక పోలీసులు, కొత్తగూడెం ఫైర్ రెస్క్యూ సిబ్బంది చేరుకుని డ్రైవర్ను బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. రెండు గంటలపాటు తీవ్రంగా శ్రమించి క్రేన్, జేసీబీ సహాయంతో స్థానికులతో కలిసి వారు డ్రైవర్ ను బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. ఈ సంఘటనలో డ్రైవర్ కాళ్లు విరిగాయి. అతనికి వైద్య చికిత్సలు అందించేందుకు 108లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య సందర్శించి వివరాలను నమోదు చేసుకున్నారు.

## కారులో వివాహిత ఆత్మహత్య



రంగారెడ్డి వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని దారుణం జరిగింది. సాగర్ హైవే లోని ఇంజాపూర్ రాజశ్రీ ఎన్ క్లేవ్ రామకృష్ణారెడ్డి ఉమాశ్రీ దంపతులు నివాసం ఉంటున్నారు బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో బయటికి వచ్చిన తను కారులో కూర్చొని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది కారులో ఆమని గ్రహించిన సోదరుడు ప్రైవేట్ హాస్పిటల్ తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# జనవరి 10 నుంచి వైకుంఠ దర్శనాలు

తిరుమల, డిసెంబర్ 19, తిరుమల తిరుపతి దేవస్థానం జనవరి 10, 2025 నుండి జనవరి 19, 2025 వరకు తిరుమలలో జరిగే పవిత్రమైన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభించింది. 10 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలపై టీటీడీ ఈవో జె.శ్యామలారావు, అదనపు ఈవో సిహెచ్.వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి అన్నమయ్య భవన్‌లో ఏర్పాట్లు నిర్వహించి, సమీక్ష చేశారు. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి ఈ నెల 23న ఉదయం 11 గంటలకు 10 రోజుల శ్రీవాణి టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారని ఈవో తెలిపారు. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు 10 రోజుల ఎస్‌ఈడీ టోకెన్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారన్నారు.శ్రీవాణి ట్రస్ట్-లింక్డ్ వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్ల కోటాను డిసెంబరు 23న ఆలయ నిర్వాహకులు విడుదల చేస్తారని శ్యామలరావు చెప్పారు. ఉత్సవ కాలానికి సంబంధించిన రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటాను కూడా టీటీడీ విడుదల చేస్తుంది. టీటీడీ ఉత్సవాల్లో భాగంగా 10 రోజుల పాటు తిరుపతిలో ఎనిమిది టికెట్ కౌంటర్లు, తిరుమలలో ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తుంది.టోకెన్లు లేదా టికెట్లు ఉన్న భక్తులు మాత్రమే శ్రీవారి దర్శనానికి అనుమతి ఉంటుంది. టోకెన్ లేని భక్తులు తిరుమలకు రావచ్చు గానీ వారికి దర్శనం లభించదు. టోకెన్లు లేదా టికెట్లు లేని భక్తులను క్యూ లైన్లలోకి అనుమతించరు. వైకుంఠ ఏకాదశి నాడు తెల్లవారుజామున 4:45 నిమిషాలకు ప్రొటోకాల్ దర్శనాలు ప్రారంభమౌతాయి. ఈ క్రమంలో వైకుంఠ ఏకాదశి రోజున వేదాశీర్వచనాలు కూడా రద్దవుతాయి. ఆ రోజున ఉదయం 9 నుండి 11 గంటలు వరకు స్వామివారు స్వర్ణ రథంపై ఊరేగుతారు. వైకుంఠ ద్వాదశి రోజున తెల్లవారు జామున 5:30 నుండి 6:30 వరకు శ్రీవారి పుష్కరిణిలో టీటీడీ అధికారులు చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.వైకుంఠ ఏకాదశి రోజు (జనవరి 10) దర్శనానికి ప్రోటోకాల్ వీఐపీలను మాత్రమే అనుమతిస్తామని టీటీడీ ప్రకటించింది. ఉత్సవాల కోసం భారీ యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, 10 రోజుల పండుగ కాలంలో తిరుమలలో వేదాశీర్వచనం, అన్ని రకాల విశేష దర్శనాలను ఆలయ సంస్థ రద్దు చేసింది. కాగా, సంప్రదాయం ప్రకారం, జనవరి 10న తిరుమలలో జరిగే స్వర్ణ రథోత్సవం, మరుసటి రోజు వైకుంఠ ద్వాదశి సందర్భంగా చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజుకు 3.5 లక్షల లడ్డూలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేయడంతో పాటు 3.5 లక్షల లడ్డూలను టీటీడీ బఫర్ స్టాక్‌లో ఉంచనుంది.

టీటీడీ నిర్ణయాలివే..

వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి ఈ నెల 23న ఉదయం 11 గంటలకు 10 రోజుల శ్రీవాణి టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

ఈ నెల 24న ఉదయం 11 గంటలకు 10 రోజుల ఎస్‌ఈడీ టోకెన్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

జనవరి 10 నుంచి 19 వరకూ 10 రోజులకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి తిరుపతిలో 8 కేంద్రాలు, తిరుమలలోని ఒక కేంద్రంలో సర్వదర్శనం టోకెన్లు కేటాయిస్తారు.

తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి, జీవకోన, రామానాయుడు స్కూల్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్, తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనంలో టోకెన్లు కేటాయిస్తారు.

టోకెన్ జారీ కేంద్రాల వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సీఈకి ఆదేశం.

టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనాలకు అనుమతి ఇస్తారు. టోకెన్లు లేని భక్తులను దర్శన క్యూలైన్లలోకి అనుమతించరు.

వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం 04:45 గంటలకు ప్రోటోకాల్ దర్శనాలు ప్రారంభం కాగా.. అధిక రద్దీ కారణంగా ఆ రోజున ఆలయంలో వేదాశీర్వచనం రద్దు చేశారు.

ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ స్వర్ణరథం, ఉదయం 5:30 నుంచి 6:30 వరకూ శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం జరుగుతాయి.

గోవిందమాల భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శన సదుపాయం ఉండదు.

# అమరావతిపై పొంగులేటీ కామెంట్స్

# మండిపడుతున్న ఏపీ నేతలు

విజయవాడ, డిసెంబర్ 18, "ఇటీవల అమరావతిలో వచ్చిన వరదలతో ఏపీకి పెట్టుబడులు వెళ్లే పరిస్థితి లేదు. వరదలతో ఏపీలో పెట్టుబడులు పెట్టే వారికి భయం పట్టుకుంది. ఏపీలో చంద్రబాబు అధికారం చేపట్టగానే రియల్ ఎస్టేట్ అమరావతికి పోతుందనేది ప్రచారం మాత్రమే. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోలేదు. హైదరాబాద్, బెంగళూరుకు పెట్టుబడిదారులు వస్తున్నారు" అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు.హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు తగ్గుతున్నాయని, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వ పోకడలే కారణమని బీఆర్ఎస్ విమర్శలు చేస్తుంది. ఏపీలో అమరావతి పనులు మళ్లీ ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అమరావతిపై హాట్ కామెంట్స్ చేశారు. ఏపీలో కూటమి సర్కార్ ఏర్పడడంతో...అమరావతికి మళ్లీ ఊతం లభించింది. గత ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని రాజధాని ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కింది. రాజధాని కోసం వేల ఎకరాలు ఇచ్చిన రైతులు, అమరావతి ప్రజల్లో కొత్త ఆశ చిగురించింది. ఇది కొంత వరకూ వాస్తవమే. అయితే రాత్రికి రాత్రే మారిపోయి, పెట్టుబడిదారులు క్యూ కట్టే పరిస్థితులు అమరావతిలో లేవనే చెప్పాలి. కూటమి ప్రభుత్వం రాగానే అమరావతిపై దృష్టి పెట్టి మొదటిగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఒక సంకేతం పంపింది. సీఆర్డీఏను రంగంలోకి దింపి రాజధాని అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రజల్లో నమ్మకాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుంది.ఇటీవల సీఆర్డీఏ భేటీలో రూ.24,276 కోట్ల పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతిలో మొత్తంగా రూ.45,249 కోట్ల పనులకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్ నిర్మాణాలు, రాజధాని లే ఔట్‌లు, ట్రంక్ రోడ్లు, అసెంబ్లీ భవనాల నిర్మాణాలకు సీఆర్డీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణానికి మొత్తం ఖర్చు రూ.62 వేల కోట్లుగా ప్రభుత్వం అంచనా వేస్తుంది. అమరావతి పనులకు కసరత్తు ప్రారంభం కావడంతో...రియల్ ఎస్టేట్ వ్యాపారుల చూపు అటుగా మళ్లింది. గతంలో కంటే భూముల రేట్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతానికి రోడ్లు తప్ప ఇతర మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో...భవిష్యత్ అవసరాలకు మాత్రమే భూములు కొనుగోలు చేస్తున్నారు.'అమరావతి, చుట్టుపక్కల ప్రభుత్వ, ప్రైవేట్ భూములు సుమారు 50,000 ఎకరాల వరకు అందుబాటులో ఉన్నాయి. గతంలో చదరపు గజం రూ. 15,000 ట్రెండ్ అవ్వగా...ఇటీవల చదరపు గజం రూ. 25,000 ధరకు చేరింది' అని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అన్నారు. రియల్ ఎస్టేట్ బూమ్ ప్రారంభం అయ్యిందని, వార్షిక ప్రాతిపదికన భూముల రేట్లు పెరిగే అవకాశం ఉందని రియల్ వ్యాపారులు భావిస్తున్నారు. మరో 18 నెలల్లో భూముల ధరలు రెట్టింపు అవుతాయని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసంపూర్తిగా ఉన్న కొన్ని భవనాల పనులు ప్రారంభించిందని, వీటిలో 80 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, బ్యూరోక్రాట్‌లు, శాసనసభ్యులు, న్యాయమూర్తుల నివాస గృహాలు ఉన్నాయని సీఆర్డీఏ అధికారులు పేర్కొన్నారుహైదరాబాద్, బెంగళూరులో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో... భవిష్యత్ అవసరాల కోసం కొందరు అమరావతి వైపు వస్తున్నారని రియల్ వ్యాపారులు అంటున్నారు. జనవరి2025 నుంచి బెంగళూరు, హైదరాబాద్‌లతో పోటీ పడుతూ అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతుందని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు, వరల్డ్ బ్యాంక్, ఏడీబీ రుణాలు సకాలంలో అందితే అమరావతి రియల్ రంగంలో మరింత స్పీడ్ అందుకుంటుందని స్థానిక వ్యాపారులు భావిస్తున్నారు. అమరావతిలో ఇప్పటికే కొన్ని పనులను పునఃప్రారంభం కావడంతో భూముల ధరలకు రెక్కలు వస్తు?న్నాయి. స్థానిక రియల్టర్ల ప్రకారం అమరావతి గ్రామాలలో భూముల ధరలు 60% నుంచి 100% వరకు పెరిగి చ.గజం రూ. 50,000 తాకవచ్చని తెలుస్తోంది.గత 10 ఏళ్లలో అమరావతి రియల్ ఎస్టేట్ రంగం ఎన్నో కుదుపులు చూసింది. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత అప్పటి సీఎం చంద్రాబాబు అమరావతిని రాష్ట్రానికి రాజధానిగా ప్రకటించడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రియల్ ఎస్టేట్ రంగంపై ఎన్నో ఊహాగానాలు వచ్చాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రావడం, వైఎస్ జగన్ మూడు రాజధానుల ప్రతిపాదనతో అమరావతి ధరలు అమాంతం తగ్గిపోయాయి. అమరావతిలో 2019లో చదరపు గజానికి రూ.25,000-రూ.40,000 వరకు ఉండగా..జగన్ ప్రభుత్వ హయాంలో వీటి ధరలు రూ.9,000-రూ.18,000కి పడిపోయాయని ఓ రియాల్టీ వ్యాపారి అన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో అమరావతి భూముల ధరలు పెరుగుతున్నాయి. మొత్తం 29 గ్రామాల్లో ఎకరాకు రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు.భూముల ధరలు భారీగా పెరగడంతో అమరావతిపై పెట్టుబడిదారులకు ఆసక్తి ఉందని తెలుస్తోంది. వెలగపూడి, కొండంపాలెం, వీఐటీ, ఎస్ఆర్ఎం వంటి విద్యాసంస్థలకు సమీపంలోని ప్రాంతాల్లో వాణిజ్య, నివాస ప్రాజెక్టుల ధరలు భారీగా పెరుగుతున్నాయని స్థానికి డెవలపర్స్ చెబుతున్నారు. అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో, హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెట్టుబడిదారులు ఏపీకి తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారని, రాబోయే కొన్నేళ్లలో ఈ ప్రాంతంలో ఆశాజనక ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని అమరావతి రియల్ వ్యాపారులు అంటున్నారు.అమరావతి రియల్ ఎస్టేట్ ప్రభావం హైదరాబాద్ పడుతుందనే ఆలోచనలో తెలంగాణ మంత్రి పొంగులేటి...నెగిటివ్ కామెంట్స్ చేసి ఉంటారని కొందరు వ్యాపారులు అంటున్నారు. ఇటీవల హైదరాబాద్ లో కూడా వరద పరిస్థితులు కనిపిస్తున్నాయని, చెన్నై, బెంగళూరులో సైతం వర్షాలు చాలా ప్రాంతాలు నీటి మునుగుతున్నాయని చెబుతున్నారు. పొంగులేటి వ్యాఖ్యలను రాజకీయ కోణంలోనే చూడాలని టీడీపీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టేందుకు పొంగులేటి అమరావతి ప్రస్తావన తెచ్చి ఉంటారని భావిస్తున్నారు. అమరావతితో పాటు సాగర నగరం విశాఖలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

# పార్టీకి తలనొప్పిగా మారిన కొలికపూడి

విజయవాడ, డిసెంబర్ 19, ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి తలనొప్పిగా తయారైన ఎమ్మెల్యేల్లో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఒకరు. పార్టీ నేతలతో వివాదాలు, కర్ర పెత్తనం, దూషణలతో తీరు మార్చుకోమని పార్టీ పెద్దలు పదేపదే చెబుతున్నా ఆయనలో మాత్రం మార్పు రావడం లేదు.ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం బెల్ట్‌షాపులపై దాడుల పేరుతో చేసిన హడావుడితో టీడీపీ ఇరకాటంలో పడింది. రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్‌షాపులే లేవని ఓ పక్కన ఎక్సైజ్ మంత్రి మొదలుకుని ముఖ్యమంత్రి వరకు గొప్పలు చెబుతుంటే అధికార పార్టీ ఎమ్మెల్యే రోడ్లపై పరుగులు తీస్తూ బెల్టు దుకాణాల్లో తనిఖీలు చేస్తూ, అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకోవడం కలకలం రేపింది. ఎమ్మెల్యే ఇలా ఎందుకు చేశారనే దానిపై రకరకాల వాదనలు ఉన్నా టీడీపీ నేతలు మాత్రం ఎమ్మెల్యే తీరును తప్పు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే కొలికపూడి కంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్ అయ్యారు.అధ్యాపక వృత్తి నుంచి అమరావతి ఉద్యమంలోకి అడుగుపెట్టిన కొలికపూడి శ్రీనివాసరావును ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రిజర్వుడు నియోజక వర్గం నుంచి పోటీ చేసే అవకాశం లభించింది. కూటమి ప్రభంజనంలో సునాయసంగానే గెలిచారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యే తీరులో ఒక్కసారిగా మార్పు వచ్చింది. నియోజక వర్గం మొత్తం తన చెప్పు చేతల్లో ఉండాలనే ధోరణిలో ఉండటంతో స్థానికంగా విభేదాలు మొదలయ్యాయి. దీనికి తోడు స్థానికంగా ఉండే కుల, వర్గ రాజకీయాలు కూడా ఎమ్మెల్యేకు మింగుడు పడలేదు. తిరువూరులో ఉండే కుల ఆధిపత్య ధోరణులు కూడా ఎమ్మెల్యే వైఖరికి కారణమనే ప్రచారం కూడా ఉంది.ఎమ్మెల్యేగా ఎన్నికైన నెలరోజుల్లోనే.. ఈ ఏడాది జూలైలో ఎ.కొండూరు మండలం కంభంపాడులో వైసీపీ నాయకుడు పంచాయతీ స్థలం ఆక్రమించి, భవనం నిర్మిస్తు న్నాడని ఆరోపిస్తూ ఆ భవనం వద్దకు వెళ్లి జేసీబీతో దానిని పడగొట్టాల్సిందేనని ఆందోళనకు దిగారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటా మని అధికారులు చెప్పినా వినకుండా అక్కడే బైఠాయించారు. ఈ ఘటన సంచలనం కావడంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉండవల్లి పిలిపించుకుని మందలించారు.ఆ తర్వాత పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారనే నెపంతో టీడీపీ ప్రజాప్రతినిధిని అందరి ముందు బట్టలిప్పి కొడతానంటూ బెదిరించడంతో అతని భార్య ఆత్మహత్యా యత్నం చేసింది. దీంతో అతని వర్గం నాయకులు విజయవాడలో ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగడం కలకలం రేపింది. తిరువూరులో మట్టి తరలింపుపై మీడియాలో వార్తలు రావడంతో వారిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఎమ్మెల్యేపై స్థానిక నాయకులు టీడీపీ పెద్దలకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యే ఉండగానే నియోజక వర్గానికి మరో ఇన్‌ఛార్జిని నియమించారు. పార్టీలో ఇతర నేతలు జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో తీరు మార్చుకుంటానని బహిరంగంగా ప్రకటించారు మళ్లీ కొలికపూడి చెలరేగిపోయారు. వీధుల్లో పరుగులు తీస్తూ మద్యం దుకాణాల వద్ద హంగామా చేశారు. ఉదయాన్నే మద్యం షాపులకు వెళ్లి బెల్టు షాపులు నిర్వహిస్తున్నారంటూ షాపులకు తాళాలు వేయిం చారు. షాపు తాళాలు తీస్తే ఊరుకోనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరువూరు పట్టణంలో ఉన్న షాపుల్ని పట్టణ శివార్లలో పెట్టుకోవాలని, బెల్టుషాపుల్ని తొలగించకపోతే తానే తొలగిస్తానంటూ మండిపడ్డారు.తిరువూరు నియోజక వర్గంలో ఉన్న 16 మద్యం షాపుల్లో తిరువూరు పట్టణంలో 4, రూరల్‌లో 2, గంపలగూడెంలో 4, ఎ. కొండూరులో 2, విస్సన్నపేటలో 4 షాపులు ఉన్నాయి. మద్యం వ్యాపారంపై ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం దుకాణాలు మూయించడంపై నిర్వాహకులు బిత్తరపోతున్నారు. ఎమ్మెల్యే వేధింపులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నారు. మరోవైపు టీడీపీ అధిష్టానం కూడా ఎమ్మెల్యే వ్యవహార శైలిపై విచారణ జరుపుతోంది.

# జయసుధపై క్రిమినల్ చర్యలు...

కాకినాడ, డిసెంబర్ 19,ఏపీ మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి పేర్ని జయసుధ యజమానిగా ఉన్న జేఎస్ గోడౌన్ లో రేషన్ బియ్యం మాయం ఘటనలో పలు శాఖలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. రేషన్ బియ్యాన్ని దారి మళ్లించి ఆధారాలను నాశనం చేయాలని చూశారు. మాయం చేసిన బియ్యానికి డబ్బు కడితే సరిపోతుందని భావిస్తున్నారు. కానీ క్రిమినల్ కేసులు నమోదు చేశాం. తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష తప్పదని ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పోలీస్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలు అధికారులు రేషన్ బియ్యంపై చర్యలకు సిద్ధమని తెలిపారు.తెనాలిలోని క్యాంపు కార్యాలయంలో నాదెండ్ల మనోహర్ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. 'పేర్ని జయసుధకు చెందిన గోడౌన్ లో 3 వేల బస్తాలు మాయం చేశారనుకున్నాం, కానీ 4840 బస్తాలు మాయం. గత ప్రభుత్వంలో పదవిలో ఉండి ప్రజలు అప్పగించిన బాధ్యత ఎంతో దారుణంగా నిర్వర్తించారో సాక్ష్యాధారాలతో ప్రజల ముందు పెడతాం. కూటమి ప్రభుత్వంలో ఎవరి మీద కక్ష సాధింపు చర్యలు ఉండవు. కానీ తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరు. అక్కడే ఉన్న రెండో గోదాములోనూ అక్రమాలు జరిగాయని అనుమానాలు ఉన్నాయి. పౌరసరఫరాల శాఖ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాక ఏపీలోని 1300 రైస్ మిల్లులకు అందించి బియ్యంగా మారుస్తాం. ఆ బియ్యాన్ని మొత్తం 104 గోడౌన్లలో భద్రపరుస్తాం. ఆ నిల్వ చేసిన బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు , అంగన్వాడీ కేంద్రాలకు, సాంఘిక సంక్షేమ హాస్టల్స్ కు సరఫరా చేస్తాం. పౌరసరఫరాల శాఖలో సంస్కరణలు తీసుకురావాలని సివిల్ సప్లైస్ ఎండీ మనజీర్ నవంబర్ 26న "వేర్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టమ్" అనే సాఫ్ట్ వేర్ తీసుకొచ్చారు. రాష్ట్రంలోని ఏ గోడౌన్ లో ఎంత స్టాక్ ఉంది? ఎక్కడ ఎంత స్టాక్ భద్రపరచాలి? వచ్చే సీజన్ లో ఎంత కొనుగోళ్లు చేయాలి? అనే సమాచారం పొందుపరిచేలా ఈ సాఫ్ట్ వేర్ రూపొందించారు. గోడౌన్ యాజమానులకు, వాళ్ల మేనేజర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆన్‌లైన్ వేదికగా ట్రైనింగ్ ఇచ్చారు. ఏ విధంగా తనిఖీలు చేసి కంప్యూటరీకరణ చేయాలో శిక్షణ ఇచ్చారు. నవంబర్ 27వ తేదీన తమ గోదాముల్లో స్టాక్స్ తక్కువగా చూపిస్తోందని, 3 వేల బ్యాగుల రేషన్ బియ్యం షార్టేజి అని వేబ్రిడ్జ్ లో పొరపాటు వల్ల ఇలా జరిగిందని జె.ఎస్. గోడౌన్ నుంచి లేఖ వచ్చింది. గోడౌన్ లో మాయమైన బియ్యానికి డబ్బులు చెల్లిస్తామని సైతం లేఖలో పేర్కొన్నారు' అని నాదెండ్ల మనోహర్ తెలిపారు.జేఎస్ గోడౌన్స్ లో స్టాక్ ఎంత ఉందనని స్టాక్ రిజిస్టర్ ప్రాథమిక సమాచారాన్ని జాయింట్ కలెక్టర్ నుంచి డిసెంబర్ 4న తెప్పించారు. దాని ప్రకారం మాయమైంది 3 వేల బస్తాలు కాదు 3708 బస్తాలు తగ్గాయని తెలిసింది. డిసెంబర్ 10న సివిల్ సప్లైస్ ఎండీ చట్టప్రకారం డబుల్ పెనాల్టీ వేయాలని, జేఎస్ గోడౌన్ ను బ్లాక్ లిస్టులో ఉంచాలని, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. మాయమైన రేషన్ బియ్యంపై విచారణ చేపట్టేందుకు ఆర్డీవో, సివిల్ సప్లైస్ మేనేజర్, లీగల్ మెట్రాలజీ విభాగం నుంచి అసిస్టెంట్ కంట్రోలర్ తో కమిటీ వేశారు.

# జనం జేబులకు టోల్ చిల్లు

నెల్లూరు, డిసెంబర్ 19, ఆంధ్రప్రదేశ్‌లో టోల్ ఫీజులు జనం జేబులకు చిల్లు పెడుతున్నాయి. కొత్త నిబంధనలు అమల్లోకి రావడంతో సింగల్ ఎంట్రీ ఫీజులను వసూలు చేస్తున్నారు. దీంతో జనంపై భారీగా భారం పడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపె 65టోల్ గేట్లలో ఇదే రకమైన వసూళ్లు అమలవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ టోల్ ప్లాజాలలో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫాస్ట్ ట్యాగ్ వినియోగంతో జనానికి అప్పటికప్పుడు ఎంత కోత పడుతుందో తెలియకపోయినా టోల్ వసూళ్లు లెక్క బయటపడేసరికి జనం గగ్గోలు పెడుతున్నారు. ప్రతి టోల్ గేట్ వద్ద సింగల్ ఎంట్రీని మాత్రమే అనుమతిస్తున్నారు. ప్రిపెయిడ్ తరహాలో ఫాస్ట్ ట్యాగ్‌లను వినియోగిస్తుండటంతో టోల్ ఫీజు ఎంత వసూలు చేస్తున్నారో వాహనాలకు అప్పటికప్పుడు తెలియడం లేదు.గత కొన్ని వారాలుగా ఒక రోజులో ఎన్నిసార్లు జాతీయ రహదారుల మీదుగా టోల్ ప్లాజాలను క్రాస్? చేస్తే అన్నిసార్లూ విడివిడిగా టోల్ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. విజయవాడ- గుంటూరు మధ్య జాతీయ రహదారిపై పెదకాకాని- కాజా వద్ద ఉన్న టోల్ ప్లాజాలో ఒక్కసారి ప్రయాణిస్తే రూ.160 ఛార్జీ వసూలు చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో 24గంటల్లోపు అందులో సగమే వసూలు చేసేవారు.బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో నిర్మించిన జాతీయ రహదారుల గడువు ముగియడంతో కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. దీంతో అయా రహదారులపై వాహనం ఎన్నిసార్లు ప్రయాణిస్తే అన్నిసార్లు టోల్ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. రాష్ట్రంలోని 65 టోల్ ప్లాజాలల్లో ఇదే పరిస్థితి ఉంది. వీటి నిర్మాణం, బీవోటీ గడువు ముగియడంతో అక్టోబరు నుంచి కొత్త నిబంధలన ప్రకారం టోల్ వసూలు చేస్తున్నారు.సెప్టెంబరు నెల వరకు జాతీయ రహదారులపై ప్రయాణించే కార్లకు ఒకవైపు ప్రయాణానికి రూ. 160 తిరుగు ప్రయాణంలో రూ.80 చెల్లిస్తే సరిపోయేది. 24 గంటల వ్యవధిలో ఆ కారు ప్రత్యేకంగా టోల్ ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదు. అక్టోబరు నుంచి అమలులోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనల ప్రకారం ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లూ మొదటి వైపు ప్రయాణానికి ఒకవైపు పూర్తి ఫీజుతో పాటు రెండోసారి సగం ఫీజు చొప్పున వసూలు చేస్తున్నారు.విజయవాడ-గుంటూరు మధ్య నిత్యం వేల సంఖ్యలో ఉద్యోగులు వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. తాజా నిబంధనతో వారిపై టోల్ రూపంలో తీవ్ర భారం పడుతోంది. టోల్ ఫీజుల మార్పులు గురించి ఎలాంటి ప్రకటన విడుదల చేయకుండా ఫాస్ట్‌టాగ్‌లో వసూలు చేయడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ప్రజల నుంచి అడ్డగోలుగా టోల్ ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని జాతీయ రహదారులపై మొత్తం 69 టోల్ ప్లాజాలు ఉన్నాయి. 65 టోల్ ప్లాజాల్లో కొత్త నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేస్తున్నారు. విజయవాడ-హైదరాబాద్ మార్గంలోని తీసర టోల్ ప్లాజాను కొద్ది కాలం క్రితమే జీఎంఆర్ నిర్మాణం చేపట్టింది. నెల్లూరు-చెన్నై హైవేలో ఉన్న వెంకటాచలం, బూదరం, సూళ్లూరుపేట కలిపి మొత్తం 4 చోట్ల మాత్రమే పాత విధానంలో వాహనాలకు టోల్ వసూలు చేస్తున్నట్టు ఎన్‌హెచ్ అధికారులు చెబుతున్నారు.నాలుగు టోల్ ప్లాజాల్లో 24 గంటల్లోపు ఎన్ని సార్లు రాకపోకలు సాగించినా..ఒకసారి పూర్తిఫీజు, రెండోసారిసగంఫీజుమాత్రమేతీసుకుంటారు.వీటినిర్మాణంకొత్తగా జరగడంతో కాంట్రాక్టర్లకు బీవోటీ గడువు 2031 వరకు ఉంది. అప్పటివరకు పాత పద్ధతిలోనే వసూలు చేస్తారు. మిగిలిన 65టోల్ ప్లాజాల్లో ఫాస్ట్ టాగ్ కోతలు తప్పడం లేదు.

## పాత బస్తీ వెల్డింగ్ షాప్ లో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్ పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఐఎస్ సదన్ పిఎస్ పరిధిలో ఉన్న మదన్నపేట చౌరస్తాలో ఉన్న వుడ్ వర్క్ అండ్ వెల్డింగ్ షాప్ లలో మంటలు ఎగిసిపడ్డాయి. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. స్పాట్ కి వచ్చిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేసారుఏ. అగ్నిప్రమాదానికి గల కారణాలు టెలియాల్సి ఉంది.

# మరో 2 రోజులు చలి...

హైదరాబాద్, డిసెంబర్ 19, చలి చంపేస్తోంది. వారం రోజులుగా విపరీతమైన చలి పెరిగింది. ఏటా డిసెంబర్‌లో పెరగడం సాధారణమే. కానీ, ఈసారి మరింత పెరిగింది. దీంతో వాతావరణ శాఖ కూడా అప్రమత్తమైంది. కొన్ని జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది. చలి తీవ్రతకు తోడు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనాల కారణంగా కూడా తెలంగాణ అంటా ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతున్నాయి. అల్పపీడనం కారణంగా చల్ల గాలులు వీస్తున్నాయి. ఇప్పటికే ఏపీలో వర్షాలు కూడా కురుస్తున్నాయి. డిసెంబర్ 20,21 తేదీల్లో వర్షాలు పడతాయని ఐఎండీ కూడా తెలిపింది.అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో చలి తీవ్రత పెరుగుతోంది. పొగమంచు కూడా ఎక్కువగా కురుస్తోంది. ఈ నేపథ్యంలో ఐఎండీ కొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి తీవ్రత పెరుగుతోంది. కొన్ని జిల్లాలో 10 డిగ్రీలకు దిగువన కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు కూడా 25 డిగ్రీలకు దిగువన నమోదువుతన్నాయి. దీంతో పగలు, రాత్రి చలి పెడుతోంది. పైరగాలి ప్రభావంతో చలి ఎక్కువగా అనిపిస్తోంది.

చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో డిసెంబర్ 20,21 తేదీల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ ఆదేశించింది. ముఖ్యంగా ఆదదిలాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో చలి మరింత పెరుగుతుందని తెలిపింది. ఈమేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, రవంగల్ జిల్లాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.చలి తీవ్రత కారణంగా ఉదయం ఆఫీసులు, స్కూళ్లకు వెళ్లేవారు, ఇళ్లలోని చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యవసాయ పనులు, ఇతర పనులకు వెళ్లే కూలీలు కూడా జాగ్రత్తగా ఉండాలని తెలిపింది. చలి నుంచి రక్షించుకోవడానికి ఉన్ని వస్త్రాలు, ముదురు రంగు వస్త్రాలు ధరించాలని సూచించింది. ఆస్తమా రోగులు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఇన్‌హేలర్ వెంట ఉంచుకోవాలని తెలిపింది.

# మరోసారి పార్టీ మారేందుకు అవంతి ప్లాన్

## 10 ఏళ్లలో నాలుగు పార్టీలు

విశాఖపట్టణం, డిసెంబర్ 19, పదేళ్లలో నాలుగు పార్టీలు.. ఇప్పుడు ఐదో పార్టీలోకి.. ఆ నేత ఎవరంటే?నేతలు పార్టీలు మారడం ఇప్పుడు సర్వసాధారణం.

ఏ నాయకుడు.. ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియని పరిస్థితి. అధికారమే పరమావధిగా పావులు కదుపుతుంటారు చాలామంది నాయకులు.ఏపీ రాజకీయాల్లో అదృష్టవంతులైన నేతలు చాలామంది ఉన్నారు. అటువంటి వారిలో అవంతి శ్రీనివాసరావు ఒకరు. గంటా శ్రీనివాసరావు శిష్యుడుగా పేరు పొందిన ఈయన ఆయనను అనుసరించారు.అధికార పార్టీకి దగ్గరగా ఇట్టే చేరువవుతూ వచ్చారు.ఈ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయేసరికి ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు.త్వరలో ఆయన తెలుగుదేశం పార్టీలో చేరతారని ప్రచారం నడుస్తోంది.అందుకు తగ్గట్టుగానే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.అవంతి విద్యాసంస్థల అధినేతగా ఉమ్మడి రాష్ట్రంలోనే ఆయన సుపరిచితం.ప్రజారాజ్యం పార్టీతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ఈయన..ఎమ్మెల్యేగా,ఎంపీగా,మంత్రిగా వ్యవహరించారు. తనకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకున్నారు. 2009 నుంచి 2024 వరకు ప్రజాప్రతినిధిగా కొనసాగారు.ఇప్పుడు చేతిలో పదవి లేకపోయేసరికి..అధికార పార్టీని వెతుక్కుంటూ వెళ్తున్నారు2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేశారు.ఆ ఎన్నికల్లో 18 సీట్లకు పరిమితమైంది పిఆర్పి.అయితే విశాఖ జిల్లా నుంచి నాలుగు స్థానాల్లో విజయం సాధించింది ప్రజారాజ్యం. ఆ పార్టీ తరపున భీమిలి నుంచి పోటీ చేసిన అవంతి శ్రీనివాసరావు గెలిచారు. మారిన రాజకీయ పరిణామాల క్రమంలో కాంగ్రెస్ పార్టీలో పిఆర్పీని విలీనం చేశారు చిరంజీవి. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు అవంతి. 2014లో తెలుగుదేశం పార్టీలోకి వెళ్లారు. అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి గెలిచారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచారు. ఎంపీ అయ్యారు. కానీ మంత్రి అవ్వాలన్న ఆలోచనతో ఎంపీగా ఉంటూనే వైసీపీకి టచ్ లోకి వెళ్లారు అవంతి. 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున భీమిలి నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు అవంతి శ్రీనివాసరావు. జగన్ క్యాబినెట్లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రెండున్నర సంవత్సరాల పాటు మంత్రిగా కొనసాగారు.

ఈ ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు టిడిపిలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారుపది సంవత్సరాల కాలంలో నాలుగు పార్టీలను మార్చారు అవంతి శ్రీనివాసరావు.తొలుత ప్రజారాజ్యం, తరువాత కాంగ్రెస్, మళ్లీ టిడిపి, అక్కడ నుంచి వైసిపి.. ఇలా పార్టీల మీద పార్టీలు మార్చిన ఆయన ఇప్పుడు అధికారానికి దూరం కావడంతో టిడిపి వైపు వచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. అవంతి శ్రీనివాసరావుకు భీమిలి నియోజకవర్గం లో విద్యాసంస్థలు ఉన్నాయి.

ఆయన అధికార పార్టీలో చేరడానికి అదో కారణంగా తెలుస్తోంది. తొలుత గంటా శ్రీనివాసరావు ఆయన రాకను వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం నడిచింది. కానీ ఇప్పుడు గంటా శ్రీనివాసరావు కేవలం ఎమ్మెల్యే మాత్రమే. అందుకే టిడిపిలో ఉన్న పాత పరిచయాలను వినియోగించుకొని అవంతి శ్రీనివాస్ రావు సైకిల్ ఎక్కుతారని ప్రచారం నడుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# జీమెయిల్, వాట్సప్ లకు మస్క్ చెక్...

న్యూయార్క్, డిసెంబర్ 19 (న్యూస్ పల్స్) ఎలాన్ మస్క్ హ్యాండ్ పడితే అది తిరుగులేని విజయం సాధిచడం ఖాయం. టెస్లా దగ్గర నుంచి స్పేస్ ఎక్స్ వరకూ ఆయన చేపట్టిన ప్రాజెక్టులు బంపర్ హిట్లు అయ్యాయి. ప్రపంచంలో అత్యధిక ధనవంతుడిగా నిలిచారు. ట్విట్టర్ కొన్నప్పుడు ఆయన ఆస్తిలో సగం అయిపోయిందని అనుకున్నారు. కానీ రెట్టింపు అయింది. మొన్నటి దాకా ఆయన అమెరికా అధ్యక్ష ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఎలాన్ మస్క్ కు ట్రంప్ కొత్త పదవి ఇచ్చారు. అది పూర్తి స్థాయి పదవి కాదు. తన వ్యాపారాలు తాను చేసుకుంటూ డోగే అనే వ్యవస్థను నడపాల్సి ఉంటుంది. ఆయనకు రకరకాల సలహాలను సోషల్ మీడియాలో ఇస్తూంటారు నెటిజన్లు. తాజాగా ఆయనకు .. ఎలాన్ మస్క్ ఈమెయిల్ సర్వీస్ ను ప్రారంభిస్తే తాము జీమెయిల్ ను డంప్ చేస్తామని ఓ నెటిజన్ ఆఫర్ ఇచ్చారు. అది చూసిన మస్క్.. భిన్నంగా స్పందించారు. మెసెజింగ్ మీదనే మొత్తం థింక్ చేయాల్సి ఉందని అందులో ఈమెయిల్‌తో పాటు అన్ని మెసెజింగ్ వ్యవస్థలపైనా చర్చించాల్సి ఉందని చెప్పుకొచ్చారు. తర్వాత మరో నెటిజన్ ఎక్స్ మెయిల్ క్రియేట్ చేసి చూపించారు. అవును.. తర్వాత చేయాల్సిన పని ఇదేనని సమాధానం ఇచ్చాడు. ఆ తర్వాత చాలా మంది చాలా వాటిపై సలహాలు ఇచ్చారు. ఒకరు యూట్యూబ్ సంగతి కూడా చూడాలన్నారు. ఎలాన్ మస్క్ రిప్లయ్స్ చూస్తే ఆయన త్వరలో జీ మెయిల్ కు చెక్ పెట్టేందుకు రంగంలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# జేపీసీలో ముగ్గురు ఏపీవాళ్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 19, దేశవ్యాప్తంగా ఇప్పుడు జమిలి ఫీవర్ నడుస్తోంది. ఏకకాలంలో సార్వత్రిక ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలన్నదే జమిలి లక్ష్యం. ఇప్పటికే కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించింది దీనికి. పార్లమెంట్ ఉభయ సభల ముందుకు వచ్చింది జమిలి బిల్లు. అయితే ఈ బిల్లును ఆమోదించాలని భావిస్తున్న కేంద్రం సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసింది. 21 మంది లోక్సభ ఎంపీలు, పదిమంది రాజ్యసభ ఎంపీలతో సహా మొత్తం 31 మందితో జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసింది. లోక్సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుకు సంబంధించి ఈ కమిటీ పరిశీలించనుంది. అయితే ఈ 31 మంది ఎంపీల్లో .. ముగ్గురు ఏపీకి చెందిన వారు ఉండడం విశేషం. జాయింట్ పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవల్ ఈరోజు పార్లమెంట్లో ప్రవేశపెట్టనున్నారు.ఈ కమిటీకి పిపి చౌదరి చైర్మన్గా వ్యవహరించనున్నారు. కమిటీలో ఏపీకి చెందిన బిజెపి ఎంపి సీఎం రమేష్, టిడిపికి చెందిన హరీష్ బాలయోగి, జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరీలకు అవకాశం కల్పించారు. ఇక కాంగ్రెస్ పార్టీ తరపున ప్రియాంక గాంధీ వాద్ర పేరును ప్రకటించారు. కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ కుమార్తె బన్సూరి స్వరాజ్ కు సైతం అవకాశం ఇచ్చారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండే కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ ఏక్ నాథ్ షిండే కు సైతం చోటు దక్కింది.పిపి చౌదరి (చైర్మన్), డాక్టర్ సీఎం రమేష్, బన్సూరి స్వరాజ్, పురుషోత్తం భాయ్ రూపాల, అనురాగ్ సింగ్ ఠాకూర్, విష్ణు దయాల్ రామ్, బి.మహతాబ్, డాక్టర్ సంబిత్ పాత్ర, అనిల్ బాలుని, విష్ణు దత్ శర్మ, ప్రియాంక గాంధీ వాద్ర, మనీష్ తివారి, శుక్ దేవ్ భగత్, ధర్మేంద్ర యాదవ్, కళ్యాణ్ బెనర్జీ, టీఎం సెల్వ గణపతి, జిఎం హరీష్ బాలయోగి, సుప్రియ సూలే, డాక్టర్ శ్రీకాంత్ ఏక్ నాథ్ షిండే, చందన్ చౌహన్, వల్లభనేని బాలశౌరి సభ్యులుగా ప్రకటించారు. తదుపరి పార్లమెంటు సమావేశాల చివరి వారంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ తమ రిపోర్టును సమర్పించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# క్యాన్సర్ కు వ్యాక్సిన్...

మాస్కో, డిసెంబర్ 19, మారుతున్న జీవన శైలి.. ఉరుకుల పరుగుల జీవితం.. ఆహారంలో మార్పుల కారణంగా వ్యాధులు మనల్ని చుట్టుముడుతున్నాయి. కొత్త కొత్త వైరస్‌లు పుట్టుకొస్తున్నాయి. కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతోపాటు క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది.

ఒకప్పుడు ఇంటి పంట.. ఇంట్లో వండిన వంటను మాత్రమే తినేవారు. రసాయనాలు లేని పంటలు పండించేవారు. ఎలాంటి విషతుల్యం కాని పాలు తాగేవారు. నిల్వ చేయని మాంసం తినేవారు.

దీంతో అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు తక్కువగా వచ్చేవి. కానీ, మారుతున్న కాలంతో జీవన శైలిలోనూ మార్పులు వస్తున్నాయి. వ్యవసాయంలో రసాయనాల వినియోగం విపరీతంగా పెరిగింది. పాలను రసాయనాలతో నిల్వ చేస్తున్నారు. వాటినే మనం తాగుతున్నాం. ఇక మాసం కూడా ఫ్రీజ్ చేసి అమ్ముతున్నారు. ఇలా అన్ని ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయి.

దీంతో దీర్ఘకాలిక వ్యాధులు మనల్ని చుట్టుముడుతున్నాయి. ఇందులో క్యాన్సర్ ఒకటి. ఇటీవలి కాలంలో క్యాన్సర్ వాధితులు గణనీయంగా పెరుగుతున్నారు. వ్యాధికి అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చినా.. చాలా మంది వ్యాధితో మృతిచెందుతున్నారు. ఇందుకు కారణం.. వ్యాధిని తొలి దశలోనే గుర్తించకపోవడం. ఈ తరుణంలో వైద్యరంగంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. ఇందుకు రష్యా కేంద్రంగా మారింది. క్యాన్సర్‌ను నయం చేసే వ్యాక్సిన్‌ను రూపొందించింది. అంతేకాదు.. దీనిని దేశంలోని రోగులకు ఉచితంగా అందిస్తామని ప్రకటించింది. ఎంఆర్ఎన్ఏ ఆధారితంగా రూపొందించిన ఈ వ్యాక్సిన్‌ను వచ్చే ఏడాది అందుబాటులోకి తెస్తామని రష్యా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తరపున రేడియాలజీ మెడికల్ రీసెర్చ్ సెంటర్ జనరల్ డైరెక్టర్ అంద్రే కప్రిన్ ప్రకటించారు.కరోనా నుంచి రక్షణ కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న కొన్ని టీకాలు మెసెంజర్ ఆర్ఎన్ఏ(ఎంఆర్ఎన్ఏ) పోగుల ఆధారంగా పనిచేస్తాయి. అవి కరోనా వైరస్‌ను గుర్తించేలా మానవ రోగ నిరోధక వ్యవస్థకు శిక్షణ ఇస్తాయి. అలాగే రష్యా తయారు చేసిన క్యాన్సర్ వ్యాక్సిన్ కూడా ఇదే తరహాలో పనిచేస్తుంది. ఆర్ఎన్ఏ(రిబో న్యూక్లియర్) అనేది ఒక పాలిమెరిక్ అణువు. ఇది జీవ కణజాలంలో చాలా జీవ సంబంధమైన విధులకు అవసరం. మెసెంజర్ ఆర్ఎన్ఏ పీస్‌ను వ్యాక్సిన్ ద్వారా శరీరంలోకి ప్రవేశపెడతారు. తద్వారా కణాను ఒక నిర్దిష్టమైన ప్రొటీన్‌ను ఉత్పత్తి చేయడానికి ప్రేరేపిస్తుంది. రోగ నిరోధక వ్యవస్థ ఈ ప్రొటీన్‌ను గుర్తిస్తుంది. దానితో పోరాడడానికి ప్రతినిరోధకాలను ఉత్పత్తి చేస్తుంది. అంటే క్యాన్సర్ కణాలను గుర్తించి దాడిచేస్తుంది.వ్యాక్సిన్ తయారీలో ఏఐ పాత్ర కూడా ఉంది. పర్సనలైజ్డ్ వ్యాక్సిన్లను రూపొందించడానికి ఏఐ ఆధారిత న్యూరల్ నెట్వర్క్ గణనలు అవసరమైన సమయాన్ని తగ్గించలవని, ఈ ప్రక్రియ కేవలం గంటలోపే పూర్తి చేయగలదని ప్రకటించారు.

### ఒకే గురుకుల పాఠశాలలో ఆరుగురిని కాటేసిన పాము

### గురుకుల పాఠశాలల్లో ఆగని పాము కాట్లు

జగిత్యాల పెద్దాపుర్ గురుకుల పాఠశాలలో ఉదయం మరో విద్యార్థి యశ్విత్ పాము కాటుకు గురయ్యాడు. వెంటనే విద్యార్దిని కోరుట్ల ప్రభుత్వాసుపత్రికి సిబ్బందితరలించారు. బుధవారం నాడు ఓంకార్ అఖిల్ అనే విద్యార్థిని పాము కరిచింది. ఇద్దరు విద్యార్థులకు చికిత్స కొనసాగుతోంది. ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలో పడ్డారు. ఇదే పాఠశాలలో గతంలొఓ పాము ఆరుగురిని కాటేసింది. ఇద్దరు మృతి చెందినట్లు సమాచారం

# కరిగిపోతున్న అంబానీ, అదానీల ఆదాయం...



భారత కుబేరుల సంపద సన్నగిల్లుతోంది. అంబానీ, అదానీల నికర సంపదలో డౌన్‌ఫాల్ మొదలయ్యింది. కొంతకాలంగా భారత స్టాక్ మార్కెట్ సూచీలు పతనం అవుతుండగా? దిగ్గజ కంపెనీలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్ స్టాక్స్ పెద్ద మొత్తంలో పడిపోతున్నాయి. ఈ క్రమంలో దిగ్గజ పారిశ్రామిక వేత్తల నికర సంపద భారీగా తగ్గుతోంది. భారతదేశంలో అత్యంత సంపన్నుల జాబితాలో అగ్ర స్థానంలో నిలవడమే గాక, ఆసియాలోనే ధనికులుగా గుర్తింపు పొందినవారు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ. కొద్ది నెలల క్రితం నికర ఆదాయం భారీగా పెరిగిన వీరు, ఇప్పుడు మాత్రం బ్లూమ్ బర్గ్ 100 బిలియన్ డాలర్ల క్లబ్ లో చోటు దక్కించుకోలేకపోయారు. వారి వ్యాపారాలతోపాటు వ్యక్తిగత సంపద విషయంలోనూ ఇద్దరూ సవాళ్లు ఎదుర్కోవడం వల్లే ఈ క్లబ్ నుంచి బయటకు రావాల్సి వచ్చిందని తాజాగా విడుదలైన 'బ్లూమ్‌బర్గ్' నివేదిక పేర్కొంది.అంబానీ ఎనర్జీ, రిటైల్ వ్యాపారాల ప్రదర్శన అనుకున్నంతగా లేకపోవడం కూడా ఈ క్లబ్ నుంచి బయటకు రావడానికి ఒక కారణమని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఇప్పుడు, ప్రపంచ కుబేరుల జాబితాలో టాప్-10లో ఇద్దరిలో ఏ ఒక్కరూ లేకపోవడం గమనార్హం. సెప్టెంబరు 2022లో గౌతమ్ అదానీ.. ప్రపంచంలోనే రెండవ అత్యంత సంపన్న వ్యక్తిగా ఉండగా.. ఇప్పుడు 19వ స్థానానికి పడిపోయారు. ముఖేష్ అంబానీ 17వ స్థానానికి పరిమితమయ్యారు. తాజాగా.. ఇద్దరి సంపద 100 బిలియన్ డాలర్ల మార్క్ దిగువకు చేరినట్లు బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ నివేదిక వెల్లడించింది.జులైలో, తన కుమారుడు అనంత్ అంబానీ పెళ్లి సమయంలో అంబానీ సంపద దాదాపు 120.8 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత కరెన్సీలో ఇది రూ. 10.25 లక్షల కోట్లు. అదే సమయంలో అంబానీ కుమారుడు వివాహానికి దాదాపుగా 600 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. అంబానీ ఇటీవల డిజిటల్ ప్లాట్‌ఫాంలు, రిటైల్ బ్రాండ్లపై దృష్టి సారించారు. రిటైల్ వ్యాపారంలో ఇటీవల వృద్ధి, లాభాలు మందగించాయి. ఇక, కేసులతో కొత్త చిక్కులు ఎదుర్కుంటున్నఅదానీ కూడా డౌన్‌ఫాల్‌ను ఎదుర్కుంటున్నారు.సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందడం కోసం భారతీయ అధికారులకు ముడుపులు ఇచ్చిన వ్యవహారంలో అమెరికాలో కేసు నమోదైన తర్వాత అదానీ సంపదలో క్షీణత మొదలైంది. జూన్‌లో అదానీ సంపద 122.3 బిలియన్ డాలర్లకు చేరుకోగా.. అమెరికాలో ఆరోపణలు, కేసులు.. అంతకుముందు హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ సామ్రాజ్యానికి సవాళ్లు ఎదురయ్యాయి. ఫలితంగా అదాని సంపద 100 బిలియన్ డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. బ్లూమ్ బర్గ్ నివేదిక ప్రకారం, ప్రస్తుతం ముకేశ్ అంబానీ సంపద 96.3 బిలియన్ డాలర్లు కాగా? గౌతం అదానీ సంపద 80.8 బిలయన్ డాలర్లుగా ఉంది.ఇక, రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థలోని ప్రధాన వ్యాపారాలైన రిటైల్, ఇంధన రంగాలు ఇటీవల మెరుగైన పనితీరు కనబర్చకపోవడమే ముఖేష్ అంబాని పరిస్థితికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. చమురు, రసాయన విభాగంలో డిమాండ్ తగ్గడం, రిటైల్ వినియోగదారుల వ్యయాలు తగ్గడం, చైనా ఎగుమతుల నుంచి పోటీ వంటివి అంబాని సంపదకు ఎసరు పెట్టాయి. ఈ క్రమంలో, కంపెనీకి పెరుగుతున్న అప్పులపైనా ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. రిలయన్స్ షేర్లు తగ్గుతూ వచ్చింది. అలాగే, ఇటీవల మీడియా, ఏఐ కంప్యూటింగ్‌లో ఆధిపత్యం కోసం అంబానీ పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టడం కూడా సంపద డౌన్‌ఫాల్‌కు కారణమయ్యింది.మరోవైపు, గౌతమ్ అదానీ సంపద గత కొన్నేళ్లుగా తీవ్ర హెచ్చుతగ్గులకు గురవుతోంది. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్ వెలువడగా.. గరిష్ట స్థాయిల నుంచి సంపద భారీగా తగ్గింది. మధ్యలో మళ్లీ పుంజుకున్నప్పటికీ.. ఇటీవల వరుస ఆరోపణలు, దర్యాప్తులతో మళ్లీ షేర్లపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు వచ్చే ఏడాది కూడా ఆ సంస్థ మార్కెట్ విలువపై ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదికలు అంచనా వేస్తున్నాయి. అయితే, గతంలోలాగా మళ్లీ మదుపరుల విశ్వాసం పొందేతే తప్ప ఈ ఇద్దరు కుబేరులు కష్ట కాలం నుండి బయటపడే అవకాశం ఉంది.గౌతం అదానీ, ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద నష్టపోయినప్పటికీ? భారతదేశంలోని టాప్-20 బిలియనీర్ల సంపద 2024 జనవరి నుంచి 67.3 బిలియన్ డాలర్లు వృద్ధి చెందినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ఊఅఒ టెక్నాలజీ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ 10.8 బిలియన్ డాలర్లు, ఉక్కు పారిశ్రామికవేత్త సావిత్రి జిందాల్ 10.1 బిలియన్ డాలర్ల సంపద పెంచుకున్నారు.మరోవైపు, ఎలన్ మస్క్ కంపెనీ స్టార్ లింక్ భారత్‌లో ఎంట్రీ ఇవ్వడానికి రంగం సిద్ధమైనట్లు కనిపిస్తోంది. దీనితో, స్టార్ లింక్, భారత్‌లో శాటిలైట్ ఆధారిత వాయిస్, డేటా కమ్యూనికేషన్ వంటి సేవలు ప్రారంభిస్తే.. ఎయిర్‌టెల్‌తో పాటు అంబానీ సంస్థ జియో కూడా గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇది, అంబానీ సంపదకు మరో సవాలుగా మారే ఛాన్స్ ఉంది. అంబానీ తిరిగి నిలదొక్కుకోడానికి చేస్తున్న ఈ వ్యూహాలు దీర్ఘకాలిక వృద్ధి సామర్థ్యాన్ని సూచిస్తున్నాయి.

తాజా గ్లోబల్, డొమెస్టిక్ సవాళ్లకు కొత్తగా అమెరికా గద్దెనెక్కబోతున్న ట్రంప్ ప్రెసిడెన్సీ కూడా ఒక రకంగా కారణమేనని కొందరు వాదిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌కి తిరిగి ఎన్నికైన తర్వాత భారతీయ ఎగుమతులపై కొత్త ట్యాక్స్‌లను మోపుతున్నారు. దీని వల్ల భారతీయ వ్యాపారాలకు సంభావ్య వాణిజ్య సవాళ్లు ఎదురవుతాయనే భయం కూడా అందరిలో కనిపిస్తోంది. అయితే, దీని ప్రభావం ఇప్పటికే కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, రాబోయే రోజుల్లో మరిన్ని సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్ విధించిన సుంకాలతో భారతదేశ ఎగుమతులు పోటీలో నిలదొక్కుకోలేవని అంటున్నారు.ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ? దేశంలో అభివృద్ధి చెందుతున్న మధ్యతరగతికి అవకాశాలను అందిస్తూనే ఉండటాన్ని మంచి పరిణామంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# సముద్రంలో ఫెర్రీని ఢీకొట్టిన నేవి స్పీడ్ బోటు

## 13 మంది మృతి



ముంబాయి ముంబై దగ్గర అరేబియా సముద్రంలో జరిగిన పడవ ప్రమాదం జరిగింది. ఒక నేవీ స్పీడ్ బోట్ వేగంగి వచ్చి గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెంటా దీవులకు పర్యాటకులతో వెళ్తున్న ఫెర్రీని ఢీకొట్టింది. దీంతో ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది.

ఘటనలొఓ పదమూడు మంది మృతి చెందారు. నేవీ బోట్ లో ఐదుగురు వుండగా ఫెర్రీలో 110మంది ప్రయాణికులు వున్నారు. మృతుల్లో ముగ్గురు నేవి సిబ్బంది వున్నారు. 101 మందిని కాపాడినట్లు అధికారులు తెలిపారు. నేవీ బోటు మరమత్తుల అనంతరం పరీక్షలు చేస్తుండగా అదుపు తప్పినట్లు నేవీ ప్రకటించింది.డవ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధాని మోదీ ?2లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ?50,000 చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించారు.నౌకా దళం, కోస్ట్ గార్డు సహాయక చర్యలు చేపట్టాయి. పదికొండు నేవి బోట్లు, మెరైన్ పోలీసుల మూడు బోట్లు బాధితులను రక్షించాయి.

### చిరుత పులి కలకలం

గన్నవరం మండలం మెట్లపల్లి లో చిరుతపులి మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు తన పంట పొలం రక్షించేందుకు పందులకు ఉచ్చు పెట్టగా ఉచ్చులో చిక్కిన చిరుత పులి చనిపోయింది. రైతు ఉదయాన్నే పొలం వెళ్లి చూడగా ఉచ్చులో చిక్కి మృతి చెందిన చిరుత పులి కనిపించింది. దీంతో గ్రామస్తులు పరిసర ప్రాంత ప్రజలు ఒక్కసారిగా అవాక్కయ్యారు.మెట్లపల్లి చుట్టుపక్కల అటవీ ప్రాంతంలో ఇంకా చిరుతపులులు ఉన్నాయేమో అంటూ గ్రామస్తులు చుట్టూ ప్రక్కల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# నేడు అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం




అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవాన్ని డిసెంబర్ 20న నిర్వహించబడుతున్నది , ఇది ఐక్యరాజ్యసమితి మరియు దాని సభ్య దేశాల అంతర్జాతీయ వార్షిక ఐక్యత దినం. పేదరికాన్ని తగ్గించడానికి ప్రపంచ లక్ష్యాలు,కార్యక్రమాల గురించి సభ్య దేశాలకు అవగాహన కల్పించడం మరియు ప్రపంచవ్యాప్తంగా స్వతంత్ర దేశాల పేదరిక తగ్గింపు వ్యూహాలను రూపొందించడం భాగస్వామ్యం చేయడం ద్వారా సంఘీభావం యొక్క సార్వత్రిక విలువను గుర్తించడం దీని ప్రధాన లక్ష్యం . అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం ప్రపంచ సాలిడారిటీ ఫండ్ మరియు యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా ప్రచారం చేయబడింది , ఇవి ప్రపంచవ్యాప్తంగా పేదరిక నిర్మూలన కోసం నిర్దేశించబడిన లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించాయి. ఒక వ్యక్తి విద్యకు సహకరించడం ద్వారా లేదా పేదలకు లేదా శారీరకంగా లేదా మానసికంగా వికలాంగులకు సహాయం చేయడం ద్వారా రోజులో పాల్గొనవచ్చు.సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ద్వారా పేదరికం మరియు ఇతర సామాజిక అడ్డంకులకు ప్రతిస్పందించడానికి ప్రభుత్వాలు ప్రోత్సహించబడతాయి .

సభ్య దేశాలు మరియు యూఎన్ మధ్య విదేశీ సంబంధాలను నెలకొల్పడం ద్వారా ఆధునిక యుగంలో ఒక వ్యక్తి యొక్క పౌర మరియు రాజకీయ హక్కులను నిర్ణయించే యూఎన్ మిలీనియం డిక్లరేషన్ క్రింద అంతర్జాతీయ మానవ సాలిడారిటీ డే స్థాపించబడింది.దీనిని 2005 ప్రపంచ సమయంలో జనరల్ అసెంబ్లీ ప్రవేశపెట్టింది. సమ్మిట్ అధికారికంగా డిసెంబర్ 22, 2005న 60/209 తీర్మానం ద్వారా స్థాపించబడింది, ఇది సంఘీభావాన్ని ప్రాథమిక మరియు సార్వత్రిక విలువ.ఐక్యరాజ్యసమితి ప్రకారం , అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం.భిన్నత్వంలో మన ఏకత్వాన్ని జరుపుకునే రోజు,అంతర్జాతీయ ఒప్పందాలకు తమ కట్టుబాట్లను గౌరవించాలని ప్రభుత్వాలకు గుర్తు చేసే రోజు,

సంఘీభావం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఒక రోజు,

పేదరిక నిర్మూలనతో సహా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంఘీభావాన్ని ప్రోత్సహించే మార్గాలపై చర్చను ప్రోత్సహించే రోజు,

పేదరిక నిర్మూలన కోసం కొత్త కార్యక్రమాలను ప్రోత్సహించడానికి ఒక రోజు.ఈ రోజున, పేదరిక నిర్మూలన కోసం యూఎన్ కొత్త కార్యక్రమాలను ప్రోత్సహిస్తుంది. అంతర్జాతీయ ఒప్పందాల పట్ల తమ కట్టుబాట్లను గౌరవించాలని ప్రభుత్వాలకు ఈ రోజు రిమైండర్‌గా పనిచేస్తుంది. సంఘీభావం యొక్క ప్రాముఖ్యతను ప్రచారం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా ఈవెంట్‌లు జరుగుతాయి. ఈ ఈవెంట్‌లలో ప్రెజెంటేషన్‌లు, సెమినార్‌లు, సమావేశాలు మరియు రౌండ్‌టేబుల్ చర్చలు ఉంటాయి. ఈ సంఘటనలలో చాలా వరకు పేదరికాన్ని ఎలా ఎదుర్కోవాలి అనే దానిపై కూడా దృష్టి పెడుతుంది.

# మదనపల్లెలో జడ్జి బంగాళాలో శ్రీగంధం చెట్ల నరికివేత

మదనపల్లె జడ్జి బంగళాలో బుధవారం అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు శ్రీగంధం చెట్లను నరికివేశారు. గురువారం ఉదయం గమనించిన మదనపల్లె సెకండ్ ఏడిజె కోర్టు అబ్రహం వెంటనే డీఎస్పీ కొండయ్య నాయుడుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన డిఎస్పీ, సిఐ ఎరిసావల్లి, ఎస్ఐ వెంకటశివ జడ్జి బంగ్లాకు చేరుకున్నారు. బంగ్లాలో శ్రీగంధంచెట్ల నరికివేతను పరిశీలించారు. వివరాలు తెలుసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు..

# ఇందిరమ్మ ఇళ్లు యాప్ నుంచే సేవలు

హైదరాబాద్, డిసెంబర్ 19, సాంకేతిక రంగం విపరీతంగా పెరిగిపోయింది. చదువుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు ఉంటున్నాయి. ఇక 5జీ కూడా అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వాలు, ఆయా ఉద్యోగ సంస్థలు వారి వారి పనులను యాప్ ల ద్వారా చేయించుకుంటున్నాయి. ఒక మార్కెటింగ్ ఉద్యోగి ఒక ఊరికి వెళ్లి అక్కడి నుంచి ఒక పావలా పోస్ట్ కార్డుపై కంపెనీ అడ్రస్ రాసి పోస్ట్ చేస్తేనే సదరు ఉద్యోగి మార్కెటింగ్ కోసం ఆ ఊరికి వెళ్లేవాడని కంపెనీ నమ్మేది. ఇప్పుడు ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. సదరు ఊరికి వెళ్లి ఆ షాపు వారి ఫొటో కొట్టి అప్ లోడ్ చేస్తున్నారు. ఇలా చాలా విషయాల్లో మార్పులైతే జరిగాయి. సాంకేతికత పెరగడంతో పనుల్లో కూడా వేగం పెరిగింది. మనిషి ఈ జమానాలో స్వయంగా చేయాల్సిన పని స్విచ్ లను నొక్కడమే. ఈ సాంకేతికతను ప్రైవేట్ సంస్థలు, పెద్ద పెద్ద ఆర్గనైజేషన్స్ మాత్రమే వాడుతుండేవి. కానీ ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా?లు వీటినే ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. చాలా కార్యక్రమాలకు సపరేట్ గా యాప్ లను తయారు చేసి వాటి నుంచి వివరాలు నమోదు చేసి చెక్ చేస్తున్నారు.ఇటీవల ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇండ్లు' అనే యాప్ ను తయారు చేసింది. గతంలో 'ప్రజా పాలన'లో తీసుకున్న అర్జీలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ యాప్ ను ఉపయోగిస్తున్నారు. ప్రజా పాలనలో తీసుకున్న అర్జీల్లో ఇండ్లు లేని వారి వివరాలను పరిశీలించి వారికి ఒక రోజు ముందు ఫోన్ చేసి రోజు తర్వాత వచ్చి ఇందిరమ్మ ఇండ్లు యాప్ లో వివరాలు నమోదు చేసుకుంటారు. ఈ యాప్ నుంచి తీసుకున్న వివరాలు నేరుగా ప్రభుత్వానికి వెళ్తాయి. అక్కడి పెద్దలు పరిశీలించి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారుఇలా చాలా విషయాలకు ప్రభుత్వాలు సొంతంగా యాప్ లు తయారు చేస్తున్నాయి. ఇలానే తెలంగాణ ప్రభుత్వం ఒక యాప్ ను తీసుకురాబోతోంది. ఈ యాప్ ద్వారా ప్రభుత్వానికి సంబంధించి చాలా పనులు వేగంగా పూర్తవుతాయి. అంటే మీరు ఏదైనా ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే సమీపంలోని కార్యాలయం వెళ్లి చేసుకోవాలి. గంటల గంటల సమయం వృథా.. పనులు కూడా వేగంగా కావడం లేదు. దీంతో ప్రభుత్వం ఒక యాప్ ను తీసుకువస్తుంది.అయితే ఈ యాప్ ను పంచాయతీ పరిధిలో వినియోగించనున్నారు. జనన, వివాహ, మరణ, ఇంటి నిర్మాణ అనుమతి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఇలా చాలా పథకాలు, సర్టిఫికెట్లు మొత్తం 20 రకాలకు సంబంధించి ఈ యాప్ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. దీని పేరు 'మై-పంచాయతీ' అని పెట్టబోతోందట. వీటితో పాటు గ్రామ సమస్యలపై కూడా ఇందులో ఫిర్యాదు చేయవచ్చుట. ఇది వస్తే ప్రభుత్వం, వినియోగదారులపై భారం తగ్గుతుందని చర్చ జరుగుతోంది.

# 100 సంవత్సరాల మెదక్ చర్చి




మెదక్, డిసెంబర్ 19, మెదక్ కేథడ్రల్.. దక్షిణ భారతదేశంలో అత్యధికంగా సందర్శించే చర్చిల్లో ఒకటి. దీనిని బ్రిటిష్ వెస్లియన్ మెథడిస్టులకు చెందిన చార్లెస్ వాకర్ పోస్నెట్ నిర్మించారు. 1914 – 1924 మధ్య దాదాపు 10 సంవత్సరాల నిర్మాణం తర్వాత.. డిసెంబర్ 25, 1924న దీన్ని ప్రారంభించారు.బ్రిటిష్ వెస్లియన్ మెథడిస్టులు మెదక్ చర్చిని నిర్మించారు, దీనిని డిసెంబర్ 25, 1924న పవిత్రం చేశారు. 1914లో కరువు సమయంలో.. ఈ ప్రాంతానికి సహాయం చేయడానికి.. పనికి ఆహారం కార్యక్రమంలో భాగంగా ఈ చర్చిని నిర్మించారు.మెదక్ చర్చిని గోతిక్ రివైవల్ శైలి కేథడ్రల్, ఎత్తైన స్తంభాలు, తడిసిన గాజు కిటికీలు, రాతి శిల్పాలతో నిర్మించారు. ఇది 100 అడుగుల వెడల్పు, 200 అడుగుల పొడవు ఉంటుంది. దాదాపు 5,000 మందికి వసతి కల్పించగలదు. చర్చి పైకప్పు బోలు స్పాంజ్ మెటీరియల్‌తో సౌండ్‌ప్రూఫ్‌తో నిర్మించారు. బెల్ టవర్ 175 అడుగుల ఎత్తులో ఉంటుంది.ఈ చర్చి తెలంగాణలోని మెదక్ జిల్లాలో ఉంది. దక్షిణ భారతదేశంలో అత్యధికంగా సందర్శించే చర్చిల్లో ఇది ఒకటి. మరో విశేషం ఏంటంటే.. భారతదేశంలో ఎక్కువ ఫొటోలు తీసింది ఈ చర్చినేమెదక్ చర్చి దక్షిణ భారతలో బిషప్ స్థానం దక్కించుకుంది. మెదక్ డయోసెస్ ఆసియాలో అతిపెద్దది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద డియోసెస్ ఇక్కడే ఉంది.మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతాయి. విదేశాలు, దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వస్తారు. క్రిస్మస్ రోజున ఈ చర్చి లోపల బోధించే ప్రసంగం పట్టణం అంతటా వినబడుతుంది. పురాతన మెదక్ కోట వరకు బోధనలు వినబడతాయి

# కాళేశ్వరం విచారణ అన్ని వేళ్లు కేసీఆర్ వైపే

హైదరాబాద్, డిసెంబర్ 19,ళేశ్వరం ప్రాజెక్టును కట్టాలన్నది అప్పటి సీఎంగా కేసీఆర్ తీసుకున్న నిర్ణయమేనని, మేడిగడ్డ సహా మూడు బ్యారేజీల ఎంపిక కూడా ఆయనదేనని రిటైర్డ్ చీఫ్ సెక్రెటరీ ఎస్కే జోషి స్పష్టం చేశారు. వార్షిక బడ్జెట్‌లో నీటిపారుదల శాఖకు చేసిన కేటాయింపులతో పాటు సప్లిమెంటరీ పేరుతో నిధులు విడుదలయ్యేవన్నారు. భారీ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక వనరులు కష్టసాధ్యం కావడంతో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని ఎంక్వయిరీ కమిషన్ బుధవారం నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా ఈ విషయాలు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో తుమ్మిడిహట్టి దగగర ప్రాణహిత ప్రాజెక్టు కట్టాలనే నిర్ణయం జరిగిందని, నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం ఇచ్చిన రిపోర్టుతో పాటు మహారాష్ట్రలో ముంపు ప్రాంతం ఉంటుండడంతో వచ్చిన అభ్యంతరం కూడా మరో కారణమని జస్టిస్ ఘోష్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.ప్రాజెక్టు స్థలాన్ని అప్పటి సీఎం కేసీఆర్ మార్చాలనే నిర్ణయం తీసుకున్నారని ఎస్కే జోషి తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమంటూ పదేపదే ప్రస్తావించినా కేసీఆర్ పేరును వెల్లడించడానికి తటపటాయించారు. కేబినెట్ సమావేశంలో జరిగిన నిర్ణయమంటూ కొద్దిసేపు దాటవేశారు. మంత్రులందరూ ఉమ్మడిగా తీసుకున్న నిర్ణయమని, ఇరిగేషన్ శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదన అని సీఎం కంటే కేబినెట్ విస్తృతమైనదని, పెద్దదని ఇలాంటి పలు రకాల వాదనలను తెరపైకి తెచ్చారు. హై పవర్ కమిటీ ఏర్పాటు, ఐబీఎం కమిటీ నిర్ణయం, ప్రాజెక్టుకు ప్రభుత్వం నుంచి మంజూరైన అనుమతులు, ఇలాంటి విషయాల్లోనూ సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేయడంతో జస్టిస్ ఘోష్ తనదైన శైలిలో వివరాలను రాబట్టారు. హైపవర్ కమిటీ, ఐబీఎం కమిటీల గురించి తనకు అవగాహన లేదని బదులివ్వడంతో ఆ ఉత్తర్వులను చూపించడంతో అనివార్యంగా ఒప్పుకోక తప్పలేదు. ప్రాజెక్టుకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల గురించి ఎస్కే జోషి బదులిస్తూ, ఇది ఒక కాంప్లెక్సు ప్రాజెక్టు అని, మొత్తం 28 ప్యాకేజీలు, 8 లింకులు ఉన్నందున వేర్వేరు తేదీల్లో అనుమతులు మంజూరై ఉండొచ్చని, మొత్తంగా దాదాపు 200 ఉంటాయని సూచనప్రాయంగా తెలిపారు. బ్యారేజీ నిర్మాణ సంస్థలు ఇతర సబ్ ఏజెన్సీల నుంచి తీసుకున్న సాయంపై వివరణ ఇస్తూ, కాంట్రాక్ట్ సంస్థలు అవసరాన్ని బట్టి వేరే సబ్ కాంట్రాక్టు కంపెనీల సాయం తీసుకొని ఉండొచ్చన్నారు. బ్యారేజీల డిజైన్ల లోపం, ఆపరేషన్, మెయింటెనెన్స్ లోపం, గేట్ల ఆపరేషన్‌ల లోపం వంటి కారణాలతో మేడిగడ్డ కుంగిపోయి ఉండొచ్చని వెల్లడించారు. పబ్లిక్ బాండ్స్ ఇష్యూ చేయలేదని, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ప్రాజెక్టును నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు కుంగడానికి కారణం గేట్ల ఆపరేషన్స్ సరిగ్గా లేకపోవడమేనని పేర్కొన్న ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా పనిచేసిన రజత్ కుమార్, నాణ్యతలో లోపం కూడా ఉండొచ్చన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్ణయాన్ని అసెంబ్లీ వేదికగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో వివరించారని, ఆ తర్వాత 2016లో అనుమతి ఇచ్చారని తెలిపారు. నీళ్లను ఎగువ ప్రాంతానికి లిఫ్టు చేయడానికి వీలుగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నిల్వ చేయాల్సి వచ్చిందని వివరించారు. తొలుత 2019 సెప్టెంబరులో వరదలు వచ్చాయని, అప్పుడే మేడిగడ్డ బ్యారేజీలో లోపం వెలుగులోకి వచ్చిందన్నారు.

దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి ఎలక్షన్ కోడ్ ఆంక్షలు అడ్డం వచ్చాయని చెప్పారు. నీరు నిల్వ ఉన్నందునే పిల్లర్ కుంగిన ప్రాంతంలో ఫౌండేషన్ కింద ఏం జరిగిందో వెంటనే తెలుసుకోలేకపోయినట్లు తెలిపారు. పునాది కింద ఇసుక కొట్టుకుపోవడం వల్లనే డ్యామేజీ జరిగి ఉండొచ్చన్నారు.నిర్మాణపు పనుల్లో నాణ్యత సరిగ్గా లేకపోవడంతో పాటు గేట్లను సరిగ్గా నిర్వహించకపోవడం, సకాలంలో సరైన తీరులో మెయింటెనెన్స్ పనులను చేపట్టకపోవడం కూడా కారణమన్నారు. మొదటిసారి లోపం వచ్చిన తర్వాత చర్యలు చేపట్టడానికి ఇబ్బందులు ఎదురైనా 2020, 2021లో వచ్చిన వరదలప్పుడూ బ్యారేజీలు తట్టుకుని నిలబడ్డాయని గుర్తు చేశారు. నిజానికి బ్యారేజీల గేట్ల నిర్వహణ బాధ్యత ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌దేనని అన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు గురించి ప్రస్తావిస్తూ ఇరిగేషన్ డిపార్టుమెంటు ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుని పేమెంట్ చేసిందని తెలిపారు. బ్యారేజీ పిల్లర్ల కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చేసిన కామెంట్లపై స్పందించడానికి రజత్ కుమార్ నిరాకరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఆదాయం సమకూరే మార్గాలపై డీపీఆర్‌లోనే ప్రభుత్వం వివరణ ఇచ్చిందని, కేంద్ర జల సంఘం సహా ద్రవ్య సంస్థలు సైతం సంతృప్తిచెంది రుణాలను ఇచ్చాయన్నారు. పరిశ్రమలకు నీటిని సరఫరా చేయడంతో పాటు మిషన్ బగీరథకు త్రాగునీటిని ఇవ్వడం ద్వారా రెవెన్యూ సమకూరుతుందని, మరోవైపు ఆయకట్టు పెరగడం ద్వారా 'పిసికల్చర్' ద్వారానూ ఆదాయం వస్తుందని చెప్పారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మాత్రమే ఆ ఆదాయం సమకూరుతుందని, అప్పటివరకూ రుణాలను, వాటిపై వడ్డీని ప్రభుత్వమే కట్టాల్సి ఉంటుందన్నారు.కాళేశ్వరం ఎంక్వయిరీ కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాల్సిందిగా ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కు నోటీసులు జారీ అయ్యాయి. కానీ అసెంబ్లీ సెషన్ జరుగుతున్నందున విచారణకు తాను హాజరు కాలేనంటూ కమిషన్‌కు రిప్లై ఇచ్చారు. అసెంబ్లీ సెషన్ పూర్తయ్యేంతవరకూ వీలు పడకపోవచ్చన్న తీరులో కమిషన్‌కు సమాచారం ఇచ్చినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

ఒకటి రెండు రోజుల అనంతరం మరోసారి నోటీసులు జారీ చేసి ఆమె నుంచి వచ్చే సమాధానాన్ని తెలుసుకుని తదుపరి చర్యలపై కమిషన్ నిర్ణయం తీసుకోనున్నది.కమిషన్ నిర్వహిస్తున్న క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా రిటైర్డ్ చీఫ్ సెక్రెటరీ సోమేశ్ కుమార్‌ను జస్టిస్ పీసీ ఘోష్ విచారించే అవకాశమున్నది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి చీఫ్ సెక్రెటరీ హోదాలో తీసుకున్న నిర్ణయాలు, తెలిపిన ఆమోదం తదితరాలపై ఆయనను ప్రశ్నించే ఛాన్స్ ఉంది. ఆర్థికపరమైన అంశాలకు సంబంధించి ప్రస్తుతం ఫైనాన్స్ డిపార్టుమెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా ఉన్న రామకృష్ణారావును సైతం కమిషన్ ఈ దఫాలోనే విచారించనుంది.

# మంచుదెబ్బకు మామిడి పూత ఎఫెక్ట్

నిజామాబాద్, డిసెంబర్ 19, రాష్ట్రంలో అత్యల్ప ఉష్ణోగ్రతలతో మామిడి పూత కోతకు గురవుతుంది. దేశంలోని మామిడి ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో మంచు ప్రభావం రైతులపై పడుతోంది. ప్రస్తుతం మామిడి తోటలను మంచు దుప్పటి కప్పేస్తోంది. రాత్రి వేళల్లో కురుస్తున్న మంచుతో మామిడి పూతపై తీవ్ర ప్రభావం చూపుతోంది.రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాల్లో మామిడి పంట సాగు అవుతోంది. సాగు విస్తీర్ణంలోనూ, దిగుబడిలోనూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ కంటే ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంటుంది. ఏపీ తరువాత స్థానాల్లో కర్ణాటక, తెలంగాణ, బీహార్, గుజరాత్ రాష్ట్రాలు ఉన్నాయి. అయితే రాష్ట్రంలో ప్రతి ఏటా మారుతున్న పరిస్థితులతో పాటు వాతావరణ అననుకూలత కారణంగా దిగుబడి తగ్గుతోంది. ప్రస్తుత లెక్కల ప్రకారం దేశ మామిడి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ 16.07 శాతం ఉత్పత్తి అవుతోంది. తెలంగాణ నుంచి కేవలం 8.54 శాతం మామిడి ఉత్పత్తే వస్తోంది. అదే ఉత్తరప్రదేశ్‌లో అయితే 23.06 శాతం మామిడి ఉత్పత్తి వస్తోంది.ఏపీ ఉద్యానశాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 4.03 లక్షల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. దాని నుంచి 59.06 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి జరుగుతోంది. రాష్ట్రంలో ఉద్యానవనం పరిధిలో వచ్చే అరటి తరువాత అత్యధిక దిగుబడి వచ్చే పంట మామిడే నిలిచింది. ఇటీవలి రాష్ట్ర ప్రభుత్వం మామిడి పంటకు కూడా బీమా అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బీమా వర్తింప చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది.2024-25, 2025-26 సంవత్సరాల్లో పునర్వ్యవస్థీకరణ తర్వాత వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) అమలుకు ప్రభుత్వం పరిపాలనాపరమైన ఆమోదం తెలిపింది. ఖరీఫ్ సీజన్‌లో ఏడు పంటలు, రబీ సీజన్‌లో రెండు పంటలను ఈ బీమా కవర్ చేస్తుంది. రబీ సీజన్‌లో మామిడిని అదనపు పంటగా చేర్చడానికి పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మామిడి పంటకు పథకం అమలుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను నిర్దేశించిన విధానం ప్రకారం పూర్తి చేయాలని సూచించింది.అయితే సాధారణంగా రెండు విడతల్లో మామిడి పూత వస్తుంది. డిసెంబర్, జనవరి మధ్య పూత వచ్చి ఆ తరువాత పిందెలు రావాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఎక్కడా పూత కనిపించడం లేదు. మొక్క తోటల్లో మాత్రమే అక్కడక్కడ పూత కనిపిస్తోంది. ఇది ఒకటి నుంచి రెండు శాతం కంటే ఎక్కువ ఉండదని రైతులు చెబుతున్నారు. మొదటి విడతలో పూత కనిపించకపోయినా వాతావరణంలో వచ్చే మార్పుతో రెండో విడతలో పూత విచ్చుకునే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు తెలుపుతున్నారు. చీడపీడలను నివారించి, మేలైన యాజమాన్య పద్ధతులు చేపడితే నాణ్యతగల మంచి దిగుబడి అభిస్తాయని ఉద్యానవన యూనివర్శిటీ అధ్యపకులు తెలిపారు.రాష్ట్రంలో ప్రధానంగా బంగినపల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, తోతపూడి (కలెక్టర్), పందూరి మామిడి, ముంతమామిడి తదితర రకాల మామిడి పంట రైతులు పండిస్తున్నారు. కొత్తపల్లి కొబ్బరి, పందూరి మామిడి పండ్లుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. తోతపూడి రకం మామిడ పండ్లను జ్యూస్ తయారు చేసే కార్పొరేట్ కంపెనీలు సేకరిస్తుంటాయి. మామిడి తాంద్ర తయారీలోనూ కూడా అధికంగా వినియోగిస్తారు. ఇప్పటికే రైతులు చీడల నివారణకు అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. కొంత మంది చిన్న, సన్నకారు మామిడి రైతులు గిట్టుబాటు రాక తోటలను ఎకరా రూ.12 వేల నుంచి రూ.15 వేలకు కౌలుకు ఇచ్చేస్తున్నారు. పూత కోత, చీడల నివారణకు ఉద్యానవన అధికారులను సంప్రదించి, వారు చెప్పిన పురుగు మందులను వాడాల్సి ఉంటుంది. అప్పుడే పూత కోత నివారణను, చీడల నివారణను అరికట్టగలుగుతారు.

# కెనడాలో గాజువాక యువకుడు అనుమానస్పద మృతి

విశాఖపట్నం ఉన్నత చదువులు కోసం కెనడా కి వెళ్ళిన విశాఖ యువకుడు అక్కడ మృతి చెందాడు. ఫణికుమర్ (33) హాస్టల్ లో నిద్రిస్తూ అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. నిద్రలో గుండె పోటుతో యువకుడు మృతి చెందాడు అని ఫణికుమర్ మిత్రుల తల్లిదండ్రులు కి ఫోన్ చేసి చెప్పారు. శోకసంద్రంలో ఫణికుమర్ తల్లిదండ్రులు మునిగిపోయారు. మా అబ్బాయిని ఇండియాకి తీసుకురావాలని తల్లిదండ్రుల అధికారులనె కోరుతున్నారు.

# సిరిసిల్లలో పోలీస్ అక్కలు

కరీంనగర్ డిసెంబర్ 19 సిరిసిల్ల జిల్లా పోలీసులు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బాలికలు, మహిళల భద్రత కోసం 'పోలీస్ అక్క' వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా "పోలీస్ అక్క" పేరుతో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ కానిస్టేబుల్ ను ఎంపిక చేశారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటించారు.వినూత్న కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహిళల రక్షణ కోసం 'పోలీసు అక్క' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. షీ టీమ్ కు అదనంగా ప్రతి పోలీస్ స్టేషన్ కు "పోలీస్ అక్క" పేరుతో మహిళ కానిస్టేబుల్ ఎంపిక చేశారు. వారు పోక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, మహిళ చట్టాలపై అవగాహన కల్పించనున్నారు.సిరిసిల్లలో షీ టీమ్ ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన "పోలీస్ అక్కా" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. జిల్లాలో మహిళా రక్షణకు ప్రథమ బాధ్యతగా తీసుకుంటూ మహిళ రక్షణయే దెయ్యంగా షీ టీమ్ ఆధ్వర్యంలో విస్నూత కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే "పోలీస్ అక్క" పేరుతో జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ కానిస్టేబుల్ ఎంపిక చేయడం జరిగిందన్నారు.పోలీస్ అక్కగా ఎంపిక కాబడిన వారు షీ టీమ్ కి సహాయకంగా ఉంటారని ఎస్పీ పేర్కొన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తూ విద్యార్థులకు పోక్సో యాక్ట్, సెక్సువల్ హర్స్మెంట్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు వారు సంప్రదించే విధంగా షీ టీమ్, డయల్ 100, పోలీస్ అక్క నంబర్లు ఆయా పాఠశాలల్లో, కళాశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థిని విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఎస్పీ మహాజన్ సూచించారు. సోషల్ మీడియాలో వేదికగా విద్యార్థినుల పట్ల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే నిర్భయంగా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

ఆటకట్టిస్తున్న షీ టీమ్?

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏర్పాటు చేసిన షీ టీమ్ సత్ఫలితాలు ఇస్తుందని ఎస్పీ తెలిపారు. విద్యార్థుల మహిళల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ ఈ సంవత్సరం 52 మంది ఆకతాయిలను రెండ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం మహిళలను, విద్యార్థులను వేధిస్తున్న వారిపై 60 పెట్టి కేసులు, 44 ఈఎఖీ లు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

×పిఎస్ ల వారిగా పోలీస్ అక్కలు...

సిరిసిల్ల టౌన్ – సరస్వతీ
తంగలపల్లి – సుజాత
మస్తాబాద – మంజుల
ఎల్లతకుంట –ప్రవళిక
ఎల్లారెడ్డిపేట – రోజా
గంభీరరావుపేట. శిరీష
వీరన్నపల్లి– స్వప్న.
వేములవాడ టౌన్ లత
వేములవాడ రూరల్ – రేణుకా
బోయినపల్లి. పినాకల్ యాదవ్
చందోర్తి . శ్రీవెన్నెల
కోనారావుపేట– సంధ్య
రుద్రాంగి. జి అమల

# కమలానికి కొత్త ఏడాది కొత్త అధ్యక్షుడు

హైదరాబాద్, డిసెంబర్ 19, తెలంగాణ రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఎవరన్న దానిపై పార్టీ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు త్వరలోనే తెరపడనుంది. పార్టీ జాతీయ నాయకత్వం.. సంక్రాంతి కల్లా రాష్ట్రానికి అధ్యక్షుడిని నియమించనున్నట్లు తెలుస్తోంది. అయితే అంతర్గత చర్చల్లో రోజుకో సీనియర్ నేత పేరు తెరపైకి వస్తున్నా.. ఎంపీగా ఉన్న బీసీ నేతకు ఎక్కువ అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ సమీకరణాలు మారితే మాత్రం అనూహ్యంగా కొత్త నేతకూ అవకాశం దక్కవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి.తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ జాతీయ నాయకత్వం మదిలో ఏముందో రాష్ట్రంలోని కీలక నేతలకు సైతం అంతు చిక్కడంలేదు. అధికార పీఠమే అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అనుసరించే వ్యూహంలో వేసే ఎత్తుగడలు మాత్రం అనూహ్యంగా ఉండబోతున్నాయని బీజేపీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. పార్టీలో కొంతమంది సీనియర్ నేతల మధ్య అంతర్గత విభేదాలున్నాయి. పాత, కొత్త నేతల పంచాయతీలతో రాష్ట్ర పార్టీ వ్యవహారాలు నాలుగు స్తంభాలాటగా మారాయన్న విషయం అధినాయకత్వం దృష్టికి కూడా వెళ్లిందంట. తాము అధికారంలోకి రావాలంటే ముందు పార్టీలో సమన్వయం అవసరమని భావిస్తున్న పార్టీ పెద్దలు.. ఆ దిశగా కొత్త అధ్యక్షుడికి బాధ్యతలు కట్టబెట్టాలని భావిస్తున్నారంట.అన్ని సవాళ్లను ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగే నేతకే ఢిల్లీ పెద్దలు పట్టం కట్టబోతోతున్నారంట.. పోరాట పటిమ, సమన్వయం చేసుకునే సమర్థతతోపాటు వయసును కూడా ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఎక్కువగా ఉందంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు పలువురు సీనియర్ నేతల నుంచి అభిప్రాయాలు తీసుకున్న పార్టీ అధిష్ఠానం.. తాజాగా మరోసారి కొంతమంది ముఖ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకుందని పార్టీవర్గాలు వెల్లడించాయి.మరోవైపు సంస్థాగత ఎన్నికలకు సంబంధించి బీజేపీ ఇప్పటికే కసరత్తు ముమ్మరం చేసింది. గత నెల 25 నుంచి ఈ ప్రక్రియను మొదలు పెట్టింది. కాగా ఈనెల 15 లోపు బూత్ కమిటీ ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తోంది. అందుకు పార్టీ హైకమాండ్ ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. 15 నుంచి 20 వరకు మండల కమిటీలు కంప్లీట్ చేయాలని చూస్తోంది. ఈ ప్రక్రియ అనంతరం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు వెళ్లేందుకు నాయకత్వం సిద్ధం అవుతోంది. ఇప్పటికే పార్టీ బూత్ ల వారీగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి వరుసగా వర్క్‌షాప్‌లు నిర్వహించింది. గ్రౌండ్ నుంచి పార్టీని స్ట్రాంగ్ చేయదాంతో పాటు,. సంస్థాగత ఎన్నికల నిర్వహణ, సభ్యత్వాలు, యాక్టివ్ మెంబర్ షిప్ అంశాలపైనా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసింది.ఇక సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే జాతీయ, రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారులను, జిల్లాల వారీగా ఇంచార్జీలను హైకమాండ్ నియమించింది. జాతీయ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తెలంగాణకు చెందిన రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ను, రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణను నియమించింది. వారు ఇప్పటికే సంస్థాగతంగా ఎన్నికలకు కసరత్తు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు జాతీయ అధ్యక్షుడు ఎవరవుతారనే ఉత్కంఠ కాషాయ శ్రేణుల్లో నెలకొంది. స్టేట్ ప్రెసిడెంట్ కోసం చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు. ఎంపీల్లో రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, డీకే అరుణ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అలాగే ఎమ్మెల్యేల్లో రాజాసింగ్, పాయల్ శంకర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే కొంతమంది నేతలు పార్టీ హైకమాండ్ ఆశీస్సులు పొందాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది.అయితే పార్టీ అధ్యక్షుడు ఎవరనే దానిపై అధిష్ఠానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో హైకమాండ్ నిర్ణయానికి అనుగుణంగానే సంస్థాగత ఎన్నికలు జరుగుతున్నాయనే చర్చ ఆ పార్టీలో జరుగుతోంది. పార్టీ డిసైడ్ చేసిన నేతకే మద్దతు తెలిపి లాంఛనంగా ఎన్నుకుంటారనే టాక్ సైతం వినిపిస్తోంది. అధ్యక్షుడు ఎవరనే నిర్ణయం జరిగిపోవడంతో.. ఇక ఆ పేరు చుట్టూనే ఎన్నిక హడావుడి కొనసాగనుంది. అభ్యర్థి ఈటల రాజేందరే అంటున్నారు. అయితే పార్టీ డిసైడ్ చేసింది ఎవరిని అనేది కాషాయశ్రేణుల్లో సస్పెన్స్‌గా మారిందంట.

# 55 కోట్లు లెక్క గట్టిగా పట్టుకుంటోంది...

హైదరాబాద్, డిసెంబర్ 19, దమ్ముంటే అరెస్ట్ చేస్తే చేస్కోండి.. ఏమవుతుంది.. జైలుకెళ్లి యోగా చేసి స్లిమ్ అవుతా, ఫిట్ అయి వస్తా, పాదయాత్ర చేస్తా అంటున్నారు కేటీఆర్, నిజానికి ఆర్బీఐ అనుమతి తీసుకోకుండా మనీ ట్రాన్స్ ఫర్ చేయడం తప్పు అని మాజీ మంత్రికి తెలిసే ఇలా మాట్లాడుతున్నారా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. పైగా ఫార్ములా ఈ రేస్ లో అధికారులది ఏం తప్పు లేదు అంతా నాదే బాధ్యత అంటున్నారు. అంతే తప్ప అందులో ఎలాంటి తప్పు లేదని మాత్రం అంతే ధైర్యంగా చెప్పలేకపోతున్నారు.అప్పుడు నేనే గవర్నమెంట్, సంతకం పెట్టా.. పైసల్ రిలీజ్ చేయించా.. అయితే ఏంటి అని కేటీఆర్ ఎదురుప్రశ్నిస్తున్నారు. నిజానికి ఫార్ములా ఈ రేసింగ్ విషయంలో తప్పులు కచ్చితంగా జరిగాయి అని ఇప్పటికే చాలా మందికి అర్థమైంది. ఎందుకంటే ఆఘమేఘాల మీద ఆర్బీఐ అనుమతి లేకుండా, క్యాబినెట్ ను సంప్రదించకుండా, పైగా ఎన్నికల కోడ్ ఉండగా, 55 కోట్ల రూపాయలను ట్రాన్స్ ఫర్ చేయించారు. ఇందులో దాచడానికి ఏముందంటున్న కేటీఆర్.. ఇంత అర్జంట్ గా అదీ ఎన్నికల కోడ్ ఉండగా, ఆర్బీఐ, క్యాబినెట్ అనుమతి లేకుండా ఎందుకలా చేశావ్.. ఒక్కడివే మీదికి ఎందుకు తెచ్చుకున్నావ్ అంటే అట్నుంచి ఆన్సర్ లేదు.నిజానికి బయటి దేశపు సంస్థ, కంపెనీకి పెద్ద మొత్తంలో డబ్బులు పంపాలంటే ఆర్బీఐ అనుమతి తీసుకోవాలి. ట్యాక్స్ చెల్లించి పంపినా అందులో జరగాల్సిన ప్రాసెస్ చాలా ఉంటుంది. కానీ ఇవేవీ పట్టించుకోలేదు. ఈ విషయంలో అసలు ఏం జరిగిందన్నది బయటకు తేవాలనుకుంటోంది ప్రభుత్వం. అందుకే ఏసీబీ విచారణ కోసం గవర్నర్ అనుమతి కోరింది. తాజాగా గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇందులో మతలబులు ఏం జరిగాయో పాలకు పాలు, నీళ్లకు నీళ్లు బయట పెట్టేందుకు రెడీ అవుతోంది ప్రభుత్వం. గత కొన్ని రోజులుగా కేటీఆర్ సీన్ ఆఫ్ యాక్షన్ ప్లాన్స్ చూస్తుంటే అర్జంటుగా జైలుకు వెళ్లాలన్న తాపత్రయమే కనిపిస్తోందన్నది చూసే వారెవరికైనా అర్థమయ్యే విషయమే. ఎందుకోసం ఈ ఆరాటం అన్న ప్రశ్నలకు రకరకాల ఆన్సర్లు వస్తున్నాయిఫార్ములా ఈ రేసింగ్ పై క్యాబినెట్ అనుమతి లేదు, ఒప్పందాలు లేవు.. సింపుల్ గా నిధులను సింగిల్ సిగ్నేచర్ తో ఈజీగా ఇచ్చి పడేశారు కేటీఆర్. కానీ ఎలాంటి ఒప్పందాలు లేకుండా ఆ సొత్తును ఆర్బీఐ అనుమతి లేకుండానే 9 కోట్ల టాక్స్ తో ఎఫ్ఈవో కి చెల్లించడం చట్ట విరుద్ధం అని ప్రభుత్వం అంటోంది. ఎవరో నష్ట పోయారని అందుకు తెలంగాణ సందనను దోచిపెట్టడం ఏంటని కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం రేసింగ్ ను రద్దు చేస్తే.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పరువు పోయిందని, 700 కోట్లు నష్టమన్న వాదనను కేటీఆర్ వినిపించుకొచ్చారు.నిజానికి 2024 ఫిబ్రవరి 10న జరగాల్సిన రేస్ జరగకపోడంతో హెచ్ఎండీఏను సుమారు 200 కోట్ల నష్టాల బారి నుంచి తప్పించింది కాంగ్రెస్ సర్కార్. అయితే ఊఓఆం ఇండిపెండెంట్ బోర్డు అని, తాను వైస్ ఛైర్మన్ అని చెబుతూ.., ఎవరి అనుమతీ అక్కర్లేదంటూనే.., అరెస్ట్ గురించి కేటీఆర్ ఎందుకంత భయపడుతున్నారన్నదే అసలు పాయింట్.డిసెంబర్ 16న క్యాబినెట్ మీటింగ్ సందర్భంగా ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గ సహచరులకు వివరించారు. ఇందులో జరిగిన అవినీతిపై ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఇదే మ్యాటర్ పై మంత్రుల అభిప్రాయాన్ని కూడా సీఎం తెలుసుకున్నారు. ఈ కేసులో ఎక్కడా తప్పులకు ఆస్కారం లేకుండా, అన్నీ చట్టానికి లోబడి, చట్ట ప్రకారంగానే ముందుకెళ్లాలనుకుంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం.అంతే కాదు.. ఇటీవలే సీఎం బర్త్ డే సందర్భంగా కేటీఆర్ ఓ ట్వీట్ చేశారు. ప్రభుత్వ ఏజెన్సీలు ఎప్పుడైనా రావొచ్చని, కావాలంటే కేక్ కట్ చేయించి.. చాయ్, ఉస్మానియా బిస్కెట్లు కూడా ఇచ్చి పంపుతానన్నారు. సో లేటెస్ట్ మ్యాటర్ ఏంటంటే.. ఏ క్షణమైనా కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. ఎలాంటి ఎంక్వైరీకైనా రెడీ అని కేటీఆర్ అంటుంటే.. ఈ కేసులో ప్రభుత్వం ఎలాంటి స్టెప్ తీసుకుంటుందన్నది ఉత్కంఠగా మారుతోంది.మరోవైపు కేటీఆర్ చేసింది పెద్ద తప్పు అని, ఆయన జైలుకు వెళ్లక తప్పదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటున్నారు. కేటీఆర్ ఏడేళ్ల దాకా జైల్లోనే ఉండాల్సి వస్తుందని, ఆయన చేసిన తప్పుకు బెయిల్ కూడా రాదంటూ అసెంబ్లీ లాబీల్లో మాట్లాడారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం కేటీఆర్‌కు బెయిల్ వచ్చే ఛాన్స్ లేదని గుర్తు చేస్తున్నారు.ఓవైపు అరెస్ట్ చేస్తే చేస్కోండని కేటీఆర్ అంటుంటే.. ఇంకోవైపు బీఆర్ఎస్ లీడర్లు మాత్రం రాష్ట్రం అగ్ని గుండమే అని వార్నింగ్ లు ఇస్తున్నారు. ఈ రెండింటికీ అసలు మ్యాచ్ అవుతుందా అన్నది హస్తం నేతల ప్రశ్న. తప్పు చేస్తే చిన్నోళ్లైనా, పెద్దోళ్లైనా చట్టం అందరికీ సమానమే ఇప్పటికే రేవంత్ సర్కార్ స్ట్రాంగ్ సిగ్నల్స్ పంపింది. అలాంటిది ఆధారాలతో సహా తప్పులు తేలితే వదిలిపెడుతుందనుకోవడం పొరపాటే.విద్యుత్ కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణం విషయంలో మాజీ సీఎం కేసీఆర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇంకోవైపు ఫార్ములా ఈ రేస్ మనీ ట్రాన్సాక్షన్ ఇష్యూలో కేటీఆర్ కూడా ఇరుక్కునే పరిస్థితి వచ్చింది. ఈ రెండు ఇష్యూస్ లో ఏం జరిగిందో చూద్దాం. ఫస్ట్ కేసీఆర్ కరెంట్ డీలింగ్స్ పై జస్టిస్ మదన్ బి లోకూర్ ఇచ్చిన రిపోర్ట్, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇది వరకే అసెంబ్లీలో ప్రవేశపెట్టిన విద్యుత్ పై వైట్ పేపర్ డిటైల్స్ చెక్ చేద్దాం. విద్యుత్ ఒప్పందాలు, కొనుగోళ్లపై కమిషన్ అక్టోబర్ లోనే ప్రభుత్వానికి రిపోర్ట్ సమర్పించింది.అయితే దాన్ని రేవంత్ ప్రభుత్వం రహస్యంగా ఉంచింది. కమిషన్ ఫైండింగ్స్ పై అన్ని విషయాలు అసెంబ్లీలో చర్చించి.. ఫైనల్ అవుట్ పుట్ తీసుకున్నాకే చర్యలు తీసుకోవాలన్న ఆలోచనతో ఉంది. సో ఇప్పుడు ఆ టైం వచ్చేసిందంటున్నారు. తదుపరి చర్యల దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది కూడా. కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ ను అసెంబ్లీలో ప్రవేశపెట్టి, తాము ఏ చర్యలు తీసుకుంటున్నాం అనేది సభలోనే ప్రకటించాలన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోందికేసీఆర్ హయాంలో పదేళ్లపాటు చేసుకున్న కరెంట్ ఒప్పందాలు, ప్లాంట్ల నిర్మాణంలో తప్పిదాలపై విచారణ జరిపిన జస్టిస్ మదన్ బి లోకూర్ కమిషన్ రిపోర్ట్ ను తెలంగాణ క్యాబినెట్ డిసెంబర్ 16న ఆమోదించింది. నివేదికపై సభలో చర్చించిన తర్వాతే మాజీ సీఎం కేసీఆర్‌పై తీసుకునే చర్యలకు సంబంధించి అసెంబ్లీ సాక్షిగానే ప్రకటన చేయాలనుకుంటోంది ప్రభుత్వం. దీని ఆధారంగా కేసీఆర్ సహా పలువురిపై కేసు నమోదు చేసే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తోంది. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ డిస్కమ్‌లను ఆర్థికంగా కుప్పకూల్చారని, మెప్పు కోసం విద్యుత్ సంస్థలు మునుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని, కరెంట్ కొనుగోళు ,, పవర్ ప్లాంట్ల నిర్మాణంలో తీసుకున్న నిర్ణయాలతో 25 ఏళ్లపాటు తెలంగాణ సమాజం మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని శ్వేతపత్రం తేల్చింది.కాలం చెల్లిన టెక్నాలజీతో కట్టిన భద్రాద్రి పవర్ ప్లాంట్ కారణంగా రానున్న 25 ఏళ్లలో 9 వేల కోట్ల దాకా జనంపై భారం పడనుందంటున్నారు. నిజానికి ఎవరైనా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో పవర్ ప్లాంట్లు కడుతారు. ఇప్పుడు సూపర్ క్రిటికల్, అల్ట్రా క్రిటికల్, అడ్వాన్స్ డ్ అల్ట్రా క్రిటికల్ టెక్నాలజీ అని వచ్చాయి. కానీ కేసీఆర్ మాత్రం కేంద్రం వద్దని చెప్పినా పాత టెక్నాలజీకే మొగ్గు చూపారు. అటు ఛత్తీస్ గఢ్‌తో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందంతో 3,642 కోట్ల నష్టం, యూనిట్ ఏడు రూపాయలకు కొనాల్సిన పరిస్థితి రావడం, 1000 మెగావాట్ల కరెంట్‌ను తీసుకోవడానికి ఛత్తీస్ గఢ్‌తో ఒప్పందం చేసుకున్నా అది రాకపోవడం, బయట కొనడంతో 2 వేల కోట్ల అదనపు భారం పడడం ఇవన్నీ చర్చకు వస్తున్నాయివెయ్యి మెగావాట్ల తరలింపునకు పవర్ గ్రిడ్‌తో కారిడార్ బుక్ చేసుకుని, ఆ మేరకు తరలించకపోవడంతో 635 కోట్లు చార్జీలు కట్టి నష్టపోయిన పరిస్థితి. మరో 1000 మెగావాట్ల కారిడార్‌ను రద్దు చేసుకున్నందుకు నష్టపరిహారం కింద 261 కోట్లు పెనాల్టీ నోటీసు అందుకోవడం అలాగే బొగ్గ గనులకు దూరంగా యాదాద్రి పవర్ ప్లాంటు నిర్మించడం, బొగ్గు రవాణాకే ఎక్కువ ఖర్చు చేయడం ఇవన్నిటిపై క్యాబినెట్ చర్చించింది. విద్యుత్ కమిషన్ రిపోర్ట్ పై కథ చాలా దూరం వెళ్లిందంటున్నారు. నిజానికి దమ్ముంటే విద్యుత్ ఒప్పందాలపై విచారణ జరుపుకోండి అని బీఆర్ఎస్ నేతలు సవాళ్లు విసిరారు. దీంతో ప్రభుత్వం విద్యుత్ కమిషన్ ఏర్పాటు చేసింది.ఒక దశలో కమిషన్ నే రద్దు చేయాలని కేసీఆర్ సుప్రీందాకా వెళ్లారు. అయితే కోర్టు మాత్రం కమిషన్ ఛైర్మన్ ను మార్చాలనడంతో జస్టిస్ నరసింహారెడ్డి స్థానంలో జులై 29న మదన్ బి లోకూర్ కమిషన్ ఛైర్మన్ గా నియమించింది. దీంతో కమిషన్ బహిరంగ ప్రకటన ఇచ్చి ప్రజాభిప్రాయాలు స్వీకరించింది. అఫిడవిట్ల రూపంలో వివరాలు అందించిన వారిని క్రాస్ ఎగ్జామినేషన్ కూడా చేసింది. కేసీఆర్ హయాంలో జరిగిన తప్పులేంటో చాలా మంది కమిషన్ ముందు వివరించారు. నవంబర్ లో ఆ రిపోర్ట్ ప్రభుత్వానికి చేరింది. సో దీనిపై కరెంట్ బాంబ్ ఏదో ఒక సమయంలో పేలడం ఖాయమే అని అంటున్నారు.ఓవైపు విద్యుత్ ఒప్పందాలపై జస్టిస్ మదన్ బి లోకూర్ రిపోర్ట్ ప్రభుత్వానికి అందడం, దాన్ని క్యాబినెట్ ఆమోదించడం, అసెంబ్లీలో పెట్టి చర్చించి చట్ట ప్రకారం ముందుకెళ్లే విషయంపై స్పీడ్ పెరుగుతున్న సమయంలో మాజీ సీఎం కేసీఆర్ అమెరికా ప్రయాణం పెట్టుకుంటున్నారన్న ప్రచారమూ జరుగుతోంది. ఇందులో నిజానిజాలేంటన్నది

# ఏలేరు ఇరిగేషన్ వ్యవస్థ ఆధునీకరణ కు డీపీఆర్ రెడీ

కాకినాడ కొత్తగా ఎన్నికైన నీటి వినియోగదారుల సంఘాల సలహాలు, సూచనలతో ఏలేరు ఇరిగేషన్ వ్యవస్థ ఆధునీకరణకు రివైజ్డ్ డిపిఆర్ రూపొందించి ప్రభు త్వానికి సమర్పించాలని కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ నిర్ణయించిం దని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టనాభి వృద్ధి శాఖ మంత్రి పొంగనూరు నారాయణ తెలిపారు. కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో కాకినాడ జిల్లా సమీకా కమిటీ సమావేశం జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టనాభివృద్ధి శాఖ మంత్రి పొం గనూరు నారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, యంఎ ల్సీలు కర్రిపద్మశ్రీ, బొర్రా గోపీమూర్తి, యంఎల్ఏలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ , యనమల దివ్య, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే ఎస్విఎస్ఎన్ వర్మ, జనసేన పిఠాపురం నియోజక వర్గ ఇన్ చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన , జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా అభివృద్ధికి జరుగుతున్న కార్యక్రమాల ప్రగతి, చేపట్టవలసిన భవిష్యత్ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాల గొకొన్నారు. ఇందులో భాగంగా ఖరీఫ్ ధాన్యం సేకరణ, వ్యవసాయం, పురపాలన, పట్టణాభివృద్ధి, మెప్మా, కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం, త్రాగునీటి సరఫరా, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్ అంశాలపై ప్రజాప్రతినిధులు చర్చించారు. సమావేశంలో సూచించిన అంశాలు, నిర్ణయాలపై ప్రాధాన్యతల కనుగుణంగా సత్వర చర్యలు చేపట్టి, వచ్చే డిఆర్సి సమావేశం లోపు అన్నిటిపై చర్యలుకత పూర్తి చేయాలని జిల్లా ఇన్ చార్జి మంత్రి నారాయమ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన సమావేశంలో చర్చించిన అంశాలను మీడియా ప్రతినిధులకు ప్రెస్ మీట్ లో వివరించారు. సదరు వివరాలను ఈ విధంగా ఆయన తెలిపారుః

– ధాన్యం సేకరణ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల జిల్లాలో రైతుల ఖరీఫ్ ధాన్యానికి బహిరంగ మార్కెట్ లో మద్దతు ధర మించి మంచి ధర లభించి రైతులకు మంచి ధర లభిస్తోందని ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేసారు. ధాన్యాన్ని అకాల వర్షాల నుండి కాపాడుకునేందుకు, ఆరబెట్టేందకునేందుకు టార్పాలిన్ లను సబ్సిడిధరపై సరఫరా చేసేలా ప్రభుత్వాన్ని కోరాలని కమిటీ నిర్ణయించింది.

– వ్యవసాయ శాఖ సమీక్షలో జూన్ ల వర్షాలు ప్రారంభం అయ్యే లోపు కాలువలు, డ్రెయిన్లలో కలుపు, పూడిక పనులు కాలువలు మూసిన వేంటనే చేపట్టేందుకు సిద్దం చేయాలని అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు. రైతులకు నకిలీ విత్తనాల బెడద లేకుండా చూడాలని, నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు.

– ఉపాధిహామీ పథకం అమలు సమీక్షలో 50శాతం రైతులు, 50 శాతం ఉపాధి హామీ పదకం నిధులతో వ్యవసాయ పనులను ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టేలా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించాలేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలని కమిటీ నిర్ణయంచింది.

– ఇరిగేషన్ సమీక్షలో కాలువ శివారు భూములకు కూడా నీరందేలా షట్టర్ల రిపేర్లు, కాల్వల లైనింగ్ పనులు చేపట్టాలని కమిటీ అధికారులకు సూచించింది. నూతనంగా ఎన్నికైన నీటిసంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి వారి అనుభవాల నుండి సేరించిన సూచనలతో 845 కోట్ల నిధులతో ప్రతిపాదించిన ఏలేరు వ్యవస్థ ఆధునీకరణకు రివైజ్డ్ ప్రోజక్స్ రిపోర్టు రూపొందించి ప్రభుత్వ ఆమోదానికి సమర్పించాలని కమిటీ నిర్ణయించింది.

– మన్సిపల్ పరిపాలన సమీక్షలో సాలిడ్ వేస్ట్ నియంత్రణకు ఇప్పటికే విశాపట్నం, గుంటూరులలో విజయవంతమైన వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్ ను రాజానగరం-కాకినాడల మధ్య ఏర్పాటు ప్రతిపాదించి, ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులకు కమిటీ సూచించింది. ఉప్పాడలో అన్నకాంటీన్ ఏర్పాటుకు నిర్ణయించింది. కాకినాడలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఉప్పుటేరుపై మూడవ బ్రిడ్జి , బైపాస్ రోడ్డు నిర్మించాలని కమిటీ నిర్ణయించింది. వచ్చే ఏప్రియల్ నుండి మున్సిపల్ పన్నుల నిధుల సిఎస్ఎఫ్ఎం పరిధి నుండి తప్పించి, స్థానిక సంస్థల పరిధిలోనే ఖర్చు చేసుకునేలా విధాన మార్పు చేయనున్నట్లు మంత్రి తెలియజేశారు. స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ క్రింద నిలిచిపోయిన పనులకు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేలు కోరారు. అలాగే మౌలిక సదుపాయాలు కల్పించి టిడ్కో గృహాలను లబ్దిదారులకు సత్వరం అందించాలని కోరారు.

## పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కాకినాడ పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ కొత్తపల్లి మండలం, రమణక్కపేట గ్రామంలో పదవ తరగతి విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. యధావిధిగా స్కూలుకు వెళ్లేందుకు సిద్ధమైన చింతపల్లి నైపుణ్య (16), ఉదయం నిద్ర లేచినప్పటి నుండి తను పనులు తాను బాగానే చేసుకుందని, స్కూల్ కి వెళ్లేందుకు తల్లితో కుమార్తె జడలు కూడా వేయించుకుందని తల్లి చింతపల్లి సుభాషిణి వాపోయింది.

ఇంతలో ఏమైందో ఏమో తెలియడంలేదని, ఇంటి బయట కుమార్తె పడి ఉండడం చూసి ఏం చేయాలో అర్థం కాలేదని కన్నీరు మున్నీరవుతుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాలికను హుటాహుటిన పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు... అక్కడ నుండి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు...

# సినిమా





## పుష్ప రాజు ఏదో సంకేతం ఇస్తున్నాడు



ఒక పెద్ద హీరో సినిమా థియేట్రికల్ గా మంచి రన్ లో ఉన్నప్పుడు దానికి సంబంధించిన ఒరిజినల్ కంటెంట్ యూట్యూబ్ లో వదలకపోవడం సాధారణంగా అందరూ చేసేదే. ముఖ్యంగా పాటల విషయంలో ఈ జాగ్రత్త తప్పనిసరి. కానీ పుష్ప 2 ది రూల్ నుంచి అప్పుడే రెండు ఫుల్ వీడియో సాంగ్స్ కేవలం రెండు రోజుల గ్యాప్ లో వచ్చేశాయి. పుష్ప టైటిల్ సాంగ్ లో డిలీట్ చేసిన డాన్స్ బిట్ ఉండటం మరో ట్విస్టు. ముందు పీలింగ్స్ పీలింగ్స్ వదిలారు. ఆ తర్వాత మరొకటి. నెక్స్ట్ అసలైనవి రెండు బాకీ ఉన్నాయి. సూసేకి అగ్గిరవ్వ జాతర బ్యాక్ డ్రాప్ కాబట్టి చివర్లో ఆలస్యంగా రిలీజ్ చేయొచ్చు. దానికన్నా ముందు కిసిక్ కిసిక్ ఎక్స్ పెక్ట్ చేయొచ్చు. అయితే ఇంకా మూడో వారం పూర్తి కాకుండానే ఇలా వరసగా వీడియో సాంగ్స్ వదలడం దేనికి సంకేతమోనని ఫ్యాన్స్ చర్చించుకుంటున్నారు. మామూలుగా ఓటిటి రిలీజ్ త్వరగా ఉన్నప్పుడే ఇలా చేస్తారు. పుష్ప 2కి నెట్ ఫ్లిక్స్ నాలుగు వారాల అగ్రిమెంట్ కోసం భారీ మొత్తం చెల్లించిందనే టాక్ ఉంది. అదే నిజమైతే జనవరి మొదటివారంలో స్ట్రీమింగ్ జరగొచ్చు. లేదూ దేవర లాగా 45 రోజుల విండో అయితే మాత్రం రిపబ్లిక్ డే కన్నా ముందు రాకపోవచ్చు. ఫ్యాన్స్ అయితే రెండో ఆప్షన్ కోరుకుంటున్నారు. కానీ ఏదీ ఖచ్చితంగా చెప్పలేం. సంక్రాంతి నుంచి కొత్త సినిమాల తాకిడి ఉంది కాబట్టి పుష్ప 2 అప్పటికంతా నెమ్మదించేస్తుంది. పైగా నెల రోజుల రన్ పూర్తవుతుంది. సో ఒకవేళ నిజంగా నెట్ ఫ్లిక్స్ జనవరి ఫస్ట్ వీక్ వదిలితే థియేట్రికల్ గా అంత సమస్య ఉండకపోవచ్చు. లేదూ అంటే చివరి వారం ఉత్తమం. పుష్ప రాజు ఏ సంకేతం ఇస్తున్నాడో ఈ వారంలో తేలొచ్చు. హిందీ వెర్షన్ నుంచే 600 కోట్లు దాటేసిన పుష్ప 2 ప్రపంచవ్యాప్తంగా పదిహేను వందల కోట్లను దాటేసి రెండు వేల మైలురాయి వైపు పరుగులు పెడుతున్నాడు. కాకపోతే అదంత సులభం కాదు. మనదగ్గర వీక్ డేస్ లో నెమ్మదించింది. డిసెంబర్ 20 రిలీజుల టాక్స్ ని బట్టి మార్పులు ఉంటాయి.

### అట్లీ ఇవ్వబోయే షాకేంటి?

పాన్ ఇండియా స్థాయిలో మార్కెట్ సంపాదించుకున్న సౌత్ దర్శకుల్లో అట్లీ ఒకడు. రాజా రాణి, తెరి, మెర్సల్, బిగిల్ లాంటి బ్లాక్ బస్టర్లతో సౌత్‌లో జెండా పాతిన అతను.. షారుఖ్ ఖాన్ మూవీ 'జవాన్'తో దేశవ్యాప్తంగా ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. ఈ చిత్రం ఏకంగా 1200 కోట్ల వసూళ్లు రాబట్టడంతో అట్లీ పేరు జాతీయ స్థాయిలో మార్మోగింది. దీని తర్వాత అతను చేసే సినిమా మీద చాన్నాళ్ల నుంచి ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్‌లతో సినిమా గురించి వార్తలు వచ్చాయి కానీ.. అవేవీ నిజం కాలేదు. మరోవైపు షారుఖ్ ఖాన్ మళ్లీ అట్లీతో ఇంకో సినిమా చేస్తాడన్నారు కానీ.. అది ఇప్పుడే కాదని తెలుస్తోంది. మరి అట్లీ తర్వాతి సినిమాలో హీరో ఎవరు.. ఈసారి అతను సౌత్ సినిమా చేస్తాడా.. పాన్ ఇండియా స్టైల్లోనే ప్రాజెక్టు సెట్ చేస్తాడా అని అంతా ఎదురు చూస్తున్నారు. ఐతే తన కొత్త చిత్రానికి స్క్రిప్టు పూర్తయినట్లు వెల్లడించిన అట్లీ.. ఈ సినిమాకు పని చేసే నటీనటుల విషయంలో ప్రేక్షకులకు షాకవుతారని పేర్కొన్నాడు. "నా ఆరో సినిమా స్క్రిప్టు పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇది ఔట్ ఆఫ్ ద వరల్డ్ కథగా ఉంటుంది. కచ్చితంగా ఇందులో నటీనటులను చూసి అందరూ ఆశ్చర్యపోతారు. ఎవరి ఊహలకూ అందని విధంగా ఈ ప్రాజెక్టు ఉంటుంది. ఈ సినిమా చూసి దేశం గర్విస్తుంది. నటీనటుల ఎంపిక చివరి దశలో ఉంది. త్వరలోనే కాస్టింగ్ గురించి ప్రకటనలో సర్ప్రైజ్ చేస్తాను. మీ అందరి అభిమానం, ఆశీర్వాదంతో మంచి సినిమాతో మిమ్మల్ని అలరించడానికి సిద్ధమవుతున్నా" అని అట్లీ తన కొత్త ప్రాజెక్టు గురించి హైప్ ఇచ్చాడు. ప్రేక్షకులు ఆశ్చర్యపోతారని అంటున్నాడంటే ఇప్పటిదాకా పని చేయని, వేర్ట్ స్టార్‌తోనే అతను సినిమా చేయబోతున్నాడని అర్థమవుతోంది. మరి ఆ హీరో ఎవరో.. ఈ కథలో అంత ప్రత్యేకత ఏముందో చూడాలి.

## రేవతి కుమారుడు కోలుకోడానికి మేము ఏమైనా చేస్తాం



హైదరాబాద్ లోని సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రేవతి తనయుడు శ్రీతేజ్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలోనే బాలుడిని, ఆయన కుటుంబ సభ్యులను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కిమ్స్ లో పరామర్శించారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి అతడి కుటుంబ సభ్యులను అల్లు అరవింద్ అడిగి తెలుసుకున్నారు. రేవతి కుటుంబాన్ని పూర్తిగా ఆదుకుంటామని అల్లు అరవింద్ భరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం తమకు అన్ని విధాలుగా పూర్తిస్థాయిలో సహకరిస్తోందని చెప్పారు. అయితే, ఈ కేసు కోర్టు పరిధిలో ఉన్నందున అల్లు అర్జున్ ఆసుపత్రికి రాలేకపోయారని, అందుకే అల్లు అర్జున్ తరపున తాను ఆస్పత్రికి వచ్చానని అల్లు అరవింద్ చెప్పారు. అయితే, సంధ్య థియేటర్ తొక్కిసలాట వంటి ఘటనలు భవిష్యత్తులో రిపీట్ కాకుండా చూడాలని అల్లు అరవింద్ అన్నారు. అందుకు అవసరమైన భద్రతా చర్యలు నిర్వాహకులు తీసుకోవాలని కోరారు. విపరీతమైన క్రేజ్ ఉన్న సినిమాల విడుదల సమయంలో థియేటర్ల దగ్గరకు భారీ సంఖ్యలో వచ్చే జనాన్ని కంట్రోల్ చేసేందుకు తగు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని థియేటర్ల యాజమాన్యాలకు సూచించారు. భారీ సంఖ్యలో జనం వచ్చే ఈవెంట్లలో జనాన్ని కంట్రోల్ చేసేందుకు తగిన ప్రణాళిక ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ తొక్కిసలాటకు ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ జరుపుతున్నారని అన్నారు. తాను శ్రీతేజ్ ను స్వయంగా వెళ్లి పరామర్శిస్తానని అల్లు అర్జున్ కొద్ది రోజుల క్రితం చెప్పిన సంగతి తెలిసిందే.

## 22న కాశీలో రెండో పాట విడుదల

యువ సామ్రాట్ నాగచైతన్య నటిస్తున్న తండేల్ మూవీని చందూ మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. మోస్ట్ టాలెంటెడ్ సాయి పల్లవి కథానాయికగా నటిస్తున్నారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించారు, ఫస్ట్ సింగిల్ బుజ్జి తల్లి ఇప్పటికే 30 మిలియన్లకు పైగా వ్యూస్‌తో అన్ని మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానంలో ఉంది. బుధవారం మూవీ సెకండ్ సింగిల్- శివశక్తిని ఈనెల 22న కాశీలోని డివైన్ ఘాట్స్ లో లాంచ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

శ్రీకాకుళం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, పురాతన శ్రీ ముఖలింగం శివాలయాన్ని ప్రతిబింబించే ఈ పాట సంగీతపరంగా, విజువల్ గా అద్భుతంగా వుండబోతోంది. పండుగను అత్యంత వైభవంగా జరుపుకునే అనుభూతిని అందిస్తామని మేకర్స్ వాగ్దానం చేశారు. ఈ జాతర పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. శివ శక్తికి సంబంధించిన పోస్టర్‌లో నాగ చైతన్య, సాయి పల్లవి పవర్‌ఫుల్ శివ శక్తి ఫోజ్‌లో కనిపించడం ఆకట్టుకుంది. తండేల్ సినిమా ఫిబ్రవరి 7న గ్రాండ్‌గా విడుదల కానుంది.

## బలగం మొగిలయ్య మృతి



బలగం మూవీ ఫేమ్, జానపద కళాకారుడు మొగిలయ్య (67) మృతి చెందారు. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. బలగం సినిమా క్లైమాక్స్ లో వచ్చే పాట ప్రతి ఒక్కరి చేత కంటతడి పెట్టించింది. ఈ పాటను పాడిన మొగిలయ్య గత కొన్ని నెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. మొగిలయ్యకు కరోనా సమయంలో రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. అప్పటి నుంచి రెగ్యులర్ గా డయాలసిస్ చేయించుకుంటున్నారు. వైద్యం ఖర్చు ఎక్కువ కావడంతో మొగిలయ్య దంపతులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వైద్య ఖర్చులు బలగం సినిమా డైరెక్టర్ వేణు యెల్దండి, చిత్ర యూనిట్‌తో పాటు ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం అందించింది. చిరంజీవి కూడా ఆర్థికసాయం చేశారు. తాజాగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో గురువారం తెల్లవారుజామున మరణించారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకర్గంలోని దుగ్గొండి మొగిలయ్య స్వగ్రామం. ఆయన మృతికి బలగం చిత్ర దర్శకుడు వేణు యెల్దండి, నటీనటులు సంతాపం తెలిపారు.

## బుట్టబొమ్మ మళ్ళీ బిజీ అయిపోయింది!

ఓ మూడేళ్ళ క్రితం దాకా టాలీవుడ్ టాప్ ప్లేస్ ఎంజాయ్ చేసిన పూజా హెగ్డేను వరస బ్లాక్ బస్టర్లు ఉక్కిరిబిక్కిరి చేశాయి. అరవింద సమేత వీరరాఘవ, అల వైకుంఠపురములో లాంటి ఫుల్ లెన్త్ హిట్స్ తో పాటు స్పెషల్ సాంగ్ చేసిన రంగస్థలం కూడా బోలెడు పేరు తీసుకొచ్చింది. కానీ ఆ ఆనందం ఎక్కువ సేపు నిలవకుండా తెలుగు, తమిళ, హిందీలో క్యూ కట్టినట్టు డిజాస్టర్లు పలకరించడంతో ఒక్కసారిగా వెనుకబడిపోయింది. రాధే శ్యామ్, బీస్ట్, ఆచార్య, కిసీకా భాయ్ కిసీకా జాన్, సర్కస్ ఒకదాన్ని మించి మరొకటి టపా కట్టేయడంతో అవకాశాలు మందగించాయి. కానీ ఇప్పుడు బుట్టబొమ్మ మరోసారి తెగ బిజీ అయిపోయింది. ఆఫర్లు తిరిగి మొదలయ్యాయి. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య 44 షూటింగ్ అయిపోయింది. ఇది గ్యాంగ్ స్టర్ లవ్ స్టోరీ అని టాక్. రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు తలపతి విజయ్ చేస్తున్న చివరి చిత్రంలో ఈమే హీరోయిన్. ఇది భగవంత్ కేసరి రీమేకనే ప్రచారం బలంగా ఉంది. లారెన్స్ రాఘవేంద్ర కాంచన 4లో లాక్ అవ్వడం దాదాపు ఖరారే. అతి త్వరలో అధికారిక ప్రకటన ఇవ్వబోతున్నారు. దుల్కర్ సల్మాన్ సరసన ఒక రొమాంటిక్ ఎంటర్టైనర్ దాదాపు ఫిక్స్ అయినట్టే. షాహిద్ కపూర్ దేవా జనవరి చివరి వారంలో రిలీజ్ కానుంది. వరుణ్ ధావన్ తో డేవిడ్ ధావన్ రూపొందించే కామెడీ మూవీలోనూ పూజా హెగ్డే ఉంది. మొత్తంగా చూసుకుంటే తెలుగులో తప్ప ఇతర భాషల్లో పూజా హెగ్డేకు మంచి అవకాశాలే ఉన్నాయి. గుంటూరు కారంలో చేయాల్సిన పాత్ర అనుకోకుండా శ్రీలీలకు వెళ్ళిపోయాక ఇక్కడ మళ్ళీ వెల్కమ్ దక్కలేదు.



## సినిమాల నిర్మాణానికి ప్రోత్సాహకాలు



రాష్ట్రంలో సినిమా నిర్మాణాలకు పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నామని రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటక రంగ అభివృద్ధి సంస్థ మేనేజర్ శ్రీనివాస నాయక్ అన్నారు. శ్రీకృష్ణ ఆర్ట్స్ బ్యానర్‌పై డాక్టర్ రావిపాటి వీరనారాయణ సమర్పణలో అమిరినేని వెంకట్‌ప్రసాద్, సాదు చలపతి, కన్నెగంటి రవి, అనిల్ మూకిరి నిర్మాతలుగా కనిపర్తి రత్నాకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'శిశిరం'. ఆదిత్య మ్యూజిక్ ద్వారా రూపొందించిన ఈ చిత్రం ఆడియో సిడీలను శ్రీనివాసనాయక్, రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటక రంగ అభివృద్ధి సంస్థ మరో మేనేజర్ చల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రదేశంలోనైనా షూటింగ్‌లకు ఉచితంగా అనుమతులు ఇస్తున్నామన్నారు. చిత్ర నిర్మాణం పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగితే రూ.10 లక్షలు సబ్సిడీ అందించి చిత్ర నిర్మాణాన్ని సులభ తరం చేస్తున్నామన్నారు. సింగిల్ విండో పద్ధతిలో బ్యానర్, టైటిల్, లొకేషన్లకు అనుమతులు ఇస్తున్నా మన్నారు. ఔత్సాహిక నిర్మాతలు, దర్శకులు రాష్ట్రప్రభుత్వం ఇచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దర్శకుడు రత్నాకర్, పాటల రచయిత సురేంద్ర రొడ్డ మాట్లాడుతూ శిశిరం చిత్రంలోని పాటలను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేయటం సంతోషకరమన్నారు. పాటలకు సంగీత దర్శకుడు శాండీ అద్భుతమైన సంగీతాన్ని అందించారన్నారు. భవ్య తూములూరు శ్రావ్యంగా పాటలను ఆలపించారన్నారు.



# క్రీడలు



## అశ్విన్ ఆకస్మిక రిటైర్మెంట్ వెనక కారణాలేంటి?

ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్ మధ్యలో రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. సిరీస్ లో ఇంకా రెండు మ్యాచ్ లు మిగిలి ఉండగానే టీమిండియా స్పిన్నర్ ఇలా తన క్రికెట్ కెరీర్ ముగించడం చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్ ల సిరీస్ కు ఎంపికైన అశ్విన్ కు తొలి మ్యాచ్ లో అవకాశం దక్కలేదు. ఇక అడిలైడ్‌లోని ఓవల్ మైదానంలో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో అశ్విన్ ఒక్క వికెట్ మాత్రమే తీసుకున్నాడు. దీంతో బ్రిస్బేన్ టెస్టు మ్యాచ్‌కు సీనియర్ స్పిన్నర్ దూరమయ్యాడు. ఈ మ్యాచ్‌లో రిజర్వ్ బెంచ్‌కు పరిమితమైన అశ్విన్.. మ్యాచ్ ముగిసిన తర్వాత విలేకరుల సమావేశంలో అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే అశ్విన్ ఇఆకస్మిక రిటైర్మెంట్ పలు అనుమానాలకు దారితీసింది. టీమ్‌ఇండియాలో ఏదో జరుగుతోందంటూ కొందరు ప్రశ్నలు లేవదీస్తున్నారు. ఎందుకంటే అశ్విన్ ఈ సిరీస్ ద్వారా రిటైర్మెంట్ తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లయితే, అతను సిరీస్ ప్రారంభానికి ముందే ప్రకటించేవాడు. అయితే సిరీస్ మధ్యలో ఆయన హఠాత్తుగా రిటైర్మెంట్ తీసుకోవడానికి కారణమేంటని క్రికెట్ అభిమానులు ప్రశ్నిస్తున్నారు. కాగా ఆస్ట్రేలియాతో సిరీస్ ముగిసిన తర్వాత టీమిండియాకు చెందిన పలువురు సీనీయర్ ఆటగాళ్లు రిటైర్ అవుతారని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అందులో అశ్విన్ పేరు కూడా ఉంది. ఈ రూమర్లను నిజం చేస్తూ రవిచంద్రన్ అశ్విన్ హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇక టీం ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ సూచనల మేరకు సీనియర్ ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించాలని బీసీసీఐ గట్టి నిర్ణయం తీసుకుంటుందని ఎప్పటి నుంచో రూమర్లు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే అలా రవిచంద్రన్ అశ్విన్ తన కెరీర్‌ను సిరీస్ మధ్యలోనే ముగించుకున్నాడని తెలుస్తోంది. అశ్విన్ బాటలోనే మరికొందరు సీనియర్ క్రికెటర్లు రిటైర్మెంట్ తీసుకోనున్నారన్న వార్తలు ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ప్రస్తుతం జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా సీనియర్ ఆటగాళ్లు కొనసాగుతున్నారు. వారిలో 37 ఏళ్ల రోహిత్ శర్మ అందరీ కన్నా పెద్దవాడు. అందుకే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ తర్వాత రోహిత్ శర్మ కూడా టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వేళ డబ్ల్యూటీసీకి అర్హత సాధించకపోతే ఇదే అతనికి చివరి టెస్ట్ సిరీస్ అని తెలుస్తోంది.

## నిన్ను చూస్తేనే తెలుస్తుంది నువ్వు ఆటకు పనికిరావు

యువ క్రికెటర్ పృథ్వీ షా ముంబై జట్టులో తన స్థానం కోల్పోవడం, ఐపీఎల్2025 వేలంలో తీసుకోబడకపోవడం తీవ్ర చర్చలకు దారితీసింది. ఫిట్‌నెస్ లోపాలు, క్రమశిక్షణపై విమర్శలు అతని ప్రగతికి ఆటంకమయ్యాయి. కానీ తన నమ్మకాన్ని వ్యక్తం చేసిన పృథ్వీ, కష్టపడి తిరిగి తన స్థానాన్ని సంపాదించడానికి సిద్ధమవుతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీ కోసం పృథ్వీ షా ముంబై జట్టులో చోటు కోల్పోవడం క్రికెట్ ప్రేమికుల్లో చర్చకు దారితీసింది. యువ ఓపెనర్ పృథ్వీ తన ఆటలో టాలెంట్ చూపించినప్పటికీ, ఫిట్‌నెస్ సమస్యలు అతని ప్రస్థానంలో కీలక ఆటంకంగా మారాయి. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ సమయంలో పృథ్వీ సాధించిన సగటు ప్రదర్శన ఇప్పటికే విమర్శలకు గురవగా, అతని ఫిట్‌నెస్‌పై వచ్చిన తీర్పులు మరింత సంక్లిష్టం చేశాయి. ఇదే సమయంలో, ఢిల్లీ క్యాపిటల్స్ అతనిని ఐపీఎల్ 2025 వేలంలో విడుదల చేయడం, ఆ తర్వాత ఎవరు కొనుగోలు చేయకపోవడం పృథ్వీని మరింత నిరాశలోకి నెట్టింది. తన పరిస్థితిపై పృథ్వీ ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ సందేశం పోస్ట్ చేసి, తన నమ్మకాన్ని ప్రదర్శించాడు. "నేను ఇంకా ఏమి చూడాలి? నా స్టాట్స్ తగినంత కాదు అనిపిస్తే, ఇంకా నేను పని చేస్తాను. దేవుడు, నాతో ఉన్నాడు, ప్రజలు నన్ను నమ్ముతారని నమ్ముతున్నాను. నేను ఖచ్చితంగా తిరిగి వస్తాను" అంటూ షా తన మనసులోని భావాలను పంచుకున్నాడు. అయితే, పృథ్వీని జట్టులోంచి తొలగించడంపై ముంబై క్రికెట్ అసోసియేషన్ తన వైఖరిని క్లారిఫై చేసింది. వీజూ అంచనాల ప్రకారం, పృథ్వీ తిరిగి బలంగా ఆడగలిగే అవకాశముంది. "అతనిలో టాలెంట్ ఎంత గొప్పదో మాకు తెలుసు. ఇది అతను ఎంత హార్డ్ వర్క్ పెట్టగలడో దానిపైనే ఆధారపడి ఉంటుంది" అని వారు తెలిపారు. పృథ్వీ షా, క్రికెట్ ప్రేమికులకు తాను తిరిగి వస్తానని నమ్మకాన్ని కల్పిస్తూ, తన ఆటలో మరింత కఠినంగా శ్రమించి, తిరిగి తన స్థానాన్ని సంపాదించడానికి కృషి చేస్తాడనే ఆశాభావం నెలకొంది.



## ఇక పని అయిపోయిందని అనుకున్నారంతా..



శిఖర్ దావన్.. అంతర్జాతీయ క్రికెట్, ఐపీఎల్ నుండి రిటైర్ అయిపోయాడు.. ఇక తన పని అయిపోయింది అని అనుకున్నారు అందరూ.. కట్ చేస్తే..భారీ సెంచరీతో విధ్వంసం సృష్టించాడు. బిగ్ క్రికెట్ లీగ్‌లో నార్తర్న్ ఛార్జర్స్‌కు కెప్టెన్‌గా శిఖర్ ధావన్ కొనసాగుతున్నాడు. అయితే తాజాగా యూపీ బ్రిడ్జ్ స్టార్స్‌పై ధావన్ సెంచరీ చేశాడు. శిఖర్ ధావన్.. అంతర్జాతీయ క్రికెట్, ఐపీఎల్ నుండి రిటైర్ అయిపోయాడు కాదా.. ఇక అతని పని అయిపోయింది లే అని అందరూ అనుకున్నారు.. కట్ చేస్తే.. బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. బిగ్ క్రికెట్ లీగ్‌లో నార్తర్న్ ఛార్జర్స్‌కు కెప్టెన్‌గా శిఖర్ ధావన్ ఉన్నాడు. ఇటీవల యూపీ బ్రిడ్జ్ స్టార్స్‌పై ధావన్ సెంచరీ చేశాడు. 49 బంతుల్లో సెంచరీ సాధించిన ధావన్ కేవలం 63 బంతుల్లోనే 119 పరుగులు చేశాడు. ధావన్ తన ఇన్నింగ్స్‌లో 5 సిక్సర్లు, 14 ఫోర్లు బాదాడు. అఫ్గాన్ బ్యాట్స్‌మెన్ షెన్వారీతో కలిసి ధావన్ తొలి వికెట్‌కు 207 పరుగులు జోడించడం విశేషం. షిన్వారీ తన ఇన్నింగ్స్‌లో 11 సిక్సర్లు, 7 ఫోర్లు కొట్టాడు. అతను 46 బంతుల్లో అజేయంగా 111 పరుగులు చేశాడు. అతను చివరి వరకు నాటౌట్‌గా నిలవడంతో నార్తర్న్ ఛార్జర్స్ జట్టు 20 ఓవర్లలో 2 వికెట్లకు 271 పరుగుల భారీ స్కోరు చేసింది. శిఖర్ ధావన్, షిన్వారీల ధాటికి నార్తర్న్ ఛార్జర్స్ జట్టు 52 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. 271 పరుగుల భారీ స్కోరుకు ప్రత్యర్థి జట్టు 219 పరుగులు మాత్రమే చేయగలిగింది. హామిల్టన్ మసకద్జా 72 పరుగులు చేయగా, చిరాగ్ గాంధీ 62 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చేందుకు ప్రయత్నించినా అది కుదరలేదు.

## అతని వల్లే నేను ఇప్పుడు రిటైర్మెంట్ ఇచ్చా!



స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ క్రికెట్‌కి వీడ్కోలు ప్రకటించడంతో భారత క్రికెట్ ప్రపంచం భావోద్వేగంలో మునిగిపోయింది. 14 ఏళ్ల కెరీర్‌లో 537 టెస్టు వికెట్లు సాధించిన అశ్విన్, పింక్ బాల్ టెస్టుతో తన ప్రస్థానానికి ముగింపు పలికాడు. రోహిత్, కోహ్లీ సహా జట్టు సభ్యుల ప్రేమతో, అశ్విన్ తన రిటైర్మెంట్‌ను చిరస్మరణీయంగా మలిచాడు. స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ క్రికెట్‌కి వీడ్కోలు పలకడం భారత క్రికెట్ అభిమానుల హృదయాలను కలిచివేసింది. అశ్విన్ తన 14 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణానికి తుది పాదం వేసి, ఆస్ట్రేలియా టూర్ మధ్యలో రిటైర్మెంట్ ప్రకటించడంతో, క్రికెట్ ప్రపంచం ఒక్కసారిగా షాక్‌కి గురైంది. గబ్బా టెస్టు డ్రాగా ముగిసిన తర్వాత, రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్న అశ్విన్, భారత జట్టులో తన సహచరులతో పాటు అభిమానులను భావోద్వేగంలో ముంచెత్తాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి జట్టు సభ్యుల ప్రేమతో పాటు అభిమానుల ఆదరణను పొందుతూ, తన ప్రస్థానాన్ని అశ్విన్ గుర్తుచేసుకున్నాడు. అసలు ఆస్ట్రేలియాలోని పెర్త్ టెస్టు తర్వాత రిటైర్మెంట్ ప్రకటించాలని అనుకున్న అశ్విన్, కెప్టెన్ రోహిత్ అభ్యర్థన మేరకు తన నిర్ణయాన్ని వాయిదా వేసి, చివరి మ్యాచ్ పింక్ బాల్ టెస్టుగా ఆడాడు. రోహిత్ మాట్లాడుతూ, "అశ్విన్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం. అతను భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు, అతను అందించిన నమ్మకం అమూల్యం. అశ్విన్ మా ముఖాల్లో చిరునవ్వు తెప్పించేవాడు, అతనిని మేము ఎప్పటికీ మిస్ అవుతాం" అని తెలిపాడు. అశ్విన్ తన కెరీర్‌లో విశేషమైన రికార్డులను సొంతం చేసుకున్నాడు. 2010లో శ్రీలంక పర్యటనలో వన్డేతో అరంగేట్రం చేసిన అతను, టెస్టుల్లో అత్యుత్తమ స్పిన్నర్‌గా పేరు పొందాడు. 106 టెస్టుల్లో 537 వికెట్లు తీసిన అశ్విన్, 37 సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించాడు. వన్డేల్లో 156 వికెట్లు, టీ20ల్లో 72 వికెట్లు తీసి, త్రిముఖ ఫార్మాట్లలో 4,400 పరుగులు చేసిన అశ్విన్ బౌలింగ్‌తోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించాడు. క్రికెట్‌కు అశ్విన్ అందించిన సేవలు అమూల్యం. జట్టు విజయాల్లో అతని పాత్రను అభిమానులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. కెరీర్‌కు వీడ్కోలు పలికినా, అశ్విన్ క్రికెట్ ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోతాడు.

## అశ్విన్‌కు ఆస్ట్రేలియా మాజీ సారథి చిలిపి వీడ్కోలు!



భారత అద్భుత స్పిన్నర్ ఆర్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. 2020 ఐపీఎల్‌లో మన్కడింగ్ ఘటనను గుర్తుచేసుకుంటూ, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ ఆయనకు సరదా అభినందన సందేశం పంపాడు. అశ్విన్ ఆటకు ప్రపంచ క్రికెట్ దిగ్గజాలు ప్రశంసలతో నివాళులు అర్పించాయి, అభిమానుల్లో స్ఫూర్తిని చాటిచెప్పాడు. 2024 డిసెంబర్ 18న అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన భారత అద్భుత స్పిన్నర్ ఆర్ అశ్విన్‌కు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ సరదాగా మరపురాని సందేశం పంపించాడు. తన స్పోర్ట్స్ మాన్‌షిప్‌కి గౌరవం తెలియజేస్తూ, అశ్విన్ రనౌట్ చేయకుండా తనపై కనికరించిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నాడు. ఐపీఎల్ 2020లో జరిగిన ఒక మ్యాచ్‌లో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ఆడుతున్న ఆరోన్ ఫించ్, ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బౌలింగ్ చేస్తున్న అశ్విన్‌తో ఆ క్షణాన్ని పంచుకున్నాడు. అశ్విన్ తన మన్కడింగ్ నైపుణ్యానికి ప్రసిద్ధి చెందగా, ఫించ్‌ను తక్షణమే రనౌట్ చేయకుండా, హెచ్చరించటమే తన చర్యల ద్వారా క్రీడా స్ఫూర్తిని చూపాడు. ఆ ఘటనకు సంబంధించిన ఫొటోను ఫించ్ సోషల్ మీడియాలో పంచుకుంటూ ఇలా అన్నాడు.. ఆర్ అశ్విన్‌కి హృదయపూర్వక అభినందనలు. మీతో ఆడటం ఓ గొప్ప అనుభవం. నన్ను రనౌట్ చేయకుండా నా జీవితాన్ని కాపాడినందుకు ప్రత్యేక ధన్యవాదాలు!" అశ్విన్ తన రిటైర్మెంట్ ప్రకటన తర్వాత కూడా క్రికెట్‌తో తన అనుబంధాన్ని కొనసాగించనున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతూ, 2025 ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడతాడు. 106 టెస్టుల్లో 537 వికెట్లు, 116 వన్డేల్లో 156 వికెట్లు, 65 టీ20ల్లో 72 వికెట్లు తీయడంతో పాటు, 6 సెంచరీలతో 3503 పరుగులు చేసిన అశ్విన్ తన గౌరవనీయమైన ప్రస్థానాన్ని మరింత గొప్పగా మలిచాడు. ఆరోన్ ఫించ్ మాత్రమే కాదు, అశ్విన్ రిటైర్మెంట్ తర్వాత ప్రపంచ క్రికెట్‌లోని అనేక దిగ్గజాలు అతనిపై ప్రశంసల వర్షం కురిపించాయి. అశ్విన్ ఆటను చూస్తూ పెరిగిన అభిమానులకు, క్రికెట్ సోదరులకు, అతను ఎప్పటికీ ఒక స్ఫూర్తి. తన అద్భుతమైన ప్రదర్శనలతో, స్ఫూర్తిదాయకమైన నిర్ణయాలతో అశ్విన్ క్రికెట్ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందాడు.

# అర్ధ రాత్రి కొరుక్కుతినే చలిలో రైతన్న కష్టాలు




**ప్రజబలం :హైదరాబాద్ ప్రతినిధి,**సబ్బుబిల్ల... అగ్గిపుల్ల కాదేదీ ధర పెరగడానికి అనర్హం అన్నట్లు ప్రస్తుతం మార్కెట్లో ప్రతి వస్తువు ధర పెరుగుతోంది. దీన్ని ఉత్పత్తి చేస్తున్న వారు ధరను పెంచేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వాలు అడ్డు చెప్పడం లేదు. కంపెనీలకు నష్టమొస్తుందని ముందే ధర పెంచి అమ్మినా ప్రభుత్వాలు వారికి సహకారం అందించేస్తున్నాయి. సరే కంపెనీలో కార్మికులను దృష్టిలో ఉంచుకుని ఇంత చేస్తున్నారని సర్దిచెప్పుకోవచ్చు. కానీ ఇటీవల సినిమా వాళ్లు టికెట్ ధర పెంచుకునేందుకు, బెన్‌ఫిట్ షోలకు సైతం ప్రభుత్వం అనుమతించింది. అంటే సినిమా వాళ్లు నష్టపోవద్దని.. కానీ రైతు వద్దకు వచ్చేసరికి వారు ఎంతో కష్టపడి పండించే పంటకు మాత్రం సరైన ధర లభించేలా కృషి చేయడం లేదు. దీనికి కారణమేంటి..? రైతుల కష్టానికి విలువ లేదా.. విలువ దొరకదా?

పదేండ్ల క్రితం వరకు ఎడ్ల బండ్లతో దుక్కి దున్ని చదును చేసి పంటలు పండించేవారు. ఇప్పుడు యాంత్రీకరణతో పరిస్థితులు మారిపోయాయి. ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరిగాయి. దీంతో వ్యవసాయానికి పెట్టుబడి భారంగా మారింది. ఇది చాలదన్నట్లు మొన్నటి వరకు కూలీలు పొలాల్లో పనిచేస్తూ కనిపించేవారు. ఇప్పుడు పొలాల్లో కూలిపనికి వచ్చేవారు తగ్గిపోయారు. అయినా రైతులు మొక్కవోని ధైర్యంతో దేశానికి అన్నం పెట్టడానికి పొలాన్ని నమ్ముకుంటున్నాడు. విత్తనం నాటిన నుండి చేతికొచ్చే వరకు చేసే కష్టానికి రైతే బాధ్యుడవుతున్నాడు. కానీ తాను పండించే పంటకు మాత్రం ధర నిర్ణయించుకునే దిక్కులేని పరిస్థితి. సామాజికవేత సిరిసిల్ల నవీన్ కుమార్ తన ఆవేదన వ్యక్తం చేసారు.

ధర నిర్ణయించుకునే అధికారం కావాలి!

రాష్ట్రంలో సాగువుతున్న పత్తి పంటకు ఎకరానికి అవుతున్న ఖర్చెంత.. లభిస్తున్న ధర.. ఎంత.. రైతుకు దక్కుతున్నదో తెలిస్తే.. అసలు వ్యవసాయం చేసే రైతుల పరిస్థితి దయనీయం. దీనికి కారణం ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు ఒకటైతే.. వ్యాపారులు రైతులను వడ్డీ రూపంలో నడ్డి విరిచేయడం మరో కారణం. రైతులు ఎకరా పంట పండించడానికి 65వేల నుండి 75వేల వరకు ఖర్చుపెడుతున్నారు. మరి ఎకరానికి వచ్చే దిగుబడి ఎంత..? పంటపండిన రైతుకి ప్రతి ఏడాది ఇంకా అప్పు పెరుగుతూనే ఉంటుంది. ప్రభుత్వం కనీస మద్దతు ధర అంటూ ఆర్భాటం చేస్తున్నా.. అది కూడా రైతుకు దక్కడం లేదు. ఈ సమయంలో కార్పొరేట్ వ్యాపారులు ఎలా అయితే తమ ఉత్పత్తులకు తామే ధర నిర్ణయించి అమ్ముకోగలుగుతున్నారో అలాగే ప్రభుత్వం రైతుల పంటకు కూడా ధర నిర్ణయించి విక్రయించుకునే వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. రైతు వద్దకే వచ్చి పంట కొనుగోలు చేసే రోజులు రావాలి. బ్యాంకులు ఇచ్చే రుణాల పరిమితి పెంచగలగాలి. ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ అంటూ ఆర్భాటపు ప్రచారాలు కాకుండా రైతులకు ఏది అవసరమో.. పంట అమ్ముకునేందుకు ఏ విధంగా చర్యలు తీసుకుంటే వారికి లాభసాటిగా ఉంటుందో చూడాలి. రైతుకు సాయం కాదు.. పెట్టుబడి ఖర్చులు పోగా తన కుటుంబాన్ని పోషించుకునేందుకు కాస్త మిగిలేలా చూడాలి. అప్పుడే రైతు నిలదొక్కుకోగలడు. కూరగాయల రైతన్నాల ఆవేదన.

# దుండిగల్ సర్వేనెంబర్ 684 లోని ప్రభుత్వ భూమి కబ్జా !







**ప్రజాబలం న్యూస్–డిసెంబర్:19** కత్బులాపూర్,(దుండిగల్ – గండి మైసమ్మ)రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో విలువైన ప్రభుత్వ భూములు కనుమరుగవుతున్నాయి. కబ్జాల నుండి ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం కబ్జాదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కత్బులాపూర్ నియోజకవర్గం దుండిగల్ – గండిమైసమ్మ మండలం దుండిగల్ తండా – 2 సర్వేనెంబర్ 684లో ప్రభుత్వ భూములను కబ్జాదారులకు అప్పనంగా కట్టబెట్టేందుకు సంబంధిత అధికారులు మొగ్గుచూపుతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో భూముల ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతుండడం, సులువుగా డబ్బు సంపాదించేందుకు కొందరు స్థానిక నాయకులు పథకం పన్నారు. సర్వే నంబర్–684 లో బీఆర్ఎస్ నాయకుల కనుసన్నల్లో ప్రభుత్వ భూమిలో కమర్షియల్ షటర్లు, రూములు నిర్మిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేప్పటి పాత ఇంటి నంబర్లు వేసి అమాయకులకు కట్టబెడుతూ సొమ్ము చేసుకుంటున్నా దుండిగల్ రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడట్లేదని స్థానికులు మండిపడుతున్నారు. నెలనెలా లక్షల రూపాయలు జీతాలు అందుకుంటున్న రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు అమ్ముడు పోతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల వైఫల్యంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడడంలేదు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నా రెవెన్యూ అధికారులు సహకరించట్లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించం.. తహశీల్దార్ –సయ్యద్ అబ్దుల్ మతిన్‌సర్వే నంబర్ 684లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంది. గతంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. దుండిగల్ తండా–2లో లా అండ్ ఆర్డర్ సమస్య ఉండడం వల్ల అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు కొంత ఆలస్యమవుతుంది. త్వరలో అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకుంటాం.

# సేవే మా లక్ష్యం ఆర్ పి నాయుడు



ప్రజబలం :హైదరాబాద్,శీతాకాలాలు పూర్తి స్వింగ్‌లో వచ్చాయి! మనలో చాలా మంది రుచికరమైన శీతాకాలపు ఆనందాన్ని పొందుతూ వెచ్చని దుప్పట్లతో చుట్టబడి ఉండగా, చలి కాలం నుండి గడపడానికి కనీస శీతాకాల సౌకర్యాలను కలిగి ఉండే అదృష్టం లేని చాలా మంది ప్రజలు బయట ఉన్నారు.

మనలో చాలా మందికి శీతాకాలం రోజంతా మంచం మీద నిద్రపోవడమే, దురదృష్టవశాత్తూ వీధుల్లో నివసించే ప్రజలకు, సంవత్సరంలో అత్యంత చలిని తట్టుకుని జీవించడం మాత్రమే వారు కోరుకునేది. ఎక్కువ సమయం ఈ వ్యక్తులు నిద్రించడానికి వెచ్చని ప్రదేశాన్ని కనుగొనలేరు మరియు ప్రాథమిక భోజనాన్ని నిర్వహించలేరు. భయంకరంగా అనిపిస్తుంది, కాదా?

చలికాలం మన ఇంటి సహాయం లేదా సెక్యూరిటీ గార్డు వంటి మన చుట్టూ ఉన్న అనర్హులకు కూడా చాలా బాధలను తెస్తుంది. నివాసం లేకపోవడం, సరైన ఆహారం, ఉన్ని బట్టలు, కరెంటు కోతలు మొదలైన వాటి వల్ల వాతావరణం కఠినంగా మారడం వల్ల వారి మనుగడ కష్టమవుతుంది. మన హృదయం అక్షరాలా వారి కోసం పిలుస్తుంది.కొనసాగుతున్న చలికాలంలో నిరాశ్రయులైన ప్రజలను నైట్ షెల్టర్లలోకి తీసుకురావడానికి ప్రభుత్వం వివిధ ప్రాజెక్టులను ప్రారంభించింది. అనేక %చీ+ూ%లు కూడా అవసరమైన వారికి బట్టలు, దుప్పట్లు మరియు ఉన్ని అందించడానికి వివిధ ప్రచారాలను ప్రారంభించాయి. అయితే, ప్రతిరోజు ఉష్ణోగ్రతలు పడిపోతున్న ఈ సవాలు సమయాల్లో పేదలకు సహాయం చేయడం కోసం ఈ చొరవను వ్యక్తిగతంగా చేయడం మా బాధ్యత. అంటూ సుఖినోబావంతు సేవ సమితి నిర్వాహకులు.ఆర్ పి నాయుడు అన్నారు.

సుఖినోభవంతు ట్రస్ట్ తరపునుంచి (జెడ్ టి సి )ప్రాంతంలో నివసిస్తున్న లెప్రసీ కాలనీలో 100 బ్లాంకెట్స్ పంపిణీ చేయడం జరిగింది దీనికి సహకరించిన సుఖినోభవంతు ట్రస్టు సభ్యులందరికీ ధన్యవాదములు తెలియజేసారు.చాలా మంది దుర్బలమైన వారికి సహాయం చేయాలని ఆశ్చర్యపోతారు కానీ ఎలా చేయాలో ఖచ్చితంగా తెలియదు. కాబట్టి మేము ఇక్కడ కొన్ని సులభమైన మార్గాలను అందిస్తున్నాము, దీని ద్వారా మీరు భారీ సహాయాన్ని అందించవచ్చు మరియు సమాజంలో గొప్ప ప్రభావాన్ని చూపవచ్చు అని సుఖినోభావాంతు సుఖినోభవంతు సేవ సమితి వారు అన్నారు.

# బయో సైన్స్ టాలెంట్ టెస్ట్ లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎన్నారం పాఠశాల విద్యార్థిని.

### జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థిని.. డీఈవో చేతుల మీదుగా ప్రశంస పత్రం , షీల్డ్ అందుకున్న విద్యార్థిని సిరి



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయిలో రామన్నపేట మండలం ఎన్నారం గ్రామ పదవ తరగతి విద్యార్థినీ బండమీది సిరి తండ్రి శ్రీను అను విద్యార్థిని నేడు జరిగిన జిల్లా స్థాయి బయో సైన్స్ టాలెంట్ పరీక్షలో 12 మండలాల విద్యార్థులతో పోటీ పడి ద్వితీయ స్థానం పొంది , రాష్ట్ర స్థాయికి ఎంపిక అయిన బండమీది సిరి అనే విద్యార్థిని లియాదాద్రి జిల్లా %ఇజుూ% గారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం మరియు షీల్డ్ అందుకోవడం జరిగిందనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నమాల గారు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినికి పలువురు అభినందనలు తెలిపారు.. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేసి విద్యార్థులల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని బయటికి తీసే ప్రయత్నం నిరంతరం చేస్తున్నామని

గైడ్ టీచర్ నీలం శేఖర్ తెలిపారు..

ఈ కార్యక్రమంలో ఎమ్ఎన్ఓ శ్రీనివాస్ డీఈవో సత్యనారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జంగమ్మ , ఉపాధ్యాయులు జహీంగిర్ ,జగదీశ్వర చారి , విష్ణు , విజయ ప్రతాప్ , తదితరులు పాల్గొన్నారు..



# మేడ్చల్ జిల్లా యంత్రాంగానికి హైకోర్టు ఆదేశం

## ఎమ్మెల్యే లేకుండా చెక్కుల పంపిణీ వద్దు.. –హైకోర్టు




**కూకట్‌పల్లి, డిసెంబరు 19 (ప్రజాబలం న్యూస్ )** :కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు అందజేసే ఎలాంటి చెక్కులైనా స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లేకుండా పంపిణీ చేయొద్దని, ఎమ్మెల్యే లేకుండా నిర్వహించే అన్ని చెక్కుల పంపిణీ కార్యక్రమాలను ఈనెల 23 వరకు నిలిపేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంతోపాటు మేడ్చల్ కలెక్టర్, కూకట్‌పల్లి ఆర్డీవో, స్థానిక తహసీల్దార్‌కు జస్టిస్ మాధవీ దేవి ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కూకట్‌పల్లిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన బండి రమేశ్‌తో అధికారులు చెక్కులు పంపిణీ చేయిస్తున్నారని, ప్రజలు ఎన్నుకున్న తనను పక్కనపెట్టడం అక్రమమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం... ఈనెల 23 వరకు చెక్కుల పంపిణీ కార్యక్రమాలను నిలిపివేయాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను 23కు వాయిదా వేసింది.

# జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి 19 :** సి.ఎం. కప్ –2024 పోటీలలో భాగంగా కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు పోటీలలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలను జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి కీర్తి రాజ్ వీరు, షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ ఈ.డి. దుర్గాప్రసాద్,జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరితో కలిసి హాజరై క్రీడాకారులతో చదరంగం పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టిన సి.ఎం.కప్ –2024 పోటీలను జిల్లాలో విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. క్రీడా పోటీల నిర్వహణ కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని,జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 27వ తేదీ నుండి జనవరి 2,2025 వరకు రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని, జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.క్రీడలతో ఆరోగ్యంగా ఉండడంతో పాటు విద్య,ఉపాధి రంగాలలో రాణించేందుకు ఏకాగ్రత పెంపొందుతుందని, జీవితంలో ఎంచుకున్న ఉన్నత స్థానానికి ఎదిగేందుకు దోహదపడుతుందని అన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకుని క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,శిక్షకులు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో సాకారం

# కానున్న రైతుల దశాబ్దపు కల

**ధర్మారెడ్డి ,పిల్లాయిపల్లి కాల్వలకు 210.2 కోట్ల రూపాయలు మంజూరు పట్ల హర్షం...**

**గతంలో 320 కోట్ల రూపాయలు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే వేముల వీరేశందే**

**ఎమ్మెల్యేను కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపిన రామన్నపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**నిధుల మంజూరుతో ఉమ్మడి జిల్లాలో బీడు భూములు సాగులోకి**

**హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు నాయకులు**



**రామన్నపేట ప్రజాబలం ప్రతినిధి:డిసెంబర్ 19:** ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువలకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం 2,10.2 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించడం తో రైతుల దశాబ్దపు కాల చిరకాల కోరిక ప్రజాపాలన ప్రభుత్వంలో పూర్తికానుందని పిసిసి మాజీ కార్యదర్శి గోదాసు పృధ్విరాజ్ అన్నారు. రామన్నపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి ఆయనను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... రైతులను రాజుగా చూడాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వారు అన్నారు. రైతుల బాధలను గుర్తించి గతంలో 350 కోట్ల రూపాయలు, నేడు 210 .2కోట్ల రూపాయలు మంజూరు చేయించిన ఘనత రైతు బాంధవుడు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దే అన్నారు. ధర్మారెడ్డి పిల్లాయిపల్లి కాలువలకు నిధులు మంజూరు చేయించడంతో ఉమ్మడి జిల్లాలోని బీడు భూములు సాగులోకి రానున్నాయని తెలిపారు. కాలువల ఆధునీకరణ పనులు సంవత్సర కాలంలో పూర్తి అవుతాయని వారు

తెలిపారు. సాగునీటికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఇందుకోసం మూసీ ఆధారిత కాలువలకు నిధులు మంజూరు చేయడమే నిదర్శనం అన్నారు. ఈ నిధులతో కాలువల బెడ్ వెడల్పు పెంచడం, గైడ్వాల్స్ నిర్మాణం, భూసేకరణ చేపట్ట నున్నట్లు వారు తెలిపారు. 50 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్న కాల్వ ఆకృతిని 208 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా కాల్వ ఆకృతిని పెంచనున్నారని తెలిపారు. దీంతో పాటు కల్వర్టుల నిర్మాణం , భూసేకరణకు రైతులకు డబ్బులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. దీంతో కొన్ని వందల గ్రామాలు వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయని అన్నారు.

# నూతన ఆర్ఓఆర్ చట్టం 2024: పేదలకు భూహక్కుల రక్షణలో శ్రేష్ఠ సంకల్పం....



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు భూహక్కుల రక్షణ కల్పిస్తూ, నూతన భూభారతి ఆర్ఓఆర్ (%Record of Rights%) చట్టం 2024ను శాసనసభ ఆమోదించడం ఒక చారిత్రక ఘట్టమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్ అన్నారు . ఈ చట్టం వల్ల భూముల సమస్యలు పరిష్కారమవుతాయని, పేద రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతాయని గౌరీ శంకర్ గారు మీడియా సమావేశంలో వివరించారు.

"గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి యాప్ కారణంగా రైతులు తమ భూహక్కులను కోల్పోయి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పేదల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకువచ్చింది. ఇది పేద ప్రజలకు భూహక్కులను రక్షించే రక్షణ కవచంగా నిలుస్తుంది."

. ఇందిరమ్మ రాజ్యంలో లినూతన గ్రామ రెవెన్యూ వ్యవస్థను ప్రవేశపెట్టి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తానన్న నిర్ణయం తెలంగాణ ప్రజలు హ ర్శిస్తున్నారు. గ్రామము లో ఉండే రెవెన్యూ అధికారి వలన గ్రామ ప్రజలకు మంచి పాలన జరిగి వారికి అన్ని విధాల సమస్యలు పరిష్కారం అవుతాయని అభిప్రాయపడ్డారు.

"గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. రెవెన్యూ శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఈ చట్టం రూపొందించబడింది. ఇది రైతులకు న్యాయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

1. భూముల రికార్డు సవరింపు: ప్రతి గుంట భూమి పేదల పేరునే ఉండేలా రికార్డులను సవరించడానికి ఈ చట్టం సహాయపడుతుంది.
2. భూహక్కుల భద్రత: భూమి వివాదాలు నివారించేందుకు ఇది ముఖ్యమైంది. రైతులు తమ భూమిపై పూర్తిస్థాయి అధికారం పొందుతారు.
3. పేద రైతులకు భరోసా: పేదల భూములను రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. అని గౌరీ శంకర్ వివరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి వారి జీవితాల్లో వెలుగు నింపే విధంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.

రెవెన్యూ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి పేదల పక్షాన నిలబడి, వారి సంక్షేమానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. అని అన్నారు.

పేద రైతుల భూసంబంధిత సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ చట్టం దోహదం చేస్తుంది.

గత సమస్యలు %-% నూతన పరిష్కారాలు:

"ధరణి యాప్" వల్ల రైతుల మధ్య తీవ్ర భూవివాదాలు తలెత్తాయి. కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు జరిగాయి. కానీ, ఈ నూతన చట్టం ఆ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ఒక శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది.

ఇది తెలంగాణ లోని నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమలు చేయబడుతుంది.

భవిష్యత్ కోసం ఆశాజనక ప్రణాళికలు:

గౌరీ శంకర్ గారు మాట్లాడుతూ, ఈ చట్టం వల్ల భూసంబంధిత సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ చట్టం రైతుల జీవితాల్లో ఆర్థిక, సామాజిక భద్రత కల్పిస్తుందని, ప్రతి రైతు ఆశలు నెరవేరతాయని అన్నారు.

తెలంగాణ ప్రజలకు పిలుపు:

"ఈ నూతన ఆర్ఓఆర్ చట్టం పేదల సంక్షేమం కోసం ఉద్దేశించబడింది. పేదల అభివృద్ధికి ఇది మార్గదర్శకంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ చట్టాన్ని అర్థం చేసుకుని, సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను," అని గౌరీ శంకర్ గారు తెలిపారు.

సంఘజీవనానికి కొత్త దశ:

ఇందిరమ్మ పాలనలో పేదల సంక్షేమం పునర్నిర్మాణంలో నూతన ఆర్ఓఆర్ చట్టం ఒక ప్రధానమైన భాగమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు ప్రభుత్వం మీద నమ్మకం ఉంచి, తమ భవిష్యత్తు కోసం ఈ చట్టాన్ని తమ సంక్షేమానికి ఉపయోగించుకోవాలని గౌరీ శంకర్ కోరారు.

## అశ్లీల నృత్యాల కేసులో 17మంది అరెస్టు

ఏలూరు జిల్లా నిడమర్రు మండ లంలో బావయ్య పాలెం ఈనెల 12వ తేదీ రాత్రి రైస్ మిల్లులో జనసేనకి చెందిన నాయకుడు పుట్టినరోజు సందర్భంగా జరిగిన అశ్లీల నృత్యాలు ఘటనలో పోలీ సులు 17 మందిని అరెస్టు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులో కి వచ్చింది. ఈ నృత్యాలలో ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు హిజ్రాలను తీసుకొచ్చి ఫుల్లుగా మద్యం హిజ్రాలను నగ్నంగా ఉంచి చిందులు వేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. పుట్టి నరోజు పేరుతో అశ్లీల నృత్యాలు చేయడంపై గ్రామస్తులు మండిప డుతున్నారు. వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి ఇప్పటికే 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. భీమవరం కు చెం దిన ఇద్దరు హిజ్రాలు ఈ నృత్యా లలో పాల్గొన్నట్లు గుర్తించారు. అంతేకాక జనసేన సైతం దీనిపై చర్యలు చేపట్టింది.కు వినతి..

# అంబేద్కర్ గారిని కించపరిచిన అమిత్ షా ను 24 గంటలలో ఈ దేశ ప్రజలకి బహిరంగ క్షమాపణ చెప్పాలి



**ప్రజాబలం కొల్చారం మండలం డిసెంబర్ (19)మెదక్ జిల్లాకొల్చారం** మండలం రంగంపేటలో రోడ్డు ఎక్కిన దళిత సంఘాలు

అమిత్ షా ఈ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పనియెడల మా యొక్క డిమాండ్స్ :

అమిత్ షా గారిని మంత్రి పదవి నుంచి తొలగించాలి.

అమిత్ షా గారి పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి.

అమిత్ షా గారి పై దేశద్రోహం కేసు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు ఎవరికి ఏ ఒక్క అస్తిత్వానికి మాత్రమే చెందిన వాడు కాదు.

ఆ విషయం మీకు తెలిసినా కూడా మీ యొక్క వక్ర బుద్ధితో మీరు ఈరోజు పార్లమెంట్లో అంబేద్కర్ గారి మీద చేసిన వ్యాఖ్యలను బట్టి మీరు మనువాద భావజాలంతో ఉన్నారని మరోసారి రుజువు అయింది .

అంబేద్కర్ అంటే అందరివాడు

అంబేద్కర్ అంటే సమూల సాంఘిక ప్రక్షాళన వాది.

అంబేద్కర్ అంటే ప్రతిఘటన యోధుడు.

అంబేద్కర్ అంటే యధాతథ వాదాన్ని కూలదోసినా ఆలోచనకర్త.

ఈ దేశ సామాజిక పరిస్థితులకు ఇంతవరకు ఎవరు కల్పించని, ఊహించని ఒక ఆలోచన దృక్పథాన్ని సృష్టించిన మహోపాధ్యాయుడు అంబేద్కర్ గారు...

భారతదేశ మౌలిక రాజకీయ నిర్మాణాన్ని చారిత్రక భౌతిక వాదంతో విశ్లేషించిన తత్వవేత్త అంబేద్కర్ గారు...

అన్నీ కలిపి వెరసి సాంఘిక విప్లవకారుడు అంబేద్కర్ గారు...

రాత మాత్రమే బతుకుదెరువుగా బతుకుతున్న బడుగు వర్గాల బాంధవుడు అంబేద్కర్ గారు.

అలాంటి అంబేద్కర్ గారిని మీరు ఈరోజు నిండు పార్లమెంట్లో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఈరోజుకి మీకు అంబేద్కర్ పై కోపాన్ని ,ద్వేషాన్ని చూపుతున్నారంటే మీరు ఎంతటి మనువాదులో ఈ దేశ ప్రజలు గమనిస్తున్నారు.

ఇప్పటికే మీకు కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన సీట్లు దక్కకుండా దింపుడు గాలం మీద ఉన్నారు ఇకనైనా మీ బుద్ధి మార్చుకోకపోతే ఈ దేశ ప్రజలు మీకు రాజకీయ సమాధి కట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాము.

వెంటనే కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించాలి.

లేనియెడల ప్రధాని గారికి కూడా అంబేద్కర్ గారు అంటే గౌరవం లేదని ఈ దేశ ప్రజలకు రుజువు అవుతుంది..

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి, ఆకుల పెంటయ్య, సీనియర్ జర్నలిస్టు గామిని జైపాల్, బిజెఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జీ యెహాన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రోళ్ల సంజీవయ్య, టిఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సుల్తాన్నగారి కృష్ణ, టిఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు బంగరిగల్ల దుర్గయ్య, జిల్లా యువసేన నాయకులు, బాబయ్య, ఎంఎస్ఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు పుర్ర మహేష్, రవి,



రమేష్, దళిత నాయకులు గంగరాములు, కే గంగరాములు, లక్ష్మణ్, బ్యాగరి భూమయ్య, ప్రశాంత్, ఏసు, జాను, నితిన్, ముత్యాలు, మల్లేశం, లకన్, తదితరులు పాల్గొన్నారు

# సమగ్ర మాస్టర్ ప్లాన్ కొరకు డ్రోన్ ఏరియల్ సర్వే

# జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ డిసెంబర్ 19 :** ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2.0 పథకంలో ఎంపికైనందున ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర మాస్టర్ ప్లాన్ కొరకు డ్రోన్ ఏరియల్ సర్వే నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుండి రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్-వరంగల్తో కలిసి డ్రోన్ ఏరియల్ సర్వేను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని నివాస,వాణిజ్య, వ్యవసాయ భూముల గుర్తింపు,అభివృద్ధి, ఇతర అంశాల పరిశీలన కొరకు డ్రోన్ ఏరియల్ సర్వే నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని మున్సిపాలిటీలు వేగంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ సర్వేలో భాగంగా అమృత్ 2.0 సంబంధించి నివేదిక అందిన అనంతరం తదనుగుణంగా మాస్టర్ ప్లాన్లో మార్పులు చేసి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్గా మార్చేందుకు ప్రతిపాదనలు ఉన్నందున డ్రోన్ ఏరియల్ సర్వే ద్వారా భూముల సమాచారం సేకరించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డి,జిల్లా సంక్షేమాధికారి రౌఫా?న్,జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్వీరు, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్, జిల్లా టౌన్ %ఽ% కంట్రీ ప్లానింగ్ అధికారి, సంబంధిత అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి విద్యార్ధిని ఆత్మహత్యాయత్నం

కాకినాడ పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ కొత్తపల్లి మండలం, రమణక్కపేట గ్రామంలో పదవ తరగతి విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. యధావిధిగా స్కూలుకు వెళ్లేందుకు సిద్ధమైన చింతపల్లి నైపుణ్య (16), ఉదయం నిద్ర లేచినప్పటి నుండి తను పనులు తాను బాగానే చేసుకుందని, స్కూల్ కి వెళ్లేందుకు తల్లితో కుమార్తె జడలు కూడా వేయించుకుందని తల్లి చింతపల్లి సుభాషిణి వాపోయింది.

ఇంతలో ఏమైందో ఏమో తెలియడంలేదని, ఇంటి బయట కుమార్తె పడి ఉండడం చూసి ఏం చేయాలో అర్థం కాలేదని కన్నీరు మున్నీరవుతుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాలికను హుటాహుటిన పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు... అక్కడ నుండి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు...

### అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

కాకినాడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ను ఉద్దేశించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అంబేద్కర్ ను అవమానించడమేనంటూ సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి పేర్కొన్నారు. గురువారం కాకినాడ ఇంద్రపాలెం బ్రిడ్జి సెంటర్లో అంబేద్కర్ విగ్రహనీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.అమిత్ షాను కేబినెట్ నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు.వారికి రాజ్యాంగంపై నమ్మకం లేదని,అమిత్షా దేశానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో దళిత సంఘ నాయకులు అయితా బత్తుల రామేశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు...

# కనీసం 50 శాతం నగదు చెల్లించని వారిపై కేసు నమోదు

## జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం 19 :** 2022-23 సంవత్సరం రబీ సీజన్కు సంబంధించి వేలంలో ధాన్యం కోటాను దక్కించుకున్న రైస్ మిల్లర్లు కనీసం 50 శాతం నగదు చెల్లించని వారిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేసులు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు.2022-23 సంవత్సరం రబీ సీజన్లో జిల్లాలోని రైస్మిల్లర్లు 63 వేల 144 మెట్రిక్ టన్నుల ధాన్యంకు వేలం పాడుకోవడం జరిగిందని,ఈ నెల 18వ తేదీ వరకు 16 శాతంతో 10 వేల 268 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అందించడం జరిగిందని, ఇంకా 52 వేల 876 మెట్రిక్ టన్నులు బకాయి ఉన్నారని, లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లాలోని 23 రైస్మిల్లర్లు వేలం సంబంధిత నగదు, నిర్దేశిత లక్ష్యం కనీసం 50 శాతం పూర్తి చేయని పక్షంలో ఈ నెల 21వ తేదీ శనివారం సంబంధిత మిల్లర్లు,పూచికత్తు ఉన్న వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లా నుండి 2022-23 రబీకి సంబంధించి 103 కోట్ల రూపాయల విలువ గల ధాన్యం బకాయి ఉన్నారని, ఈ విషయంపై తక్షణమే స్పందించని పక్షంలో నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# అనుమతుల్లేని రియల్ ఎస్టేట్ లపై చర్యలు తీసుకోవాలి

## బీఎస్పీ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 19:**జైపూర్ మండలంలో పుట్టగొడుగుల పుట్టుకొచ్చిన అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం బహుజన్ సమాజ్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ జైపూర్ మండల తహసీల్దార్ వనజా రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా డిటిసిపి లేకుండా నాలా కన్వెన్షన్ చేయకుండా వ్యవసాయ భూములను అక్రమ లేఅవుట్లు చేస్తూ గజాల్లో అమ్ముతూ లక్షల్లో అర్జిస్తూ రైతులను కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని అన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో వ్యవసాయ భూములను గుంటలు ఎకరాల్లో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు గజాలలో రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. జైపూర్ మండల తహసిల్దార్ అక్రమ వెంచర్లు అక్రమ రిజిస్ట్రేషన్ లపై చర్యలు తీసుకోని ఎడల జిల్లా కలెక్టర్ మరియు సిఎస్ దృష్టికి తీసుకుపోతానన్నారు.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తం

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి డిసెంబర్ 19**హుజురాబాద్ డివిజన్ పరిధిలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు రైతులకు అందిస్తామని కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు ఎస్సారెస్పీ పరిధిలో ఉన్నటువంటి రైతులకు జనవరి ఒకటి నుంచి సాగునీరు విడుదల చేస్తామని దానికి సంబంధించిన ప్రణాళికలను అధికారులు రూపొందించారని ఈ విషయమై ఇప్పటికే అధికారులతో మాట్లాడమని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# కె. కె -5 గనిపై ఐ.ఎన్.టి.యూ.సి బాయి బాట



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 19 :**మందమర్రి ఏరియా లోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి గురువారం కె. కె - 5 గనిపై ఐ.ఎన్.టి.యూ.సి భాయి బాట నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐఎన్టియుసి మందమరి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య నేతృత్వంలో చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పనికి సరిపడా మాన్ పవర్ ఇవ్వడంలేదని, హాండ్ గ్లౌజులు సప్లై లేకపోవడం వలన ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. చలికాలం దృశ్య వామ్ కొట్స్ 30 మాత్రమే ఇవ్వడంతో షిఫ్ట్ కు 10 మాత్రమే వచ్చాయని అవి సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా వామ్ కొట్స్ అవసరం ఉన్నాయని, పనిముట్లు నాణ్యత లేకపోవడం వలన ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, డ్రిల్ బిట్స్ సరైన సప్లై లేదని తదితర సమస్యలతో పాటు మహిళా కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కూడా వివరించారు. అనంతరం గని మేనేజర్ అందుబాటులో లేనందున జనరల్ షిఫ్ట్ ఇన్చార్జి గారిని కలిసి ఈ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లగా తప్పకుండా మేనేజర్ దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ



సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు మాట్లాడుతూ ఏళ్ల నాటి కార్మికుల సొంతింటి కలను నిజం చేయడానికి కార్మికులకు ఆర్థిక పెనుబారంగా మారిన పేర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ మాఫీకై ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సహా మండల చైర్మన్ బి.జనక్ ప్రసాద్ అహర్నిశలు కృషి చేస్తున్నారని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్, కేంద్ర జాయింట్ జనరల్ సెక్రెటరీ మిట్ట సూర్యనారాయణ, కేంద్ర కార్యదర్శి పానుగంటి వెంకటస్వామి, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ శంకర్రావు, మహిళా విభాగం కేంద్ర కమిటీ ఉపాధ్యక్షురాలు కల్పన, ఫిట్ కమిటీ కార్యదర్శి బీమరపు సదయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ హనుమాండ్ల రాజేంద్రప్రసాద్, నాయకులు పవన్, కృష్ణ మోహన్, కలమండ స్వామి, పెద్దపల్లి రాజం, రాజేందర్, రవి, భూమయ్య, నరేష్, కందే రాజ్ కుమార్, రణవెన రాజ్ కుమార్, చంద్రమౌళి, రమేష్, సురేష్, కొమురయ్య, శ్రావణ్, గణేష్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల భవిష్య నిధిపై సమీక్షా సమావేశం



ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ డిసెంబర్ 19 :మందమర్రి ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్లో ఎస్.ఓ.టు జి.ఎం విజయ్ ప్రసాద్ అధ్యక్షతన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సీ.ఎం పి.ఎఫ్ రీజినల్ కమిషనర్-1 హరి పచౌరి పాల్గొన్నారు. ఈసందర్భంగా మందమర్రి ఏరియా యూనియన్ నాయకులు మరియు అధికారులతో కొత్త పెన్షన్ క్లెయిమ్స్, ప్రావిడెంట్ ఫండ్, సీ.ఎం.పి.ఎ.ఫ్ (భవిష్య నిధి), తదితర అంశాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీజీఎం ఎఫ్ అండ్ ఎ ఆర్ వి ఎస్ ఆర్ కే ప్రసాద్, డివైపిఎం ఎండి ఆసిఫ్, యూనియన్ నాయకులు, అన్ని గనుల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ జెండర్లు గౌరవప్రదంగా వైద్య సేవలను పొందాలని జిల్లా స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..**గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ట్రాన్స్ జెండర్ ల ప్రత్యేక మైత్రి క్లినిక్ ను అధికారులు, క్రాస్ జెండర్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ట్రాన్స్ జెండర్ వివక్షరహిత వైద్య సేవలను పొందేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మైత్రి క్లినిక్లను ఏర్పాటు చేసిందన్నారు.ట్రాన్స్ జెండర్లందరూ ఈ మైత్రి క్లినిక్ ల ద్వారా తమ గుర్తింపు కార్డులతో వైద్య సదుపాయాల్ని పొందవచ్చునని అని తెలిపారు. ప్రతి ఒక ట్రాన్స్ జెండర్ ట్రాన్స్ జెండర్ గుర్తింపు కార్డును పొంది, ప్రభుత్వ అందించు అన్ని రకాల లబ్ధి పొందాలన్నారు.ఈ గుర్తింపు కార్డులను పొందేందుకై ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు.ట్రాన్స్ జెండర్ లకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే 155326 హెల్ప్ లైన్ నంబర్ ను సంప్రదించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమరెడ్డి, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, నిర్మల్ సిడిపిఓ నాగమణి, ఏ సిడిపిఓ నాగలక్ష్మి, ట్రాన్స్ జెండర్లు,వైద్యశాఖ అధికారులు,ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి డిసెంబర్ 19** జమ్మికుంట మండలంలోని గండ్రపల్లె కస్తూరిబా పాఠశాలలో జమ్మికుంట సిఐ వరగంటి రవి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డ్రగ్స్ కు బానిసగా మారి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు. డ్రీమ్ను చంపే మహమ్మారి డ్రగ్(డ్రగ్స్ ఎండ్ ఆల్ డ్రీమ్స్) అని వివరించారు. తమ తల్లిదండ్రుల కలలు నెరవేర్చడం కోసమే చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తమ పిల్లలు ఉన్నతస్థాయికి వెళ్లాలని విద్యార్థుల తల్లిదండ్రులు చెమటోడ్చి ఎండనక, వాననక కష్టపడే సంగతిని విద్యార్థులు అనుక్షణం గుర్తు ఉంచుకోవాలని చెప్పారు. చెడు అలవాట్లు తమ దరి చేరకుండా స్టూడెంట్స్ జాగ్రత్తపడాలన్నారు. సిగరెట్లు, మత్తు పదార్థాల వంటివి అలవాటు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తారని, వాటిని అసలు తమ వద్దకు రానీయకుండా ముందుజాగ్రత్తతో విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని వెల్లడించారు. డ్రగ్స్ కేసులో పట్టుబడితే మైనర్ అయినా కఠినతరమైన శిక్షలుంటాయని, 5 ఏండ్ల వరకు జైలు శిక్షతో పాటు నాన్ బెయిలబుల్ కేసులు నమోదవుతాయాని వివరించారు.



# చిట్కుల్ లో పోలీసులు

## కార్డెన్ అండ్ సెర్చ్

సంగారెడ్డి పటాన్ చెరు మండల్ చిట్కుల్ గ్రామ పంచాయతీ పరిధిలో వడ్డెర బస్తిలో ఎస్పీ ఆదేశాల మేరకు డి.ఎస్.పి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 10 టాటా ఏసీలు, 70 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు సరైన పత్రాలు లేకుండా ఉన్న వాటిని సీజ్ చేశామని వాటిని పూర్తిస్థాయిలో విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని పటాన్ చెరు డి.ఎస్.పి రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్డెన్ సెర్చ్ లో 8 మంది సీఐలు, 20 మంది ఎస్సైలు, వందమంది కానిస్టేబుళ్లు హాజరయ్యి స్థానిక ప్రజలకు నేరాలపై అవగాహన కల్పించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com